మహాశోభ

నేడు శివరాత్రి.. ఆలయాలు ముస్తాబు

భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు


త్రిపురాంతకంలో ధగధగలాడుతున్న ఆలయాలు


ఒంగోలు నగరం కొత్తపట్నం బస్టాండ్‌లోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివలింగం

జిల్లావ్యాప్తంగా మహాశివరాత్రి శోభ నెలకొంది. శుక్రవారం జరగనున్న పండుగకు అన్ని ఆలయాలు ముస్తాబయ్యాయి. విద్యుత్ దీపాలతో వెలిగిపోతున్నాయి. గురువారం అర్ధరాత్రి లింగోద్భవ అభిషేకాలతో పూజలు ప్రారంభంకానున్నాయి. ఈ నేపథ్యంలో ఆలయాలకు తరలివచ్చే భక్తుల కోసం పాలక మండళ్లు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నాయి. - ఒంగోలు కల్చరల్


విద్యుత్ దీప కాంతులతో పొదిలిలోని నిర్మమహేశ్వరస్వామి ఆలయం

మొక్కుబడి

అజెండాలోని ప్రధాన అంశాలపై లేని చర్చ

మంత్రులు, ఎమ్మెల్యేలు గైర్హాజరు

కేవలం తాగునీరు, ఇతర సమస్యలను ప్రస్తావించిన ఐదుగురు సభ్యులు

జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి మార్గం చూపాల్సిన జిల్లా పరిషత్ సమావేశం మొక్కుబడిగా జరిగింది. అజెండాలో కేవలం మూడు అంశాలను మాత్రమే ఉంచగా వాటిపై కూడా చర్చ కరువైంది. జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా), పంచాయతీరాజ్‌పై ఒక్కరంటే ఒక్కరు కూడా మాట్లాడలేదు. తాగునీరు, ఇతర సమస్యలపై అర్ధగంటపాటు జరిగిన చర్చలో ముగ్గురు సభ్యులు మాత్రమే పాల్గొన్నారు. ఒకరిద్దరు చిన్నచిన్న సమస్యలను ప్రస్తావించి మమ అనిపించారు. అదేసమయంలో కొందరు సభ్యులు రాజకీయ అంశాలను ప్రస్తావిస్తూ ప్రసంగించడం చర్చనీయాంశమైంది. ఎంతో ప్రాధాన్యత కలిగిన సమావేశానికి మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరుకాకపోవడం విమర్శలకు తావిచ్చింది.



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, పక్కన జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ

మిగిలిన అంశాలను పట్టించుకోని వైనం

రాజకీయ ప్రసంగాలకే కొందరు ప్రాధాన్యం

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం తీరుతెన్ను ఇది

ఒంగోలు (కలెక్టరేట్), మార్చి 7 : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక పాత జడ్పీ సమావేశం హాలులో గురువారం చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన జరిగింది. ఉదయం 10 గంటల నుంచి స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. మధ్యాహ్న భోజన విరామ సమయం వరకూ అది కొనసాగింది. ఆ వెంటనే సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అయితే అజెండాలో డ్వామా, పంచాయతీరాజ్, తాగునీరు, పారిశుధ్యం అంశాలను మాత్రమే ఉంచగా రెండు అంశాలపై చర్చ కరువైంది. తాగునీటి సమస్యపై మాత్రమే అతికొద్ది మంది సభ్యులు మాట్లాడారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ముందుగా అజెండాలోని రెండు అంశాలపై సభ్యులు మాట్లాడకపోవడంతో తదుపరి అంశమైన గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య కార్యక్రమాలను చర్చకు ఉంచారు. ఈ సందర్భంగా చీమకుర్తి జడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు మాట్లాడుతూ రామతీర్థం నుంచి దక్షిణం వైపు గ్రామాలకు మంచినీటి కోసం ఏర్పాటు చేస్తున్న పైపులైన్ నిర్మాణం మధ్యలో నిలిచిపోయిందని సమావేశం దృష్టికి తెచ్చారు. ఆ సమస్యను పరిష్కరించాలని కోరారు. హనుమంతునిపాడు ఎంపీపీ గాయం సావిత్రి మాట్లాడుతూ సాగర్ నీరు వచ్చే పైపులైన్లు పగిలిపోయాయని, వాటిని సరిచేయాలని విజ్ఞప్తి చేశారు. కనిగిరి జడ్పీటీసీ సభ్యుడు కస్తూరిరెడ్డి మాట్లాడుతూ కనిగిరి పట్టణంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో నీటి సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ దృష్ట్యా ట్యాంకర్ల ద్వారా నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయా అంశాలపై కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ తాగునీటి ఎద్దడి నివారణకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. తాగునీటి సరఫరా చేసిన ట్యాంకర్ల యజమానులకు పెండింగ్ బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రస్తుతం 58 ఆవాసాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. ఎక్కడైనా సమస్య ఉంటే సంబంధిత ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తెస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణా లు పూర్తయ్యాయన్న ఆయన త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ రానున్నందున వాటిని ప్రారంభించేందుకు ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.

రాజకీయ ప్రసంగాలకు వేదికైన జడ్పీ సమావేశం

రాజకీయ ప్రసంగాలకు జిల్లా పరిషత్ సమావేశం వేదిక కావడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైసీపీ అభ్యర్థులను గెలిపించుకొని మరోసారి జగన్‌ను సీఎం చేసుకుందామన్నారు. ఇంకొల్లు జడ్పీటీసీ సభ్యురాలు శ్రీలక్ష్మీ మాట్లాడుతూ ఏడాది కాలంగా పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న వ్యక్తితో అనేక ఇబ్బందులు పడ్డామన్నారు. మా మొరను సీఎం ఆలకించి ఆయన్ను మార్చారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని మరోసారి గెలిపించుకోవాలని కోరారు. అదేవిధంగా పలువురు సభ్యులు రాజకీయ ప్రసంగాలు చేయడాన్ని చూసి ఇతర సభ్యులు ఆశ్చర్యపోయారు.

ముఖ్య ప్రజాప్రతినిధులు గైర్హాజరు

జడ్పీ సర్వసభ్య సమావేశానికి మంత్రులు, శాసనసభ్యులు గైర్హాజరయ్యారు. ఒంగోలు ఎంపీ మాగుంట మినహా ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాలకు చెందిన శాసనసభ్యులెవ్వరూ హాజరు కాలేదు. దీనిపై ప్రజల నుంచి నిరసన వ్యక్తమవుతోంది.

బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి

జిల్లా నుంచి రేషన్ బియ్యం అక్రమంగా తరలిపోతున్నా సంబంధితశాఖల అధికారులు పట్టించుకోవడం లేదని త్రిపురాంతకం జడ్పీటీసీ సభ్యుడు మాకం జాన్‌పాల్ ఆరోపించారు. జడ్పీ సమావేశంలో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. ఇక్కడి నుంచి ప్రతినెలా రూ.100 కోట్ల బియ్యం బ్లాక్ మార్కెట్‌కు వెళ్తున్నదన్నారు. ఆధారాలతో సహా అనేక పర్యాయాలు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. స్పందించిన కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రేషన్ పంపిణీ జరిగే సమయంలో తనిఖీలు నిర్వహించి సరుకులో తేడాలు ఉంటే 6ఎ కేసులు నమోదు చేయాలన్నారు.

వైసీపీ నేతల పంతం

వారి ఒత్తిడితో వెటర్నరీ ఉద్యోగినిని విధుల్లోకి చేర్చుకోని ఎంపీడీవో

తండ్రితో కలిసి కార్యాలయం వద్ద బైఠాయించిన యువతి

బీసీ సంఘాల నేతల మద్దతు

సమాధానం చెప్పకుండా బైక్‌పై ఉడాయించిన ఎంపీడీవో


ఎంపీడీవో కార్యాలయంలో నిరసనకు దిగిన ఉద్యోగిని

కనిగిరి, మార్చి 7 : వైసీపీ ప్రభుత్వంలో బీసీలకే పెద్దపీట అంటూ సీఎం ఊకదంపుడు ఉపన్యాసాలు చేస్తుండగా, క్షేత్రస్థాయిలో అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ ఉద్యోగం పొందిన నేతన్న కుమార్తెను అధికార పార్టీ నేతల ఒత్తిడితో ఉద్యోగంలో చేర్చుకోకుండా ఎంపీడీవో తన కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారు. తిరిగి, తిరిగి వేసారిన ఆమె తన బాబాయి, తండ్రితో కలసి ఎంపీడీవో కార్యాలయంలో బైఠాయించి గురువారం నిరసనకు దిగారు. వివరాల్లోకి వెళితే.. ప్రకాశం జిల్లా కనిగిరి మండలంలోని యడవల్లి గ్రామానికి చెందిన గోదిన సంధ్య గతేడాది సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ ఉద్యోగం కోసం పరీక్షలు రాశారు. ఉత్తీర్ణురాలైన సంధ్యకు ఈ ఏడాది మార్చి 1న కలెక్టర్ కనిగిరి మండలంలోని యడవల్లి సచివాలయంలో ఏహెచ్ఏగా పోస్టింగ్ ఇచ్చారు. దీంతో విధుల్లో చేరేందుకు సంధ్య అదేరోజు ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లారు. ఆ సమయంలో ఎంపీడీవో లేరు. ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఉన్న సీనియర్ అసిస్టెంట్ రహమత్‌కు జాయిన్ ఆర్డర్‌ను అందించారు. ఇక్కడే వైసీపీ నేతలు రంగప్రవేశం చేశారు. మాకు తెలియకుండా, మా ప్రసన్నం లేకుండా యడవల్లిలో ఎలా ఉద్యోగం చేస్తుందంటూ సంధ్య జాయినింగ్‌ను అడ్డుకున్నారు. చేసేది లేక బాధితురాలు తన తండ్రి, బాబాయితో కలసి ప్రతిరోజూ ఎంపీడీవో కార్యాలయం చుట్టూ తిరుగుతోంది. యడవల్లి గ్రామానికి చెందిన వైసీపీ నేతలు తమ అధికారాన్ని అడ్డం పెట్టుకుని యువతి ఉద్యోగంలో చేరకుండా అడ్డుకుంటున్నారని ఆమెతోపాటు తండ్రి, బాబాయి ఆరోపించారు. చేసేది లేక గురువారం కనిగిరి ఎంపీడీవో కార్యాలయంలో నిరసనకు దిగారు.

సమాధానం దాటవేసి బైకుపై ఉడాయించిన ఎంపీడీవో

యువతి నిరసనకు దిగడంతో యడవల్లి గ్రామానికి చెందిన వైసీపీ నేతలు ఎంపీడీవో కార్యాలయం వద్దకు చేరుకున్నారు. సైగలతో ఎంపీడీవో సమాధానం చెప్పకుండా చేశారు. యువతిని జాయిన్ చేసుకోకపోవడానికి కారణాలు చెప్పాలని మీడియా నిలదీయడంతో పాలనాపరమైన ఇబ్బందుల వలన చేర్చుకోలేదంటూ దాటవేసే ధోరణితో ఎంపీడీవో సమాధానం చెప్తూ కార్యాలయం నుంచి బైక్‌పై ఉడాయించారు.

యువతికి మద్దతుగా బీసీసంఘాల నేతలు

చేనేత యువతిని ఉద్యోగంలో చేర్చుకోకుండా ఇబ్బందులు పెట్టడం ఎంతవరకు సమంజసమని బీసీ, చేనేత సంఘాల నేతలు మండిపడ్డారు. బాధితురాలికి మద్దతుగా వాళ్లూ నిరసనకు కూర్చున్నారు. చేనేత నేతలు కొత్తా సుబ్బారావు, రాష్ట్ర దేవాంగుల సంక్షేమ సంఘం చైర్మన్ రఘురాములు, బీసీ సంఘం నేతలు మాలకొండరావు, సిద్ధాంతి బారాయిమాం పాల్గొన్నారు.

ఇక్కడి పంటలను ఎండబెట్టి.. పొరుగు జిల్లాకు నీళ్లు!

మోపాడు నుంచి నిబంధనలకు విరుద్ధంగా విడుదల

ఇరిగేషన్ అధికారులపై రైతుల ఆగ్రహం

ప్రభుత్వం మారేలోపు చేపలు పట్టుకునేందుకు

వైసీపీ నేతల కుట్రని ఆరోపణ


కాలువలో పారుతున్న నీళ్లు

పామూరు, మార్చి 7 : ఇరిగేషన్ అధికారుల తీరుపై మోపాడు ఆయకట్టు రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ పంటలను ఎండబెట్టి నెల్లూరు జిల్లా రైతుల కోసం నీరు విడుదల చేయడాన్ని ఆక్షేపిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా, అది కూడా రాత్రి వేళ విడుదల చేయడంపై పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు వచ్చే లోపు రిజర్వాయర్‌లో ఉన్న చేపలను పట్టుకునేందుకు వైసీపీ నేతలు అధికారులపై ఒత్తిడి తెచ్చి నీటిని ఇలా బయటకు పంపిస్తున్నారని ఆరోపిస్తున్నారు. నిబంధనల మేరకు రిజర్వాయర్ నీటి మట్టం 20 అడుగుల మేర ఉన్నప్పుడే నెల్లూరు జిల్లా కొండాపురం ఆయకట్టు రైతులకు ఇవ్వాలి. అయితే ప్రస్తుతం 10 అడుగుల నీటి మట్టం ఉంది. కానీ అధికారులు కొండాపురం రైతుల కోసం అని విడుదల చేశారు. దీంతో ఇక్కడి రైతులు మండిపడుతున్నారు.

చేపల కోసమే అంటున్న రైతులు

ఈ ఏడాది సొసైటీ ద్వారా చేపల పెంపకానికి లీజు తీసుకున్న వైసీపీ నాయకులు వాటిని పట్టుకునేందుకు ఇతర ప్రాంతాల వారికి అనుమతిస్తూ కోట్ల రూపాయలకు విక్రయించారు. ప్రస్తుతం 10 అడుగలపైనే నీటి మట్టం ఉండడంతో చేపల వేట సాధ్యం కాదని భావించారు. ప్రభుత్వం మారే లోపు రిజర్వాయర్‌లో ఉన్న మత్స్య సంపదను కొల్లగొట్టేందుకే వైసీపీ నేతలు ఒక పన్నాగం ప్రకారం నీటిని విడుదల చేయిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఆయకట్టు రైతులతో సమావేశం నిర్వహించి నీటి మట్టం ఎంత ఉన్నదీ, పంటలకు అవసరమైన నీటి విడుదలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

ఏప్రిల్ వరకూ ఇక్కడ పంటలకు తడి అవసరం

మోపాడు ఆయకట్టులో ఈ ఏడాది ఆరుతడి పంట వేయాలని అధికారులు సూచించినప్పటికీ కొందరు వైసీపీ నాయకులు వారికి అనుకూలంగా ఉన్న గ్రామాల్లో వరిని సాగు చేయించారు. జిల్లాలోని ఆయకట్టు పరిధిలో సుమారు 400 ఎకరాల్లో వరి సాగులో ఉంది. దీంతోపాటు తెల్లజొన్న 1200 ఎకరాలు, నువ్వు 200 ఎకరాల్లో వేశారు. వరి పంటకు ఏప్రిల్ వరకు తడులు అవసరమని రైతులు చెప్తున్నారు. తాము నీటిని పొదుపుగా వాడుకుంటున్న సమయంలో ఇష్టానుసారంగా అధికారులు నెల్లూరు జిల్లా రైతులకు రాత్రివేళ విడుదల చేయడంపై నిరసన తెలుపుతున్నారు. ఇలాగైతే ఇక్కడ పంటలు నష్టపోతామని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ఎస్ఈ ఆదేశాల మేరకు విడుదల : రవి, ఇరిగేషన్ డీఈ

నెల్లూరు జిల్లా కొండాపురం ప్రాంతంలో 100 ఎకరాల్లో వరిని సాగుచేశారు. తక్షణమే పంటను కాపాడుకునేందుకు నీటిని ఇవ్వాలని ఇరిగేషన్ శాఖ ఎస్ఈ లక్ష్మీరెడ్డి నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో నీటిని విడుదల చేశాం.



దర్శి అభ్యర్థిపై ప్రత్యేక కసరత్తు

జనసేనకు కేటాయింపు

పరిశీలనలో శిద్దా, చైతన్య, డాక్టర్ లక్ష్మి, వెంకట్ తదితరుల పేర్లు

మాగుంటను కలుస్తున్న ఆశావహులు

టీడీపీ దర్శి బాధ్యతలు రవికుమార్‌కు?

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

జిల్లాలో దర్శి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి దీటైన అభ్యర్థిని రంగంలోకి దింపేందుకు టీడీపీ, జనసేన పార్టీల అధినేతలు ఉమ్మడి కసరత్తు చేస్తున్నారు. పొత్తులో భాగంగా దర్శి సీటును జనసేనకు కేటాయించారు. అయితే అభ్యర్థి ఎంపికలో గెలుపే ముఖ్యంగా ఇరు పార్టీల నాయకులు ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో జనసేనకు 24 అసెంబ్లీ సీట్లు కేటాయించగా, జిల్లాలో దర్శిని ఆపార్టీకి ఖరారు చేశారు. తనను కలిసిన వారికి ఒంగోలు ఎంపీ మాగుంట కూడా దర్శి జనసేనకే కేటాయించినట్లు స్పష్టంగా చెబుతున్నారు. ఆ నియోజకవర్గంలో ప్రస్తుతం జనసేన తరఫున ఎన్ఆర్ఐ గరికపాటి వెంకట్ పనిచేస్తున్నారు. ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు రియాజ్ కూడా జిల్లాలో ఎక్కడ నుంచైనా తనకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ప్రస్తుతం వివిధ రకాల అంశాలను దృష్టిలో ఉంచుకుని ఆర్థిక, అంగ బలాలను లెక్కించి దీటైన అభ్యర్థిని రంగంలోకి దించేందుకు ప్రయత్నిస్తున్నారు. తొలుత ఆ నియోజకవర్గం నుంచి కాపు సామాజిక వర్గం అభ్యర్థిని పోటీలోకి దించాలని టీడీపీ అధినేత చంద్రబాబు భావించారు. జనసేనకు సీటు కేటాయించిన తర్వాత వేరే వారికి ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. తదనుగుణంగా ఇరుపార్టీల అగ్రనేతలు టికెట్ ఆశిస్తున్న వారిలో కొందరు ముఖ్యులపై కసరత్తు చేస్తూ సర్వేలు కూడా చేయిస్తున్నారు.

రంగంలోకి నలుగురు

జనసేన తరఫున ప్రస్తుతం పనిచేస్తున్న వెంకట్‌తోపాటు రాజకీయంగా మరో ముగ్గురు తాజాగా రంగంలోకి వచ్చారు. 2014లో అక్కడ ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా పనిచేసిన శిద్దా రాఘవరావు లేదా ఆయన కుమారుడి పేరు పరిశీలనలో ఉన్నట్లు తెలిసింది. తొలుత టీడీపీ నుంచి వారు టికెట్ ఆశించగా జనసేన నుంచే రావాలని సూచించారు. రెండు రోజుల నుంచి శిద్దా అనుచరులు ఆయన్ను కలవడం, నియోజకవర్గంలో ఆయన బరిలోకి దిగొచ్చని చెబుతుండడం గమనార్హం. ప్రస్తుతం ఆయన వైసీపీలో ఉన్నందున ధైర్యంగా ముందుకు వస్తారా? లేదా? అన్న అనుమానాలు ఉన్నప్పటికీ టీడీపీ, జనసేన అధినేతల వద్ద ఒక ముఖ్యనేత ఆయన పేరు ప్రతిపాదిస్తున్నట్లు తెలుస్తోంది. వైసీపీలో అన్యాయం చేశారంటూ టీడీపీ వైపు దృష్టిసారించిన మాజీ ఎమ్మెల్యే గరటయ్య కుమారుడు చైతన్య రంగంలో ఉన్నారు. వారు ఇటు చంద్రబాబుతోపాటు జనసేన అగ్ర నేతలను కలిశారు. తాజాగా మాజీ మంత్రి గొట్టిపాటి హనుమంతరావు కుమారుడు నరసయ్య కుమార్తె అయిన డాక్టర్ లక్ష్మి జనసేన తరఫున టికెట్ ఆశిస్తున్నారు. కాగా ఈ సెగ్మెంట్ ఒంగోలు లోక్‌సభ పరిధిలో ఉండడంతో ఆశావహులు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డిని కలుస్తున్నారు. ఆయన కుమారుడు రాఘవరెడ్డి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయబోతున్నారు. ఇప్పటికే డాక్టర్ గరటయ్య, చైతన్య ఆయన్ను కలిశారు. గురువారం డాక్టర్ లక్ష్మి కుటుంబ సభ్యులు వచ్చి మాగుంటతో భేటీ అయ్యారు. శిద్దా కుటుంబ సభ్యులు కూడా మాగుంటకు టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బీజేపీతో చర్చలు జరిపేందుకు ఢిల్లీలో ఉన్న చంద్రబాబు, పవన్‌లు రాష్ట్రానికి వచ్చాక ప్రకటించే జాబితాలో దర్శి అభ్యర్థి కూడా ఉండే అవకాశముంది.

రవికుమార్‌కు టీడీపీ బాధ్యతలు!

దర్శి నియోజకవర్గ టీడీపీ బాధ్యతలు హర్షిణి విద్యా సంస్థల అధినేత గోరంట్ల రవికుమార్‌కు ఇచ్చే అవకాశముంది. విద్యాసంస్థల అధినేతగా సుపరిచితులైన ఆయన రెండేళ్ల నుంచి టీడీపీ రాజకీయాల్లో పాల్గొంటున్నారు. దర్శి నియోజకవర్గంలో కొన్ని కార్యక్రమాల బాధ్యతలు చూశారు. గురువారం టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడిని ఆయన కలిసినప్పుడు అసెంబ్లీ జనసేనకు కేటాయించినందున పార్టీ బాధ్యతలను ఇచ్చే అవకాశాన్ని పరిశీలిస్తున్నామని ఆయన హామీ ఇచ్చారు. అయితే అధికారికంగా నిర్ణయాన్ని వెల్లడించాల్సి ఉంది.


ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో బాబు, పవన్ చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న నేతలు

బీసీ డిక్లరేషన్‌పై టీడీపీ సంబరాలు

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 7 : మంగళగిరిలో బుధవారం జరిగిన జయహో బీసీ సభలో టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ సంయుక్తంగా డిక్లరేషన్ ప్రకటించడంతో ఒంగోలులో ఇరు పార్టీల నాయకులు సంబరాలు చేసుకున్నారు. గుంటూరు రోడ్డులోని టీడీపీ కార్యాలయం వద్ద చంద్రబాబు, పవన్ కల్యాణ్, దామచర్ల జనార్దన్ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు.

స్పీడు పెంచిన బీఎన్ !



చదలవాడ వద్ద జనసేన నిర్వహించిన పాదయాత్రలో పాల్గొన్న బీఎన్



రాచవారిపాలెంలో కరపత్రాలను అందజేస్తున్న విజయ్‌కుమార్

ఊరూరా విస్తృత ప్రచారం
సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలతో మమేకం
టీడీపీ, జనసేన ముఖ్యనేతలతో నిత్యం సమావేశాలు
తన గెలుపునకు సహకరించాలని విజ్ఞప్తి
సానుకూలంగా స్పందిస్తున్న ప్రజానీకం
సమన్వయంతో సాగుతున్న నేతలు

ఒంగోలు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు నియోజకవర్గం నుంచి వచ్చే ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న మాజీ ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో స్పీడు పెంచారు. రెండుసార్లు స్వల్ప తేడాతో ఓటమిపాలైన ఆయన ఈసారి గెలుపే లక్ష్యంగా సాగుతున్నారు. అందుకు పార్టీలోని వివిధ స్థాయి నేతలు, క్రియాశీల కార్యకర్తలతో పాటు తాజాగా రాష్ట్రవ్యాప్తంగా పొత్తు కుదిరిన జనసేన పార్టీ స్థానిక నేతలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ప్రజలకు ఇచ్చిన మాటపై నిలబడటం, ఆటుపోట్లు ఎదురైనా నిబద్ధతతో పార్టీలో కొనసాగుతుండటం, పేద వర్గాలతో విస్తృత పరిచయాలు, వారితో సానుకూల దృక్పథంతో వ్యవహరించే బీఎన్ వ్యవహార శైలి ప్రస్తుతం నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన శ్రేణులనుంచే కాక వివిధ వర్గాల వారిలో ఆదరణ లభించేలా చేస్తున్నది. రాజకీయాలలోకి వచ్చినప్పటి నుంచి గత పదిహేనేళ్లుగా సంతనూతలపాడు నియోజకవర్గాన్ని అంటిపెట్టుకొని ఉన్న బీఎన్, వరుసగా రెండుసార్లు టీడీపీ అభ్యర్థిగా ఓటమి పొందారు. అయినా పార్టీ పట్ల ఆయన నిబద్ధత, నియోజకవర్గ ప్రజల్లో అతని పట్టు, ఆదరణ ఇతర అంశాలను గుర్తించిన పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ఈసారి ఎన్నికలలో కూడా పార్టీ అభ్యర్థిగా అవకాశం కల్పించారు. తొలిజాబితాలోనే బీఎన్ పేరును ప్రకటించారు. అప్పటికే విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆయన, ప్రత్యేకించి ఐదురోజుల పాటు సాగిన లోకేష్ యువగళం, ప్రాజెక్టుల బాట పేరుతో చంద్రబాబు గుండ్లకమ్మ పర్యటన, ఇంకొల్లులో జరిగిన బాపట్ల పార్లమెంటు స్థాయి చంద్రబాబు సభ వంటి భారీ కార్యక్రమాలను సక్సెస్‌గా నిర్వహించారు. ఈ క్రమంలో తొలి జాబితాలోనే బీఎన్ అభ్యర్థిత్వాన్ని అధినేత చంద్రబాబు ప్రకటించడంతో ఎన్నికల వ్యవహారంలో మరింత స్పీడ్ పెంచారు. ఒకవైపు వివిధ మండలాల, గ్రామాలు, అలాగే ఆయా వర్గాల నాయకులతో నిత్యం మధ్యాహ్నం వరకు ఒంగోలులోని తన కార్యాలయంలో సమీక్షలు, కార్యాచరణ చేస్తుండటంతో పాటు నియోజకవర్గంలోని వివిధ వర్గాల ప్రజలను ప్రభావితం చేసే వారిని వ్యక్తిగతంగా కలిసి మద్దతు కూడగడుతున్నారు. సాయంత్రం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ప్రతి రోజు ఒక గ్రామం లేదా పట్టణాల్లోని వార్డుల్లో పర్యటిస్తున్నారు. ఆయా వర్గాల ప్రజలకు అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు, అలాగే టీడీపీ-జనసేన ఉమ్మడి కార్యాచరణ ప్రణాళిక ముఖ్య అంశాలను ఇంటింటికి తిరిగి వివరించేందు ప్రాధాన్యత ఇస్తున్నారు.

విభిన్న వర్గాల ప్రజలతో ఉండే చీమకుర్తి పట్టణం, మద్దిపాడు మండలంలోని పలు గ్రామాలపై ఈ విషయంలో ప్రత్యేక ఫోకస్ పెట్టారు. చీమకుర్తిలోని 20 వార్డులలో వేలాది కుటుంబాలను ప్రత్యక్షంగా బీఎన్ కలువగా పార్టీ నేతలు ఊహించిన దానికి రెట్టింపుగా ప్రజాస్పందన కనిపించినట్లు విశ్లేషిస్తున్నారు. వివిధ మండలాలలో స్థానిక నేతలు చొరవ చూపి పలు గ్రామాల్లో ఈ తరహా ప్రచారం కొనసాగిస్తున్నారు. మరోవైపు గతంలో తాను ఎమ్మెల్యేగా, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా గ్రామాల అభివృద్ధికి, ఆయా వర్గాల ప్రజలకు అందించిన సహకారాన్ని కూడా వివరిస్తూ మరోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే మరింతగా అభివృద్ధి చేస్తానంటూ భరోసా ఇస్తున్నారు. ప్రజల్లో సానుకూల వస్తున్నసానుకూల ప్రభావంతో ఇతర పార్టీలకు చెందిన పలు గ్రామాలకు చెందిన వివిధ వర్గాలు ప్రత్యేకించి బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం వర్గాల యువత, మహిళలు, అలాగే వివిధ స్థాయిల్లోని వైసీపీ నేతలు సైతం ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతు తెలుపుతున్నారు. కాగా గురువారం మద్దిపాడు మండలం రాచవారిపాలెంలో నిర్వహించిన ప్రచారంలో విశేష స్పందన లభించింది.

ఇక జనసేన శ్రేణులు కూడా సంపూర్ణంగా బీఎన్‌కు మద్దతు ఇస్తూ ప్రచారంలో పాల్గొంటుండటంతో ఎన్నికల షెడ్యూల్ రాక ముందే ప్రచారంలో స్పీడ్ పెరిగింది. కాగా ఈ కార్యక్రమాల్లో బీఎన్‌కు పార్టీ పరిశీలకుడు అడకా స్వాములుకు తోడుగా టీడీపీ పార్లమెంటు ఉపాధ్యక్షులు మన్నం ప్రసాద్, అధికార ప్రతినిధి వీరయ్య చేరారు. వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు మద్దిన హరిబాబు, గొట్టిపాటి రాఘవరావు, మండవ జయంత్‌బాబు, గొల్లపూడి సుబ్బారావు ఇతర ముఖ్యనేతలు బొమ్మినేని రామాంజనేయులు, కాకర్ల లక్ష్మీవరప్రసాద్, గుమ్మడి సాయిబాబు, అంకారావు, తన్నీరు శ్రీనివాసరావు వంటి నాయకులు తమ తమ ప్రాంతాల్లో కార్యక్రమాన్ని సమన్వయం చేస్తున్నారు. అలాగే జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందుకూరి బాబు నేతృత్వంలో ఆ పార్టీ శ్రేణులు ప్రచారంలో సంపూర్ణంగా పాల్గొంటున్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేసిన బాలినేని

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 7 : ఒంగోలు నగరంలోని పలు డివిజన్లలో గురువారం లబ్ధిదారులకు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ పత్రాలతో పాటు గిఫ్ట్ ప్యాకెట్లను కూడా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాటను నిలబెట్టుకునే మనస్తత్వం తనదని, ఇప్పుడు పేదలకు పట్టాలు ఇచ్చిన తర్వాతనే ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని తెలిపారు. పట్టాలు ఇచ్చిన ప్రాంతాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు మోడల్ టౌన్‌షిప్‌గా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. చెప్పారు. మరోవైపు బాలినేని సతీమణి శచీదేవి, కుమారుడు ప్రణీత్‌రెడ్డి పలు డివిజన్లలో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఆసరా చెక్కుల పంపిణీ

ఒంగోలు(రూరల్): ఒంగోలు మండలం కరవది హైస్కూలు క్రీడాప్రాంగణంలో గురువారం వైఎస్సార్ ఆసరా చెక్కులను గురువారం ఎమ్మెల్యే బాలినేని డ్వాక్రా గ్రూపు మహిళలకు పంపిణీ చేశారు. అలాగే చీరలను అదజేశారు. పలు అభివృద్ధి పనులకు శిలాఫలకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవరపల్లి కోటేశ్వరరావు, ఎంపీపీ పల్లపోలు మల్లికార్జునరెడ్డి, పొగాకు సమాఖ్య అధ్యక్షుడు వాకా బసివిరెడ్డి, కరవది సొసైటీ అధ్యక్షుడు వాకా వెంకటకృష్ణారెడ్డి, కసుకుర్తి ఆదెన్న, జడ్పీటీసీ చుండూరి కోమలేశ్వరి, ఎంపీటీలు మన్నె శ్రీనివాసరావు, జి.కోమలేశ్వరి, అయ్యలవాణి, ఉషారాణి, ఎంపీడీవో కాపా శ్రీనివాసరెడ్డి, ఈవోఆర్డీ వెంకటరమణమ్మ, ఏపీఎం గోపీనాథ్, చుండూరి రవిబాబు తదితరులు పాల్గొన్నారు

దామచర్ల మహాశివరాత్రి శుభాకాంక్షలు

ఒంగోలు(కార్పొరేషన్), మార్చి 7 : మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్దన్ జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. పరమ శివుని ఆశీస్సులు అందరికీ లభించాలని, ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో శివరాత్రి జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

మాగుంట శుభాకాంక్షలు

ఒంగోలు(కలెక్టరేట్): ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి జిల్లా ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు.

జేఈఈ మెయిన్స్‌లో 'శ్రీసరస్వతి' ప్రభంజనం

• 99.59 పర్సంటైల్‌తో జిల్లా ఫస్ట్



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ రమణారెడ్డి

ఒంగోలు(విద్య), మార్చి 7: ఆలిండియా జేఈఈ మెయిన్ 2024 ఫలితాల్లో ఒంగోలులోని శ్రీసరస్వతి విద్యాసంస్థల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. అత్యధిక పర్సంటైల్స్ సాధించి జాతీయస్థాయి ర్యాంకులతో జిల్లాలో ప్రథమస్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా గురువారం సాయంత్రం స్థానిక మంగమూరురోడ్డులోని శ్రీసరస్వతి కళాశాల ఆవరణలో తమ విద్యార్థులు సాధించిన ఫలితాలను విద్యాసంస్థల చైర్మన్ ఏవీ.రమణారెడ్డి మాట్లాడుతూ కె.గోపీచంద్ 99.59 పర్సంటైల్ సాధించి జిల్లాలో ప్రథమస్థానంలో నిలిచారన్నారు. అలాగే కె.సాయికిరణ్ 99.20 పర్సంటైల్‌తో 3వ స్థానం, కె.సాకేత్ సాయిరాం 99.16తో 4వ స్థానం, ఎస్.ఇంద్రసేనారెడ్డి 98.70తో 5వ స్థానం, ఆర్.చంద్రవిహార్ 98.31 పర్సంటైల్‌తో 6వ స్థానంలో నిలిచారు. ఇక గణితంలో కె.సాకేత్‌సాయిరాం 99.83, ఆర్.చంద్రవిహార్ 99.60 పర్సంటైల్ సాధించి అగ్రస్థానంలో నిలిచారు. సాధారణ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి జేఈఈ మెయిన్‌లో అత్యధిక పర్సంటైల్ సాధించగలిగామని రమణారెడ్డి తెలిపారు. కళాశాల యాజమాన్యం, అధ్యాపకుల కృషి అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల డైరక్టర్లు ఎ.గణేష్‌రెడ్డి, శంకరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మహాశివరాత్రి పండుగకు పటిష్ట భద్రత : ఎస్పీ

ఒంగోలు క్రైం, మార్చి 7: మహాశివరాత్రి పండుగ సందర్భంగా శివాలయాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అన్నీ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఉన్న శైవ క్షేత్రాల వద్ద పటిష్ట మైన భద్రత ఏర్పాటు చేశామన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసు అధికారులకు ఆదేశాలు ఇచ్చామని, ఆలయాల వద్ద అనుమానాస్పద వ్యక్తుల సంచారం ఉంటే వెంటనే 112, 100 నంబర్లకు కాల్ చేయాలని సూచించారు. భద్రతా విధుల్లో అలసత్వం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పమని ఎస్పీ హెచ్చరించారు.

10న వైపాలెంలో బహిరంగ సభ

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 7: యర్రగొండపాలెంలో ఈనెల 10వతేదీన జరిగే భారత చైతన్య యువజన పార్టీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర సమన్వయ సారధి మిరియం శ్రీనివాసులు గురువారం ఓ ప్రకటనలో కోరారు. పార్టీ అధినేత రామచంద్రయాదవ్ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. కనుక బహిరంగ సభకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పేద మహిళలకు 'చేయూత' అండ

• కలెక్టర్ దినేష్‌కుమార్



చేయూత చెక్కును అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 7: వైఎస్సార్ చేయూత పథకం ద్వారా పేద వర్గాలకు చెందిన మహిళలకు ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలబడుతుందని కలెక్టర్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. ఈ పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు సీఎం జగన్మోహన్ రెడ్డి గురువారం అనకాపల్లి జిల్లా కశింకోటలో జరిగిన సభలో బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 45 నుంచి 60 ఏళ్ల వయస్సు ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మహిళలకు ఒక్కొక్కరికి నాలుగు విడతలలో కలిపి రూ.75వేలను ప్రభుత్వం అందించిందన్నారు. నాల్గవ విడత కింద జిల్లాలో 98,848 మందికి రూ.185.34 కోట్ల ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. అనంతరం మహిళలకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు కనకారావు, టి.మనోజ్, లలితా నాంచారమ్మ, ఎస్‌కే.సుభాన్‌బీ, డైరెక్టర్లు జె.ఏడుకొండలు, మహబూబ్, రవిబాబు, విజయకుమార్, అధికారులు వసుంధర, రవికుమార్, ధనలక్ష్మి, అర్జున్‌నాయక్ పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆర్థికసాయం

నాగులుప్పలపాడు, మార్చి 7 : అనారోగ్యానికి గురై ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్నేహితుడికి తోటి పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. ఉప్పుగుండూరు అంబేడ్కర్‌నగర్‌కు చెందిన తెలగతోటి ఆనందరావు పక్షవాతానికి గురై వైద్యఖర్చులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆనందరావుతో కలిసి చదువుకున్న 1988-89 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు రూ.70వేలను సేకరించి గురువారం ఆనందరావుకు అందజేశారు. కార్యక్రమంలో తెలగతోటి సామ్యూల్, కొమ్మాలపాటి సురేష్‌బాబు, జెట్టి సురేష్, పక్కెల వజ్రంబాబు, దివి అనంతబాబు, పావులూరి సుబ్బారావు, కొండా శ్రీనివాసరావు, కోంద్రు దాసు, కోంద్రు ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

మాగుంట కుటుంబం ప్రజాసేవకు అంకితం

వచ్చే ఎన్నికల్లో రాఘవరెడ్డిని ఆశీర్వదించండి..

ప్రజాప్రతినిధులకు పరిచయం చేసిన ఎంపీ శ్రీనివాసులురెడ్డి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 7 : జిల్లాలో మాగుంట కుటుంబం గత 33 ఏళ్ల నుంచి ప్రజాసేవకు అంకితమైందని, వచ్చే ఎన్నికల్లో తన కుమారుడు మాగుంట రాఘవరెడ్డి పోటీ చేస్తున్నారని, అందరూ ఆశీర్వదించాలని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కోరారు. ఒంగోలులోని జడ్పీ సర్వసభ్య సమావేశం గురువారం స్థానిక పాత జిల్లా పరిషత్ సమావేశపు హాలులో చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మాగుంట మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రజాప్రతినిధులను కలుసుకునేందుకు చివరి సమావేశం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జిల్లాలో తాగునీటి సమస్య రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటి వరకు జిల్లాలోని ప్రజాప్రతినిధులు తనకు అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా సమావేశం అనంతరం ఎంపీ మాగుంట సమావేశం హాలు వద్ద జిల్లాలోని జడ్పీటీసీలు, ఎంపీపీలకు రాఘవరెడ్డిని పరిచయం చేశారు. అంతకుముందు తన కుమారుడితో కలిసి కలెక్టర్ దినేష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

నగరంలో బీఎస్ఎఫ్ దళాల కవాతు



బీఎస్ఎఫ్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎస్పీ కిషోర్‌బాబు

ఒంగోలు క్రైం, మార్చి7: రానున్న ఎన్నికల దృష్ట్యా బీఎస్ఎఫ్ దళాలు జిల్లాకు చేరుకున్నాయి. ఈక్రమంలో గురువారం డీఎస్పీ కె.కిషోర్‌బాబు నేతృత్వం లో ఒంగోలులో నగరంలో కవాతు నిర్వహించారు. సౌత్ బైపాస్ నుంచి కర్నూలు రోడ్డు బైపాస్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రజలు ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికలు ప్రశాతంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్పీ రాజేష్, సీఐలు ఎం.లక్ష్మణ్, ఎస్.జగదీష్ పాల్గొన్నారు.

ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన

నాగులుప్పలపాడు మార్చి 7 : ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)లపై అధికారులు మండల పరిధిలోని చదలవాడ, మద్దిరాలపాడు, చేకూరపాడు గ్రామాల్లో ఓటర్లకు అవగాహన కల్పించారు. సెక్టార్ 25 అధికారి తిరుమలశెట్టి రవి, ఎస్‌పీవో కిషోర్‌బాబు ఈవీఎం యంత్రం ద్వారా ఓటు హక్కును వినియోగించుకునే విధానంపై మాక్ పోలింగ్ నిర్వహించారు.

మహాశివరాత్రికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 7 : మహాశివరాత్రిని పురస్కరించుకొని పలు శైవక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. ఒంగోలు డిపో నుంచి శ్రీశైలం , కోటప్పకొండ, భైరవకోన ఆలయాలకు 150 స్పెషల్ బస్సులు నడవనున్నాయి. ఒంగోలు నుంచి శ్రీశైలం, కోటప్పకొండకు 45 బస్సులు కేటాయించారు. శ్రీశైలంకు కనిగిరి డిపో నుంచి 25, మార్కాపురం నుంచి 80 బస్సులు నడపనున్నారు. అలాగే కనిగిరి నుంచి భైరవకోనకు 20, పొదిలి నుంచి మరో 10 బస్సులు ఏర్పాటుచేశారు. ఈ స్పెషల్ బస్సుల్లో ఎలాంటి అదనపు చార్జీలు లేకుండా భక్తులు ప్రయాణించవచ్చని ఆర్ఎం సుధాకర్‌బాబు తెలిపారు.

మూడు రోజులు సెలవులు.. ప్రయాణికుల అవస్థలు

శుక్రవారం మహాశివరాత్రి, రెండో శనివారం, ఆదివారం వరుసగా మూడు రోజులు ప్రభుత్వ సెలవులు రావడంతో ప్రజలు తమ సొంతూర్లకు బయల్దేరారు. అయితే జిల్లాలోని ఆయా డిపోల నుంచి రోజువారీగా తిరిగే బస్సుల్లో అధికశాతం మహాశివరాత్రికి స్పెషల్ బస్సులుగా ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు తమ సొంతవూర్లకు వెళ్లేందుకు ఆర్టీఈ బస్టాండ్‌లో గంటలకొద్దీ ఎదురుచూశారు.

శైవక్షేత్రాలు ముస్తాబు

నాగులుప్పలపాడు, మార్చి 7: మహాశివరాత్రి సందర్భంగా నాగులుప్పలపాడు మండలంలోని శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. ఉప్పుగుండూరులోని శివాలయం, కనపర్తి ఏలేశ్వరస్వామి, మాచవరంలోని కాలభైరవస్వామి, నాగులుప్పలపాడు లోని రామలింగేశ్వరస్వామి, చదలవాడలోని చారిత్రక శివాలయంతో పాటు గ్రామాల్లోని శైవక్షేత్రాలలో శుక్రవారం ప్రత్యేక పూజలు జరగనున్నాయి. విద్యుత్ కాంతులతో ప్రత్యేక శోభను సంతరించుకొన్నాయి. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీలు తగిన ఏర్పాట్లు పూర్తి చేశాయి.

కార్మిక చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 7: కార్మిక చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్యాంబాబు పేర్కొన్నారు. ఒంగోలులోని కావేరి గ్రాండ్‌లో గురువారం కార్మికశాఖ అధికారులు, సిబ్బందికి జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్మిక చట్టాలపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రిటైర్డ్ ఉప కార్మిక కమిషనర్ అఖిల్, రిటైర్డ్ సహాయ కార్మిక కమిషనర్ ఎస్‌వీఎస్ఆర్.మూర్తి, కార్మిక సహాయ కమిషనర్లు ఎం.కోటేశ్వరరావు, బి.అనితావాణి, కె.పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు మహిళా దినోత్సవం



మహిళాభ్యుదయ సమితి ఆధ్వర్యంలో సన్మానం



కేక్ కట్ చేస్తున్న మహిళా ఉద్యోగులు



జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో ..

ఒంగోలు(విద్య), మార్చి 7: అంతర్జాతీయ మహిళా దినోత్సవం ముందస్తు వేడుకలను గురువారం పలు స్వచ్ఛంద సంస్థలు, కళాశాలలు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఏపీ మహిళాభ్యుదయ సమితి, నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం) ఆధ్వర్యంలో ఒంగోలు నగరం హౌసింగ్‌బోర్డులోని మహిళాభ్యుదయ సమితి కార్యాలయంలో నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ అధ్యక్షతన వేడుకలు జరిగాయి. అనంతరం ప్రముఖ వైద్యురాలు మండవ కమల, విద్యావేత్త కొల్లా సౌజన్య, శాక్సాఫోన్ కళాకారిణి దర్శి శైలజలను జ్ఞాపిక, ప్రశంసాపత్రం, శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ మున్నంగి రాజకుమారి, రచయిత అరణ్యకృష్ణ, డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, నూనె అంకమ్మరావు, ఎన్.జ్యోతిసుప్రియ, డాక్టర్ చాపల శాంత కుమారి, బీరం అరుణ పాల్గొన్నారు.

జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో..

ఒంగోలులోని ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో మహిళా ఉద్యోగుల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. బ్యాంకు చైర్మన్ సతీమణి వై.సరితారెడ్డి చేతుల మీదుగా నాబార్డ్ సహకారంతో మహిళలకు కానుకలు అందజేశారు. కార్యక్రమంలో సీఈవో కోటిరెడ్డి పాల్గొన్నారు.

పేస్ కళాశాలలో..

స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన మహిళా దినోత్సవంలో సంపూర్ణ స్వాస్థ్య సొసైటీ ప్రెసిడెంట్, ఆరిజన్ హాస్పటల్ ఎండీ డాక్టర్ జ్యోత్స్న తేజ ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, కోఆర్డినేటర్ హెచ్.వైష్ణవి, విద్యార్థినులు పాల్గొన్నారు.

సీఐటీయూ కార్యాలయంలో..

నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మహిళా దినోత్సవంలో మంగమ్మ కళాశాల విశ్రాంత పిన్సిపాల్ ఏవీ.పుల్లారావు ప్రసంగించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీదేవి, ఐద్వా నగర కార్యదర్శి జి.ఆదిలక్ష్మి, జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, పి.కల్పన, జి.రమేష్, తంబి శ్రీనివాసులు, టి.విజయ, కె.సామ్రాజ్యం, ఆర్.రాజ్యలక్ష్మి, కె.ఏమిమా, ఎ.సీతామాలక్ష్మి, బి.రాజ్యలక్ష్మి, సృజన, గోవిందమ్మ, రంగమ్మ పాల్గొన్నారు.

శ్రీఅభయ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

శ్రీఅభయ సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని చీమకుర్తి మెప్మా కార్యాలయం ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దాలి మాధవరావు దుడ్డు అంజమ్మ, పూల రవణమ్మ, యాసవరపు శారదలను సత్కరించారు. సంపత్‌కుమార్, చిరంజీవి పాల్గొన్నారు.

జేఏసీ అమరావతి ఆధ్వర్యంలో..

ఒంగోలు(కలెక్టరేట్): ఆంధ్రప్రదేశ్ జేఏసీ అమరావతి ఆధ్వర్యంలో గురువారం స్థానిక రెవెన్యూభవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లా చైర్మన్ ఎస్‌వీఎస్.కృష్ణమోహన్ నేతృత్వంలో డీఆర్వో శ్రీలత, మహిళా జేఏసీ ప్రతినిధులు కేక్ కట్ చేశారు. పలువురు మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో ఎన్.జయలక్ష్మి, పి.ఉమాదేవి, ఎస్‌కే.అన్వర్ జాన్, ఎస్‌కే.కరీమున్నీసాబేగం, వి.శివకుమారి, కె.రజని, సీహెచ్.శ్రీదేవి, సాబిరున్, రమాదేవి, టి.రాధ, ఎం.తిరుపతమ్మ, శాంతిప్రియ, జనరల్ సెక్రటరి కె.వెంకటేశ్వరరెడ్డి, దానియేలు, ఊతకొలు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శిద్దా శుభాకాంక్షలు

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మాజీ మంత్రి శిద్దా రాఘవరావు గురువారం ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా మహా శివరాత్రి పండగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

శ్రీ ప్రతిభ విద్యార్థుల సత్తా



విద్యార్థులతో కలిసి విజయసంకేతం చూపుతున్న యాజమాన్యం

ఒంగోలు(విద్య), మార్చి 7: ఆలిండియా జేఈఈ మెయిన్ 2024 ఫలితాల్లో ఒంగోలులోని శ్రీ ప్రతిభ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభను కన బరిచారు. గట్టుమనేని మోహితాసాయి 99.49, పుట్లూరి గోవర్ధన 98.59, దారం శ్రీవర్ధన్‌రెడ్డి 98.38, ఉండేల శివనాగేంద్రరావు 98.38, నందికొండ వెంకట తరుణ్‌కృష్ణ 97.33, తోట వెంకట అవినాష్‌నాయుడు 96.51, పిచ్చాల శ్రీనివాస్ రెడ్డి 96.48, ఏల్చూరి సాయి వెంకట సాహిత్ 95.34 పర్సంటైల్ సాధించారు. 20 మంది విద్యార్థులు 90కి పైగా, 46 మంది 80కి పైగా పర్సంటైల్ సాధించారని శ్రీప్రతిభ విద్యాసంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నల్లూరి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ సీతారామంజనేయులు, సీఈవో నల్లూరి జయప్రకాష్‌నారాయణలు విద్యార్థులను, అధ్యాపకులను అభినందించారు.

పలు అభివృద్ధి పనుల ప్రారంభం

నాగులుప్పలపాడు మార్చి 7 : సంతనూతలపాడు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త, మంత్రి మేరుగ నాగార్జున గురువారం నాగులుప్పలపాడులోని తిమ్మనపాలెం రోడ్డు నుంచి కొత్తకోట గ్రామానికి వెళ్లేందుకు నిర్మిస్తున్న తారురోడ్డుకు శంకుస్థాపన చేశారు. అమ్మనబ్రోలు ముస్లిం కాలనీ, వినోదరాయునిపాలెంలో మండల నిధులతో నిర్మించనున్న సీసీరోడ్లకు భూమి పూజ చేశారు. వినోదరాయునిపాలెం సర్పంచ్ ఘట్టమనేని అశోక్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైసీపీ జెండాను ఆవిష్కరించారు. అమ్మనబ్రోలు జడ్పీ హైస్కూలు వార్షికోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం కనపర్తి పంచాయతీ చిన్నంగారిపట్టపుపాలెంలో స్థానికులతో మంత్రి పరిచయ కార్యక్రమం జరిగింది. మాదిగ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, ఏఎంసీ చైర్మన్ బంగారుబాబు, ఎంపీపీ అంజమ్మ, సర్పంచ్ చిన్నం సుజాత, నలమలపు క్రిష్ణారెడ్డి, కంచర్ల సుధా కర్, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



సభా స్థలాన్ని పరిశీలిస్తున్న దామచర్ల సత్య, కామని, మక్కెన

11న టంగుటూరులో చంద్రబాబు ప్రజాగళం సభ

టంగుటూరు, మార్చి 7 : టంగుటూరులో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ప్రజాగళం సభ జరగనుందని, అందుకు పార్టీ నుంచి కూడా అనుమతి వచ్చిందని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య చెప్పారు. ఈ నెల 11న మధ్యాహ్నం 3గంటలకు సభ ప్రారంభం అవుతుందన్నారు. అలాగే ఈ నెల 8న యువగళం లోకేష్ సభ కోసం టంగుటూరులో సభావేదికను సిద్ధం చేశామని, కొన్ని అనివార్య కారణాల వలన లోకేష్ సభ వాయిదా పడిందని చెప్పారు. ఇప్పుడు ఇదే వేదికను చంద్రబాబు సభకు సిద్ధం చేస్తున్నామన్నారు. వేదిక ఏర్పాట్లు గురువారం నుంచే ప్రారంభమయ్యాయి. రాత్రి పూట ఫ్లడ్ లైట్ల వెలుగుల్లోనూ వేదిక వద్ద పనులు కొనసాగుతున్నాయి.

సభా వేదిక స్థలాన్ని పరిశీలించిన సత్య

సభావేదిక స్థలాన్ని దామచర్ల సత్య నాయకులతో కలసి పరిశీలించారు. వేదిక నిర్మాణం కోసం జరుగుతున్న ఏర్పాట్లను చూశారు. సభావేదిక కొలతలు పరిశీలించారు. వేదిక ముందు భాగాన్ని చూసి ప్రజల సౌకర్యార్థం ఇంకా ఏమైనా చేయాల్సిన అవసరం ఉందా, అన్న విషయాన్ని చర్చించారు. నాయకులు కామని విజయకుమార్, బెజవాడ వెంకటేశ్వర్లు, అబ్బూరి అభిషేక్, మక్కెన వెంకట్రావు, కసుకుర్తి భాస్కర్, జక్కుల శ్రీను, షేక్ షఫీ, రామారావు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మహిళా సంఘం నాయకురాలు

మద్యంతోనే మహిళలపై దాడులు

కొండపి, మార్చి 7 : ప్రభుత్వాలు మద్యనిషేధం చేస్తేనే మహిళల మనుగడ సాఫీగా సాగుతుందని, మద్యం వల్ల మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరుగుతున్నాయని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం. విజయ, కె. అనంతలక్ష్మి చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కొండపిలోని సీపీఐ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. మహిళలపై పెరుగుతున్న దాడులను ప్రభుత్వాలు సమర్థంగా అరికట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సమాఖ్య జిల్లా గౌరవాధ్యక్షురాలు ఎస్. రావమ్మ, సీపీఐ కొండపి నియోజకవర్గ కార్యదర్శి వీరారెడ్డి, సీపీఐ జరుగుమల్లి, కొండపి మండలాల కార్యదర్శులు జి. బాలకోటయ్య, ఆర్. లక్ష్మి పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో...

ఐసీడీఎస్ కొండపి ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం గురువారం కొండపిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈసందర్భంగా బాలికలకు బ్యాడ్ టచ్, గుడ్ టచ్, ఉమెన్ ట్రాఫికింగ్ తదితర విషయాలపై సీడీపీవో మాధవీలత అవగాహన కలిగించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ అనూష, సూపర్‌వైజర్ విక్టోరియారాణి పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న దామచర్ల సత్య, నాయకులు

మాజీ సర్పంచ్‌కి దామచర్ల సత్య నివాళి

కొండపి, మార్చి 7 : మండలంలోని అనకర్లపూడి మాజీ సర్పంచ్ తన్నీరు సుబ్బారావు, కొండపికి చెందిన టీడీపీ కార్యకర్త ఈదర కిరణ్‌కుమార్ తల్లి చెంచమ్మ దశదిన కర్మ కార్యక్రమాల్లో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య గురువారం పాల్గొని నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి రామయ్యచౌదరి, మండల అధ్యక్షుడు బొడ్డపాటి యల్లమందనాయుడు, నాయకులు బత్తుల నారాయణస్వామి, దామా మురళి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ఒంగోలు క్రైం, మార్చి7: అతివేగం నిండు ప్రాణం బలిగొంది. గురువారం మధ్యాహ్నం ఒంగోలు నగరం దక్షిణ బైపాస్ సర్వీస్‌రోడ్డులో జరిగిన ప్రమాదంలో నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం చాగొల్లుకు చెందిన కొనిక తిరమలరావు (30) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తిరుమలరావు ఒంగోలు నుంచి నెల్లూరు వైపు దక్షణ బైపాస్ సర్వీస్‌రోడ్డులో ద్విచక్రవాహనంపై అతివేగంగా వెళుతూ రోడ్డు పక్కన పార్కు చేసివున్న ఆటోను, దాని పక్కనే ఉన్న సోడా బండీని సైతం ఢీకొట్టడంతో అదుపు తప్పి కిందపడ్డాడు. దీంతో తిరుమలరావు రోడ్డుమీద పడడంతో తలకు తీవ్రమైన గాయాలతో రక్తస్రావమై అక్కడికక్కడే మరణించాడు. ఈ మేరకు తాలుకా పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు.

నేడు సీవీఎన్ రైజింగ్ రాక్స్ మెగా ఈవెంట్

ఒంగోలు(విద్య), మార్చి 7: సీవీఎన్ రైజింగ్ రాక్స్ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా ఈవెంట్ నిర్వహిస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు డాక్టర్ టి.చందు, చాందినీలు తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి స్థానిక సీవీఎన్ రీడింగ్ రూము ప్రాంగణంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో విజయవాడకు చెందిన సుహాసిని, వైజాగ్‌కు చెందిన లక్ష్మీప్రియ, నెల్లూరుకు చెందిన విజయ వంటి ప్రఖ్యాత గాయనిలతోపాటు స్థానిక కళాకారులు , పలువురు గాయకులు పాల్గొంటారన్నారు. సంగీతాభిమానులు, కళాకారులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో కోరారు.

హరోం హర శంకరా..!

- నేడు మహా శివరాత్రి
- ముస్తాబైన శివాలయాలు
- భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు

ఒంగోలు (కల్చరల్),మార్చి, 7: పరమ పవిత్రమైన మహాశివరాత్రి పర్వదినానికి శివాలయాలు ముస్తాబయ్యాయి. పరమేశ్వరుని ఆరాధనకు ఎంతో ప్రాధాన్యం కలిగిన మహాశివరాత్రి పండుగను ప్రజలు ప్రతి సంవత్సరం ఎంతో భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారు. ఈరోజు అర్ధరాత్రి సమయంలో పరమేశ్వరుడు ఉద్భవించాడని అందువల్ల మహాశివరాత్రి రోజున ఆయన ఆరాధన ఎంతో విశేషమైనదని పురాణాలు, శాస్త్రాలు పేర్కొంటాయి. అందువల్ల ప్రతి శివాలయాలలో అర్ధరాత్రి లింగోద్భవ అభిషేకాలు జరుగుతాయి. శుక్రవారం మహాశివరాత్రిని పురస్కరించుకుని జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంలోని అతి పురాతనమైన కేశవస్వామి పేట శ్రీ గంగా పార్వతీ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో శుక్ర, శనివారాలలో ప్రత్యేక కార్యక్రమాలు, లింగోద్భవ కాల అభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ పాలక మండలి అధ్యక్షులు ఈదుపల్లి గురునాథరావు, ఈవో డి.రజనీ కుమారి తెలిపారు. స్థానిక కొత్తపట్నం బస్టాండ్ లోని శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో సైతం మహాశివరాత్రి రోజున భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుంటారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అధ్యక్షులు చాకిరి ధనుంజయ్, ఈవో పెద్దినేని అంజనీదేవి పేర్కొన్నారు. ఇక నగరంలోని అంజయ్య రోడ్డు శ్రీపంచముఖ శివాలయం, సంతపేట సాయిబాబా మందిరంలోని శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం, లాయర్‌పేట సాయిబాబా మందిరంలోని శ్రీమరకత రాజరాజేశ్వరస్వామి దేవస్థానం, కేశవస్వామి పేట శ్రీ విజయదుర్గ దేవస్థానాలలో లింగోద్భవ అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరగనున్నాయి.శివాలయాలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించి మహాశివ రాత్రి ఏర్పాట్లు పూర్తిచేశారు. అలాగే నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరులోని శివాల యం శివరాత్రి వేడుకలకు ముస్తాబైంది.



శివరాత్రి వేడుకలకు ముస్తాబైన ఉప్పుగుండూరులోని శివాలయం

రామతీర్థం ముస్తాబు



రామతీర్థం మోక్షరామలింగేశ్వరస్వామి ఆలయం (ఇన్‌సెట్లో) మూలవిరాట్లు

చీమకుర్తి : దక్షిణకాశీగా విరాజిల్లుతున్న రామతీర్థం మోక్ష రామలింగేశ్వర స్వామి ఆలయం మహాశివరాత్రి పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించుకోవటానికి ముస్తాబయింది. శ్రీగంగా బాలత్రిపురసుందరీ సమేత మోక్షరామలింగేశ్వరస్వామి దేవాలయంలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం ప్రాతఃకాలం నుంచే విశేషపూజలు నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు అభిషేకాలు జరపనున్నారు. రాత్రి ఎనిమిది గంటల నుంచి లింగోద్భవకాల పూజలు, మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, బిల్వార్చన, అమ్మవారికి నవావరణ పూజాదులు సహస్రనామార్చనలు నిర్వహించటానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం ఉదయం స్వామివారి కల్యాణమహోత్సవాన్ని ఘనంగా జరపనున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు పూర్తి చేశారు. విచ్చేసే భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ఆలయ ఆవరణలో జరుగుతున్న ఏర్పాట్లను దేవదాయశాఖ సహాయ కమిషనర్ జనార్దనరెడ్డి, ఇన్‌స్పెక్టర్ వేణుగోపాలరావు గురువారం స్వామివారిని దర్శించుకున్న తదుపరి పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. దాతల సహకారంతో తాగునీరు, ప్రసాదాలు, ఆలయాన్ని విద్యుదీపాలతో అలంకరించారు. అవాంఛనీయ సంఘటనలు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు చేపడుతున్నారు.

పసుకుదురు రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో ..

పసుకుదురు(టంగుటూరు) మార్చి 7 : మండలంలోని పసుకుదురులో గ్రామంలో గంగా పార్వతీ వర్ధిని సమేత శ్రీరామలింగేశ్వర దేవస్థానంలో మహాశివరాత్రి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. శుక్రవారం మహాశివరాత్రి పర్వదినంలో లింగోద్భవ సమయమైన రాత్రి 12గంటలకు భక్తుల గోత్రనామాలతో రుద్రాభిషేకం చేస్తారు. ఉదయం 7గంటలకు గణపతి పూజ, 8గంటలకు రుద్రాభిషేకం, ఉదయం 9గంటలకు గంగా పార్వతీవర్ధిని సమేత శ్రీరామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం, కోలాటం నిర్వహిస్తారు. ఒంటి గంటకు తీర్థప్రసాదాలు, అన్నసంతర్పణ ఉంటుంది. రాత్రి 8 నుంచి పాట కచేరి నిర్వహిస్తారు. పూజా కార్యక్రమాలన్నీ ప్రధాన అర్చకులు సోమరాజుపల్లి మధుబాబు ఆధ్వర్యంలో జరుగుతాయి.



గంగా పార్వతి వర్ధిని సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థాన ముఖద్వారం

ఆమెకు ఆమే సాటి..!

- అన్ని రంగాలలో దూసుకుపోతున్న మహిళలు
- పురుషులకు ఏమాత్రం తీసిపోని విధంగా ప్రగతి
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ఒంగోలు(కల్చరల్), మార్చి 7: లోకంలో స్త్రీ లేకపోతే జననం లేదు. స్త్రీ లేకపోతే గమనం లేదు. ఆమె లేకపోతే ఈ సృష్టికి జీవం లేదు. అటువంటి స్త్రీ మూర్తులను ఒకనాడు వంటింటి కుందేలు అనేవారు. అయితే గత కొన్ని దశాబ్దాలుగా ఈ విషయంలో ఎంతో మార్పువచ్చింది. తాము ఏ రంగంలోనూ పురుషులకు తీసిపోమని నిరూపిస్తూ మహిళలు సైతం అనేక రంగాలలో అప్రతిహతమైన అభివృద్ధి సాధిస్తున్నారు. ఇటు గృహిణిగా భర్త, పిల్లల ఆలన చూస్తూనే, అటు పాలనారంగంలోనూ తాము పురుషులకు ఏ మాత్రం తీసిపోమని నిరూపిస్తున్నారు. తల్లిగా లాలిస్తూ, చెల్లిగా తోడుంటూ, భార్యగా బాగోగులు చూస్తూ, సేవకురాలిగా సేవలందిస్తూ మొత్తానికి 'కార్యేషు దాసి, కర్రేషు మంత్రి భోజ్యేషు మాతా' అని పూర్వీకులు చెప్పిన సత్యాన్ని నిజం చేసి చూపిస్తున్నారు.. నేటి మహిళలు. అంతేకాదు 'సారం లేని ఈ లోకానికి సారాన్ని అందించేది మహిళ మాత్రమే అని తెలుసుకుని కాబోలు శివుడు పార్వతికి తన శరీరంలో అర్ధభాగాన్ని ఇచ్చాడు' అని ఒక సంస్కృత శ్లోకంలో చెప్పబడింది. నేడు జిల్లా ప్రథమ పౌరురాలిగా, ఒంగోలు నగర ప్రథమ పౌరురాలిగా మహిళలు రాణిస్తున్నారు. అంతేగాకుండా అనేక ప్రభుత్వ విభాగాల అధిపతులుగా కూడా మహిళలు జిల్లాలో రాణిస్తున్నారు. అంతటి గొప్పదనాన్ని కలిగిన మహిళలను గౌరవించుకునేందుకు ప్రతి సంవత్సరం మార్చి 8న 'అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని' జరుపుకోవటం శతాబ్దానికి పైగా జరుగుతున్నది.

తొలి శాక్సాఫోన్ కళాకారిణిగా..



ఆమెకు చిన్నతనం నుంచి గానం, సంగీతం పట్ల ఎంతో మక్కువ. ఆ మక్కువ, తపనతో మగవారికే పరిమితమైన శాక్సాఫోన్ సాధన ప్రారంభించారు పేర్నమిట్టకు చెందిన దర్శి శైలజ. ఆమె తండ్రి ఉమ్మడి ప్రకాశం జిల్లా ఇంకొల్లు మండలం పెద్ద నక్కలపాలెంకు చెందిన విప్పర్ల సుందరరావు మంచి శాక్సాఫోన్ కళాకారుడు. దాంతో శైలజ సైతం ఆ వైపుగా దృష్టిసారించి సాధన ప్రారంభించి జిల్లాలోనే తొలి శాక్సాఫోన్ కళాకారిణిగా పేరు తెచ్చుకున్నారు. పలువురు ప్రముఖులు, సంస్థల నుంచి సత్కారాలను అందుకుంటున్నారు. ఇందుకు తన తండ్రి ప్రేరణ, భర్త రాజేష్ ప్రోత్సాహం ఎంతో ఉన్నాయని, రాష్ట్ర, జాతీయ స్థాయి కళాకారిణిగా గుర్తింపు పొంది జిల్లాకు ఖ్యాతి తీసుకురావాలనేది తన లక్ష్యమని శైలజ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సృజనాత్మకతలోనే కాదు..సమాజ సేవలోనూ..



చొరవ, పట్టుదల ఉంటే ఆయా రంగాలలో మహిళలు సైతం విజయం సాధించవచ్చని నిరూపిస్తున్నారు ఒంగోలుకు చెందిన నున్నా హరిప్రియ. జేఎన్‌టీయూ హైదరాబాద్ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లో బ్యాచిలర్ డిగ్రీ చేసిన ఆమె క్రియేటివ్ డిజైనింగ్, ఆర్కిటెక్చర్ ప్లానింగ్‌ను నెలకొల్పి జిల్లాలోనే ఈ రంగంలో అడుగుపెట్టిన తొలి మహిళగా విజయం సాధిస్తున్నారు. క్రియేటివ్ డిజైన్స్ పేరుతో ఎన్నో ప్రాజెక్టులు, హాస్పటల్స్, అపార్టుమెంట్లకు ఆమె ప్రాజెక్టులు తయారుచేసి మంచి పేరు సంపాదించారు. అయితే ఇటు వృత్తిలో ఎంతో నిబద్ధతగా కొనసాగుతూనే సమాజానికి తనవంతు ఏదైనా చేయాలనే తపనతో సుహరి ఫౌండేషన్ అనే సంస్థను స్థాపించి తన భర్త సాయిబాబు సహకారంతో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ముఖ్యంగా పేద ఆడపిల్లలకు దుస్తులు అందజేయటం, వారి చదువుకు తగిన ఆర్థిక సహకారం అందించటం, వేసవికాలంలో మజ్జిగ చలివేంద్రాల నిర్వహణా ఇలా పలు సామాజిక సేవా కార్యక్రమాలలో సైతం ఆమె తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు.

కత్తిసాములో జాతీయ స్థాయికి..

జీవితం కత్తిమీద సాములాంటిది అనే మాట మనం తరచూ వింటుంటాం. అంటే కత్తిమీద సాము ఎంతో కష్టమైనది, ప్రాణాంతకమైనదని అర్థం. అయితే అటువంటి క్రీడలో చిన్న వయసులోనే రాణిస్తూ జాతీయస్థాయి పోటీలకు సైతం జిల్లా నుంచి ఎంపికయ్యారు ఒంగోలుకు చెందిన కూరపాటి నాగజాహ్నవి. ఫెన్సింగ్ క్రీడగా పిలిచే ఈ కత్తిసాములో ఆమె చిన్నతనం నుంచి సాధన ప్రారంభించి ఉత్తర ప్రదేశ్, ఒడిస్సా, గుజరాత్ వంటి రాష్ట్రాలలో జరిగిన పోటీలలో విశేష ప్రతిభ చూపి దాదాపు 45 రాష్ట్రస్థాయి మెడల్స్, నాలుగు బంగారు పతకాలు సాధించారు. తండ్రి అంజురాజు ఒక ప్రయివేటు సంస్థలో పనిచేస్తుండగా, తల్లి నాగస్వప్న ఒంగోలులోని పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నారు. జాహ్నవిలోని ఫెన్సింగ్ పట్ల ఆసక్తిని గమనించిన వారు ఆమెకు ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు. ప్రస్తుతం చెన్నై వెంటెక్ కళాశాలలో బీటెక్‌లో ప్రవేశం పొందిన జాహ్నవి త్వరలో కశ్మీర్‌లో జరిగే జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు మన జిల్లా నుంచి ఎంపికయ్యారు.





తేళ్ల అరుణ

జాతీయ ఉత్తమ మహిళా పురస్కారానికి తేళ్ల అరుణ ఎంపిక

ఒంగోలు(విద్య), మార్చి 7:అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ జాతీయ ఉత్తమ మహిళామణి పురస్కారానికి ఎంపికయ్యింది. ఈ మేరకు శ్రీభం సాయి సేవా ట్రస్ట్, భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ నిర్వాహకులు, ఆదాయపు పన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీ యం.నరసింహప్ప, కళారత్న డాక్టర్ బిక్కి కృష్ణలు గురువారం ఆమెకు వర్తమానాన్ని పంపారు. ఈ నెల 10వ తేదీ సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆమెకు పురస్కారాన్ని అందజేస్తారు. తేళ్ల అరుణకు అత్యుత్తమ పురస్కారం లభించటం పట్ల డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, డాక్టర్ నూనె అంకమ్మ రావు, డాక్టర్ మున్నంగి రాజకుమారి, సింహాద్రి జ్యోతిర్మయి, కుర్రా ప్రసాద్ బాబు, మిడసల మల్లిఖార్జున రావు, డాక్టర్ సంతవేలూరి కోటేశ్వర రావు తదితరులు అభినందనలు తెలిపారు.

టీడీపీలోకి కొనసాగుతున్న వలసలు

ఆరో డివిజన్ నుంచి వైసీపీ ముఖ్య నాయకులు చేరిక

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 7 : వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలోకి చేరికలు వరుసగా కొనసాగుతున్నాయి. స్థానిక 6వ డివిజన్ గోపాలనగరం నుంచి వైసీపీకి చెందిన ముఖ్య నాయకులు పటాపంజుల శ్రీనివాసరావు ఆయన ఆధ్వర్యంలో పిగిలి వాసు, పాలడుగు కోటయ్య నాయుడు, అన్నంగి ప్రశాంత్, కొఠారి రామసాయిలు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ మేరకు గోపాలనగరంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్దన్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. అదే విధంగా ఒంగోలు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు తనకు మరో అవకాశం కల్పించాలని దామచర్ల కోరారు. పటాపంజుల శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో చేరడం సంతోషంగా ఉందని, త్వరలో జరిగే ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం శక్తివంచన లేకుండా కష్టపడి పనిచేసి, పార్టీని గెలిపించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దాచర్ల వెంకటరమణయ్య, మంత్రిశ్రీనివాసరావు, రాచగర్ల వెంకట్రావు, కొఠారి రాము, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీ గెలుపును కోరుతూ ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్దన్ సతీమణి నాగసత్యలతో స్థానిక 49వ డివిజన్‌లో 'నారీ కోసం నాగసత్యలత' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.

టీడీపీ విజయానికి కృషి చేయాలి

కొత్తపట్నం(ఒంగోలునగరం) మార్చి 7: రాబోయే ఎన్నికల్లో టీడీపీ విజయానికి నాయకులు కలిసికట్టుగా కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ కోరారు. గురువారం కొత్తపట్నంలోని నల్లూరి గార్డెన్స్‌లో మండలంలోని టీడీపీ నాయకులతో భేటీ అయ్యారు. త్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో గేనం సుబ్బారావు, ద్వారబాకుల శ్రీనివాసరెడ్డి, రామచంద్రరావు, బలగాని వెంకటేశ్వర్లు, నారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్దన్



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

పోలింగ్ కేంద్రం మార్పు ప్రతిపాదనలపై టీడీపీ అభ్యంతరం

పొన్నలూరు (కొండపి), మార్చి 7 : మండలంలోని ముళ్లమూరివారిపాలెంలో ముళ్లమూరివారిపాలెం, సుంకిరెడ్డిపాలెం రెండు గ్రామాలకు చెందిన పోలింగ్ కేంద్రాలు 52, 53లను అధికారులు రాజకీయ కారణాలతో వైసీపీ నాయకుల ఆదేశాలతో ఒక కేంద్రానికి సుంకిరెడ్డిపాలేనికి మార్చే ప్రతిపాదన చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఆ గ్రామస్థులు తమకు గతంలో మదిరిగా ముళ్లమూరివారిపాలెంలోనే పోలింగ్‌కేంద్రం ఉంచాలని కోరారు. ఆ మేరకు టీడీపీ మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, జనసేన నాయకుడు పిల్లిపోగు పీటర్, బీజేపీ నాయకుడు మాదాల నరేష్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు నీలం కృష్ణ ఉమ్మడిగా తహసీల్దార్ సుధాకర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు.

జాబ్‌మేళాలో 111 మంది ఎంపిక

కొండపి, మార్చి 7 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్, సీడాప్ ఆధ్వర్యంలో కొండపిలోని ప్రైవేటు కల్యాణ మండపంలో గురువారం జరిగిన మెగా జాబ్‌మేళా కార్యక్రమంలో 111 మంది వివిధ కంపెనీలలో ఉద్యోగాలకు ఎంపికయ్యారని నిర్వాహకులు తెలిపారు. మొత్తం 309 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ జాబ్ మేళా నిరుద్యోగులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు టి. భరద్వాజ్, జె. రవితేజయాదవ్, తహసీల్దార్ బి. కిరణ్‌కుమార్, వైసీపీ మండల అధ్యక్షుడు ఆరికట్ల కోటిలింగయ్య, నాయకులు గొట్టిపాటి మురళి, ఢాకా పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే ఫలితం

టంగుటూరు, మార్చి 7 : కష్టపడి చదివితే కచ్చితంగా ఫలితం మీ సొంతమవుతుందని వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమణయ్య చెప్పారు. వల్లూరు జడ్పీ హైస్కూల్ వార్షికోత్సవం, సరస్వతీ పూజ గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులంతా బాగా చదివి 100 శాతం ఫలితాలు రాబట్టాలని చెప్పారు. సీనియర్ భౌతిక శాస్త్ర అధ్యాపకుడు ఎల్ నారాయణరావు మాట్లాడుతూ పరీక్ష హాలులో ఓఎంఆర్ షీట్, ఆన్సర్ స్క్రిప్టులను ఏవిధంగా ఉపయోగించాలో వివరించారు. ఏపీ వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మట్టిగుంట మహేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



మాట్లాడుతున్న హైస్కూల్ హెచ్‌ఎం రమణయ్య

ప్రైవేటు స్కూళ్లలో ప్రవేశానికి దరఖాస్తులు

జరుగుమల్లి (కొండపి), మార్చి 7 : బాలల ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం ప్రకారం 2024-25 విద్యాసంవత్సరంలో 1వ తరగతి ప్రవేశానికి ఈనెల 25వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మండల ఎంఈవోలు బి. నాగేంద్రవదన్, డి. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన పేదలు, అనాథలు, దివ్యాంగులు, సామాజికంగా వెనుకబడిన వర్గాల వారికి ప్రైవేటు స్కూళ్లలో 25శాతం సీట్లు ఉచితంగా కేటాయించారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు మండలంలో ఉన్న సహస్ర, ఎన్ఆర్ఐ యూపీ స్కూల్స్‌లో ప్రవేశం ఉంటుందని తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న వారు గ్రామ, వార్డు సచివాలయాలు, నెట్ సెంటర్లు, మీసేవ సెంటర్లు, మండల విద్యాశాఖాధికారి కార్యాలయాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ముస్తాబైన కనక సురభేశ్వరాలయం

- మహా శివరాత్రికి ప్రత్యేక ఏర్పాట్లు
- 8 నుంచి 10 వరకు ఉత్సవాలు

కంభం, మార్చి 7 : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శైవక్షేత్రాలు ముస్తాబవుతున్నాయి. హర హర మహాదేవ శంభోశంకర అంటూ భక్తులు శివ నామ స్మరణతో మునిగిపోనున్నారు. ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు సురభేశ్వర కోనలో ఆలయ కమిటీ వారు బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. కంభం మండలంలోని తురిమెళ్ల గ్రామానికి 2 కిలోమీటర్ల దూరంలో వెలసిన కనక సురభేశ్వర కోనను జమదగ్ని మహర్షి క్షేత్రంగా భావిస్తారు. మహా శివరాత్రి ఉత్సవాలను విశేషంగా నిర్వహించారు. జమదగ్ని ఆశ్రమం ఉండేదనే నమ్మకంతో జమదగ్ని క్షేత్రంగా పిలుస్తుంటారు.

నందీశ్వరుని కథ

క్షేత్రంలోని పాపేశ్వరుని ఆలయానికి తూర్పు ద్వారం ముందున్న నంది విగ్రహానికి కథ ఉంది. కంభం చెరువు వద్ద పొలంలో ఎద్దు మేస్తుండగా పొలం యజమాని ఆగ్రహంతో ఎద్దును కొట్టడంతో కాలు విరిగింది. అది సురభేశ్వరకోనకు వచ్చి గుండ్లకమ్మ నదిని దాటి పాపేశ్వరుని ఆలయానికి తూర్పు ద్వారం వద్ద కూర్చుని అక్కడే శిలగా మారిపోయిందని, వృషభాన్ని కొట్టిన వ్యక్తి పశ్చాత్తాపంతో దాని ప్రతిరూపాన్ని శిలారూపంలో చెక్కించినట్లు చెప్తారు.

కోటి లింగాల గట్టు

పాపనాశనం మందిరానికి సమీపంలోని లింగాల సముదాయాన్ని కోటిలింగాల గట్టు అంటారు. పూర్వం విజయనగరరాజు హరిహరరాయలు పాపనాశనం మందిరాన్ని నిర్మించి శివలింగాన్ని ప్రతిష్ఠించినట్లు చెప్తారు.

త్రివేణి సంగమం

సురభేశ్వర కోనను ఆనుకుని ప్రవహిస్తున్న నది మూడు నదుల సంగమం. నల్లమల కొండల నుంచి ప్రవహించే గుండ్లకమ్మ, లోతువాగు, ఎర్రవాగు కలిసి త్రివేణి సంగమంగా ప్రవహిస్తాయి. శివరాత్రికి వచ్చే భక్తులు ఈ సంగమంలో స్నానం ఆచరించి పూజలు నిర్వహిస్తుంటారు. సురభేశ్వర కోనలో రాష్ట్ర కూటులు, చోళులు, చాణక్యులు, కాకతీయులు, విజయనగర రాజుల నాటి అనేక శిలాశాసనసాలు ఉన్నాయి. రాజులు యుద్ధంలో మరణిస్తే వారి భార్యలు అగ్నిప్రవేశం చేసినట్లు గుర్తుచేసే శిల్పాలు నేటికీ దర్శనమిస్తుంటాయి. కానీ దొంగలను విగ్రహాలను పెకిలించి సంపదను దోచుకెళ్లారు. దశాబ్దకాలం నుంచి కనక సురభేశ్వర, యల్లమ్మ కోనకు శివరాత్రి సందర్భంగా వచ్చే వేలాదిమంది భక్తులకు ఆలయ కమిటీ గోగులదిన్నె జయసింహారెడ్డి, గోగులదిన్నె వెంగలరెడ్డి అన్నదానం చేస్తుంటారు.

ఇలా చేరుకోవాలి

సురభేశ్వరకోన ఆలయానికి చేరుకునేందుకు అనేక మార్గాలు ఉన్నాయి. మార్కాపురం, నంద్యాల ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సులో గాని, రైళ్లలో గాని వచ్చేవారు గిద్దలూరు, కంభం ప్రాంతాల్లో దిగి అక్కడి నుంచి బస్సులు, ఆటోలలో చేరవచ్చు.

ఆలయంలో ఉత్సవ ఏర్పాట్లు పూర్తి

త్రిపురాంతకం : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వర స్వామి, బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవార్ల ఆలయాల్లో నిర్వహిస్తున్న మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్వామి, అమ్మవార్ల ఆలయాల్లో భక్తులకు క్యూలైన్ బారికేట్లు ఏర్పాటు చేశారు. గ్రామం నుంచి ఆలయాల వరకు పంచాయితీ ఆధ్వర్యంలో వీధి దీపాలను అమర్చారు. ఆలయాల సమీపంలో మహిళలకు, పురుషులకు ప్రత్యేకమైన మరుగుదొడ్లు ఏర్పాటుచేసి, 77 మంది పారిశుధ్య కార్మికులను నియమించారు. రెండు ఆలయాలను విద్యుత్ దీపాలతో అంకరించారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో వాహనాలకు పార్కింగ్ ప్రదేశం ఏర్పాటు చేసి రోడ్డును సిద్ధం చేశారు. ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు రోడ్డుకు మధ్యలో ఇనుప కమ్మీలతో బారికేట్లు ఏర్పాటు చేశారు. భక్తులు సుమారు లక్ష మంది వరకు వచ్చే అవకాశం ఉన్నందున అన్ని సామాజిక సత్రాలవారు భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. క్యూలైన్లు, మెట్లమార్గాలలో మంచినీటిని అందించేందుకు ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయితీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఆలయాలకు వచ్చే భక్తులకు స్వాగతం పలుకుతూ రోడ్లవెంట స్వాగత ద్వారాలను ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు. ఆలయంలో భక్తుల ఏర్పాట్లను ఈవో చెన్నకేశవరెడ్డి, పాలక మండలి ఛైర్మన్, సభ్యులు పర్యవేక్షిస్తున్నారు. పోలీసుశాఖ నుంచి దర్శి డీఎస్పీ ఆధ్వర్యంలో ముగ్గురు సీఐలు, 11 మంది ఎస్సైలతోపాటు మొత్తం 315 మంది సిబ్బంది బందోబస్తు నిర్వహించనున్నారు.





కనక సురభేశ్వరాలయం ... జమదగ్ని మహర్షి ప్రతిష్ఠించిన శివలింగం..

శివాలయాల ముస్తాబు

గిద్దలూరు : మహాశివరాత్రి వేడుకలకు శివాలయాలు ముస్తాబయ్యాయి. దక్షిణకాశిగా పేరొందిన గిద్దలూరులోని శ్రీపాతాళ నాగేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి సందర్భంగా మూడురోజులపాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు దేవస్థాన కమిటీ ఛైర్మన్ శివపురం రమాదేవి, కార్యనిర్వహణాధికారి గర్రె సత్యనారాయణ తెలిపారు. 8న శుక్రవారం తెల్లవారు జామునుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు, మధ్యాహ్నం అన్నాభిషేకం, సాయంత్రం నందీశ్వరాభిషేకం, రాత్రి కళ్యాణమహోత్సవం, అర్ధరాత్రి లింగోద్భవ పూజలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 9న రుద్రహోమం, 10న రథోత్సవం నిర్వహించనున్నారు. కెఎస్‌పల్లి సమీపంలో ఎగువ భీమలింగేశ్వరస్వామి దేవాలయంలో, పలుపుల వీడు సమీపంలోని శివాలయంలో మహాశివరాత్రి వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేక పూజలతోపాటు కోలాట ప్రదర్శనలు, భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయనున్నారు.

శివభక్తులకు సంస్థల తోడ్పాటు

పెద్ద దోర్నాల : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా శివభక్తులకు పలుసంస్థలు తోడ్పాటు నందిస్తున్నాయి. పంచాయతీ అధికారులు తాగునీటి ఏర్పాటు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాట్లు చేయగా వైద్య ఆరోగ్యశాఖాధికారులు వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. పెద్దబొమ్మలాపురం గ్రామం ఆధ్వర్యంలో చట్టుతాండా వద్ద, రెడ్డి సంఘం, బలిజ కాపు సంఘం, హరే కృష్ణా దేవాలయం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం కార్య క్రమం ఏర్పాటు చేశారు.

పొదిలి : శుక్రవారం జరుగు మహాశివరాత్రి సందర్భంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీపార్వతీ సమేత నిర్మామహేశ్వరస్వామి దేవాలయాన్ని అత్యంత సుదరంగా ముస్తాబు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.







త్రిపురాంతకంలో ఏర్పాటు చేసిన బారికేట్లు, దోర్నాలలో భక్తులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు, పొదిలిలో విద్యుత్ వెలుగులలో ఆలయం

అవీ..ఇవీ..

పైపులైన్ పగిలి మంచినీరు వృథా

కంభం, మార్చి 7 : కందులాపురం పంచాయతీ పరిధిలో ఎస్సీపాలేనికి తాగునీటిని సరఫరా చేసే పైపులైన్ పగలిపోయింది. దీంతో నీరంతా వృథాగా పోతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. కందులాపురం పంచాయతీ పరిధిలో జాతీయ రహదారి పక్క నుంచి ఎస్సీపాలెం ప్రజలకు తాగునీటిని అందించే పైపులైన్ వెళుతోంది. దీని కోసం గుంతలు తవ్వి పైపులు ఏర్పాటు చేసినా గుంతలు పూడ్చలేదు. దీంతో ఆ పైపులు పగిలాయి. ఇది గమనించకుండా ఆ పైపులైన్ ద్వారా నీటిని వదలడంతో నీరు వృథాగా పోతోంది. గుంతమొత్తం నిండిపోయి ఆ మురికి నీటితో సహా సరఫరా అవుతున్నాయి. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి పైపులైన్ మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



తాగునీటి పైపులైన్ పగిలి వృథాగా పోతున్న నీరు

నేడు రాష్ట్ర స్థాయి ఎడ్ల బలప్రదర్శన

మార్కాపురం రూరల్, మార్చి 7: మండలంలోని తిప్పాయపాలెం గ్రామంలో మునీశ్వర స్వామి ఆలయం వద్ద మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నేడు రాష్ట్రస్థాయి పశు బలప్రదర్శన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు గురువారం తెలిపారు. ఆరుపళ్ల విభాగంలో పశు బలప్రదర్శన పోటీలలో ఆరు బహుమతులు దాతల సహకారంతో అందించనున్నట్లు తెలిపారు. అలాగే న్యూ కేటగిరి విభాగంలో ఆరు బహుమతులు విజేతలకు అందజేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయంలో నిర్వహించనున్న సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించాలని కోరారు. ఈ రాష్ట్ర స్థాయి పశు బలప్రదర్శన పోటీలను పరిసర ప్రాంత ప్రజలు తిలకించాలని, స్వామివారి తీర్థప్రసాదాల స్వీకరించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం

మార్కాపురం వన్ టౌన్, మార్చి 7: స్థానిక గుండ్లకమ్మ నదీ తీరాన వెలసిన శ్రీలక్ష్మీ పద్మావతి సమేత కళ్యాణ వేంకటే శ్వరస్వామి ఆలయంలో గురువారం స్వామికి కల్యాణం వైభవంగా నిర్వ హించారు. స్వామి జన్మనక్షత్రం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని అర్చకులు ఏవీకే నరసింహా చార్యులు వైభవంగా కల్యాణ ఘట్టాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద స్వీకరణ నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు చెక్కా మాల కొండ నరసింహారావు, కోశాధికారి ఊటుకూరి రామకృష్ణారావుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.



ఉభయదేవేరులతో వేంకటేశ్వరుడు

ఏపీపీ బాలునాయక్‌కు ఉత్తమ ప్రతిభ అవార్డు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 7: స్థానిక ఆరవ అదనపు జిల్లా కోర్టులో ఏపీపీగా పనిచేస్తున్న ఆర్.బాలు నాయక్‌కు ఉత్తమ ప్రతిభ అవార్డు లభించింది. రాష్ట్రస్థాయి పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ల సదస్సు ఇటీవల విజయవాడలో నిర్వహించారు. వివిధ కేసుల పురోగతిలో ప్రతిభ చూపించిన బాలునాయక్‌కు రాష్ట్ర ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ శ్రీరామ్, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూటర్ సుదర్శన్‌రెడ్డిలు ఉత్తమ ప్రతిభ అవార్డు అందజేశారు.

వేడుకగా ధ్వజారోహణ

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 7: స్థానిక జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. అర్చకులు వరుణ్ తేజ శర్మ, ఆంజనేయశర్మలు భేరీపూజ, ప్రథమ గణ ఆహ్వానం నిర్వహించారు. అనంతరం నంది ధ్వజారోహణ వేడుకగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి, ఆలయ ఛైర్మన్ కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

16న జాతీయ లోక్‌అదాలత్

గిద్దలూరు టౌన్, మార్చి 7 : గిద్దలూరు కోర్టులో ఈ నెల 16న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు జూనియర్ సివిల్ జడ్జి బి.మేరీసారాదానమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దూపాడు నూతన సర్పంచ్‌గా అనూష

త్రిపురాంతకం, మార్చి 7: మండలంలోని దూపాడు గ్రామ సర్పంచ్‌గా ఎనిబెర అనూష నూతనంగా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఉన్న సర్పంచ్ ఎనిబెర శైలజ సెలవు పెట్టారు. దీంతో 4వ వార్డు సభ్యురాలిగా, ఉప సర్పంచ్‌గా ఉన్న అనూషను సర్పంచ్‌గా నియమిస్తూ జడ్పీ సీఈవో నుంచి ఉత్తర్వులు వచ్చాయి. దీంతో ఎంపీడీవో సాంబశివరావు, ఎంపీపీ సుబ్బారెడ్డి చేతుల మీదుగా ఉత్తర్వులు అందుకున్న అనూష గ్రామ సర్పంచ్‌గా గురువారం బాధ్యతలు చేపట్టారు.

ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 7: స్థానిక ఎస్సీబీసీ కాలనీలోని డ్వాక్రా బజార్‌లో ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలు గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు గురువారం పంపిణీ చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన 4007 మందికి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, వైస్ ఛైర్మన్‌లు ఇస్మాయిల్, అంజమ్మ, మున్సిపల్ కమిషనర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు. జవహర్‌నగర్ కాలనీకి చెందిన కె.శ్రీనివాసరెడ్డికి మంజూరైన రూ.1.60లక్షల చెక్కును పంపిణీ చేశారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

గిద్దలూరు టౌన్, మార్చి 7 : మహిళలు అన్ని రంగాలలో రాణించాలని, న్యాయవాది లావణ్య అన్నారు. అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్యానల్ న్యాయవాదులతో న్యాయవిజ్ఞాన సదస్సు ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నిర్వహించారు. కార్యక్రమంలో లావణ్య మాట్లాడుతూ మహిళలకు సంబంధించిన చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో సీడీపీవో జ్యోతి, న్యాయవాదులు పోలయ్య, పిచ్చయ్యయాదవ్, రైడర్‌బాబు, సూపర్‌వైజర్ ఎం.వసంత, పారాలీగల్ వలంటీర్ అద్దంకి మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

వైసీపీ కుర్చీని మడతపెట్టేందుకు ప్రజలు సిద్ధం

టీడీపీ వై.పాలెం అభ్యర్థి ఎరిక్షన్‌బాబు

పుల్లలచెరువు, జనవరి 16: అవినీతి తప్ప అభివృద్ధి చేయని వైసీపీ ప్రభుత్వ కుర్చీని మడత పెట్టేందుకు ప్రజలు సిద్ధం అయ్యారని వై.పాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. గురువారం పుల్లల చెరువు మండలం ముటుకులలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికార పార్టీలో మంత్రిగా నాలుగున్నరేళ్లు మంత్రిగా పనిచేసిన ఆదిమూలపు సురేష్ అవినీతి మినహా అభివృద్ధి చేయలేక పోయారన్నారు. మార్కాపురాన్ని జిల్లా చేస్తామని మంత్రి ఇచ్చిన హామి ఏమైందని ప్రశ్నించారు. పూర్తికాని ప్రాజెక్టును ముఖ్యమంత్రి ప్రారంభిస్తుంటే మంత్రి చోద్యం చూస్తూ ఉండిపోయాడన్నారు. రాష్ట్రంలో వైసీపీ చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. దీనిపై చర్చకు సిద్ధమా..? అని సవాలు విసిరారు. రాష్ట్రానికి ఒక్క ఐటీ పరిశ్రమనైనా తెచ్చాడా..? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పయ్యావుల ప్రసాద్, జనసేన అధ్యక్షుడు కోటారి అచ్చయ్య, టీడీపీ మండల నాయకులు కాకర్ల కోటయ్య, పోట్ల గోవిందు, నాయకులుపాల్గొన్నారు.



భవిష్యత్తుకు గ్యారెంటీ పత్రాలు అందజేస్తున్న ఎరిక్షన్‌బాబు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎరిక్షన్‌బాబు

చంద్రబాబు సభ ఏర్పాట్ల పరిశీలన

ఎర్రగొండపాలెం : నియోజకవర్గం గురిజేప ల్లి గ్రామం వద్ద మార్చి 11 న జరిగే టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రజాగళం సభకు, హెలీప్యాడ్‌కు గురువారం టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు స్థలపరిశీలన చేశారు. 11న ఎర్రగొండపాలెం నియోజకవర్గం నుంచి జరిగే ప్రజాగళం సభకు హైవే రోడ్డు పక్కన ప్రైవేటు స్థలంలో సభా వేదిక స్థలం దగ్గరలోనే హెలి ప్యాడ్ ల్యాండింగ్‌కు స్థలం శుభ్రం చేయించారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గం నుంచి 25 వేల మంది టీడీపీ అభిమానులను, ప్రజలను తరలించేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు. బహిరంగసభకు విశాలమైన స్థలం ఏర్పాటు చేస్తున్నారు. టీడీపీ ముఖ్యనాయకులు చిట్యాల వెంగల్‌రెడ్డి, కాకర్ల కోటయ్య, మంత్రునాయక్, షేక్ వలి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రాజెక్టు పూర్తి కాకుండానే జాతికి అంకితమా ..?

- హంగు, ఆర్భాటాలకే ప్రాధాన్యత
- నిర్వాసితుల పరిస్థితి ఏమిటి ?
- టీడీపీ ఇన్‌చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, మార్చి 7 : ప్రాజెక్టు పూర్తి కాకుండానే హంగు, ఆర్భాటాలతో జగన్‌రెడ్డి ప్రజలను మోసం చేశాడని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దోర్నాల మండలంలోని వెలిగొండ ప్రాజెక్టు వద్ద బుధవారం జగన్మోహన్‌రెడ్డి వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం అంటూ చేసిన ఆర్భాటం ప్రజలను మభ్యపెట్టడమే అంటూ పశ్చిమ ప్రాంత ప్రజలు, రైతుల ఓట్లు దండుకోవడం కోసం జగన్ నాటకం ఆడుతున్నాడని అన్నారు. వెలుగొండ పూర్తయితే నీరు ఇవ్వకుండా ఎలా పూర్తయిందంటూ వ్యాఖ్యానించారు. నిన్న జరిగిన కార్యక్రమం కేవలం ఒక బూటకమన్నారు. ఎక్కడైనా ప్రాజెక్టు పూర్తయితే నీరు ఇచ్చి జాతికి అంకితం చేస్తారని, కానీ బటన్ నొక్కుడు ముఖ్యమంత్రి పూర్తికాని ప్రాజెక్టు, పూర్తికాని కాలువలు ఉన్నా వెలుగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేశానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఎప్పటికైనా టీడీపీతోనే వెలుగొండ ప్రాజెక్టు పూర్తవుతుందని, జగన్ మాయమాటలు నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. వచ్చే ఎన్నికలలో వైసీపీ ఎమ్మెల్యేలను చిత్తుచిత్తుగా ఓడించి జగన్ నాటకానికి ప్రజలు తెర దింపుతారన్నారు. విలేకరుల సమావేశంలో పట్టణ పార్టీ అధ్యక్షులు షహన్షావలి, పెద్దవలి, పందిళ్ళపల్లి శ్రీనివాసులు, ఒ.వెంకటయ్య, గోపాలక్రిష్ణ, జాఫర్ తదితరులు ఉన్నారు.

టీడీపీతోనే బీసీల సంక్షేమం : ముత్తుముల

గిద్దలూరు టౌన్, మార్చి 7 : టీడీపీతోనే బీసీల సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో బీసీ డిక్లరేషన్‌పై హర్షం వ్యక్తం చేస్తూ బీసీ నాయకులు ముత్తుముల అశోక్‌రెడ్డిని సన్మానించారు. ఈసందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుండి బీసీల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే 50 ఏళ్ల నిండిన బీసీలకు రూ.4 వేల పింఛన్ అందజేస్తారన్నారు. బీసీ రక్షణ చట్టం, బీసీలకు శాశ్వత కులధ్రువీకరణ పత్రాలు, పెళ్లి కానుకలను అందజేయనున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో అశోక్‌రెడ్డి గెలుపు కోసం తామంతా కృషి చేస్తామని బీసీ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు బోనేని వెంకటేశ్వర్లు, పందిళ్లపల్లి వెంకటేశ్వర్లు, ఒ.వెంకటయ్య, బోయిళ్ళపల్లి కిశోర్, బిల్లా రమేష్‌యాదవ్, వేములపాటి చంటి, జాఫర్, పెద్దబాషా, పందనబోయిన రాజభూపాల్, తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు బేస్తవారపేటకు చెందిన ఖాశింపీరా ఆటో ప్రమాదంలో గాయపడ్డారు. ఆయన్ను అశోక్‌రెడ్డి పరామర్శించారు.



అశోక్‌రెడ్డిని సన్మానిస్తున్న బీసీ నాయకులు

టీడీపీలో చేరికలు

పట్టణంలోని 5వ వార్డులో మాజీ కౌన్సిలర్ అల్తాఫ్‌హుస్సేన్ తన కుటుంబసభ్యులతో కలిసి టీడీపీలో చేరారు. వారందరికీ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అల్తాఫ్‌హుస్సేన్ అన్నదమ్ములు, అక్కచెల్లెల్లు, వారి కుటుంబ సభ్యులందరూ చిన్నారులతో కలిసి పార్టీలో చేరడం పలురిని ఆకర్షించింది.మైనారిటీ అభివృద్ధికి టీడీపీ చేస్తున్న కృషికి ఆకర్షితుడై ఆ పార్టీలో చేరినట్లు తెలిపారు.

కంభం : కంభం మండలం తురిమెళ్ల గ్రామంలో గిద్దలూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి సమక్షంలో స్థానిక మాజీ సర్పంచ్ నారిశెట్టి వీరమ్మ, షేక్ రసూల్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన 100 మైనారిటీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా వారికి అశోక్‌రెడ్డి టీడీపీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో గిద్దలూరు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి బెల్లంకొండ సాయిబాబా మాట్లాడుతూ.. అశోక్‌రెడ్డి విజయానికి కృషిచేద్దామన్నారు. జనసేన-టీడీపీ అభ్యర్థిగా ముత్తుముల అశోక్‌రెడ్డి పోటీ చేయనున్నారని, ఆయన విజయానికి జనసేన తరపున కూడా శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. వైసీపీని వీడి టీడీపీలో చేరిన షేక్ గద్దర్, తంగెళ్ళ మౌలాలి, లాలూహుస్సేన్, లాలీమామ్, గోపానిపల్లి ఖాశింవలి, అక్బర్, మహబూబ్, బషీర్, మహమ్మద్ రఫి, నీరుకట్టు మాబు, నెమిలయ్య, హుస్సేన్, ఆరవీటికోట ఖాశింవలి, సుభాని, నీరుకట్టు నన్నే, నడిపి మస్తాన్, పెద్దమౌలాలి, బేగం, అంబవరం ఖాశింబీ, గోపానిపల్లి ఖాశింబీ, ఖాశిం, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



తురిమెళ్లలో టీడీపీలో చేరిన నాయకులు

క్రమశిక్షణతో ఉన్నత విద్యనభ్యసించాలి

వార్షికోత్సవంలో ఎంఈవో

పెద్ద దోర్నాల, మార్చి 7: క్రమశిక్షణతో విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించాలని ఎంఈవో మస్తాన్‌నాయక్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు గురువారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ఎస్‌వీ నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో ఎంఈవో పాల్గొని ప్రసంగించారు. ప్రాథమిక స్థాయి నుండే విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలన్నారు. పదోతరగతి విద్యార్థులు భయపడకుండా పరీక్షలు రాయాలన్నారు. అనంతరం విద్యా ర్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది నాగమూర్తి, విజయకుమారి, మీటే నాయక్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో మస్తాన్‌నాయక్

మార్కాపురం వన్‌టౌన్ : రానున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు పట్టుదలగా చదవి మంచి జీపీఏ సాధించాలని ఉప విద్యాశాఖాధికారి చంద్రమౌళీశ్వర్ అన్నారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవోలు రాందాస్‌నాయక్, శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్ : స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఈఎండీపీ కోఆర్డినేటర్ ఎస్.షమివుల్లా బాషా విద్యార్థులకు బహుమతులు అందించారు. జిల్లాస్థాయి ఈఎండీపీ ఎక్స్-2023-24లో మొదటిస్థానం సాధించిన ఉపాధ్యాయుడు షమివుల్లా బాషా, విద్యార్థులను ఉప విద్యాశాఖాధికారి చంద్రమౌళీశ్వర్ సన్మానించి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత టీఎస్ జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

పరమ పావనం అనుమునిగిరి క్షేత్రం

- శివరాత్రి వేడుకలకు ముస్తాబైన శివరామబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానం
- పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కోరుతున్న భక్తులు.. పట్టించుకోని పాలకులు

మండలంలోని దూబగుంట పంచాయతీ పరిధిలోని అనుమునిగిరి క్షేత్రం మహాశివరాత్రికి ముస్తాబైంది. ప్రతి ఏటా జరిగే ఉత్సవాలకు చుట్టుపక్కల గ్రామాలతోపాటు సుదూర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారు. దీంతో ఆలయ నిర్వాహకులు దాతల సహకారంతో ఏర్పాట్లు పూర్తి చేశారు. ముఖ్యంగా ఆలయ భూములు కౌలుకు తీసుకున్న రైతులు అన్నదానం ఏర్పాటు చేశారు.



అనుమునిగిరి క్షేత్రం



కోనేరు.. శ్రీ శివరామ బ్రహ్మేంద్ర స్వామి

పామూరు, ఫిబ్రవరి 7 : పామూరు మండలంలో ఏకైక శైవ క్షేత్రంగా.. భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న ఎంతో మహిమ గల క్షేత్రం అనుమునిగిరి. ఈ క్షేత్రంలోని జగద్గురు శ్రీ శివరామ బ్రహ్మేంద్ర ఆలయం పరిధిలో 9 గ్రామాలు ఉన్నాయి. వందలాది ఎకరాల భూములు కౌలుకు తీసుకొన్న రైతులు శివరాత్రి మహోత్సవాల సమయంలో భక్తులకు అన్నదానం, జాగరణ సందర్భంగా వినోద, సాంస్కృతిక కార్యక్రమా లను నిర్వహిస్తారు. మహా శివరాత్రి సందర్భంగా అన్ని ఏర్పాట్లను చేశారు. పామూరుకు 7 కిలోమీటర్ల దూరంలో ఈ క్షేత్రం ఉంది. స్వామిని దర్శించుకునేందుకు ప్రతి ఆదివారం పలు ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. చారిత్రాత్మక నేపథ్యం ఉన్న అనుమునిగిరిలో స్వామి విగ్రహం వెనుక భాగంలో సొరంగమార్గం ఉంది. శ్రీ శివరామబ్రహ్మేంద్రస్వామి వారు జీవించిన సమయంలో సొరంగ మార్గం ద్వారా సీఎస్‌పురం మండలంలోని భైరవకోన క్షేత్రానికి రాకపోకలు సాగిస్తుండేవారని ప్రచారం. పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా పెద్దిరెడ్డిపల్లె గ్రామంలో చెరుకూరు చెలమయ్యాచారి లింగమాంబ దంపతులకు 1853లో చైత్రమాస శుద్ధ ఏకాదశి రోజున శివరామబ్రహ్మేంద్రస్వామి జన్మించారు. ఆయనకు భార్య సుబ్బమాంబ, కుమార్తె గోవిందమాంబ ఉన్నారు. 1895లో భాద్రపద బహుళ దశమి రోజున స్వామి వారు ఈ క్షేత్రం లో జీవ సమాధి అయ్యారు. ఆయన పరమాత్మలో కలిసి 128 సంవత్సరాలు గడిచింది. నాటి నుంచి నేటివరకు క్షేత్రంలో ప్రతి ఏటా మహా శివరాత్రి పర్వదినాన జాగరణ, వేడుకలు, స్వామివారి జీవ సమాధి అయిన రోజు ఆరాధన మహోత్సవాలు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తుండడం ఆనవాయితీ. ఇంత విశిష్టత ఉన్న ఆలయానికి భక్తుల తాకిడి ఉంది. అయినా ఆలయ అభివృద్ధి విషయంలో పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ఏటా ఉత్సవాల సమయంలో వచ్చే భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. భక్తులకు మంచినీటి సౌకర్యం, స్నానపు గదులు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. ఆలయ సమీపంలో ఉన్న పురాతన కోనేరు శిథిలావస్థకు చేరింది. ఆర్‌అండ్‌బీ రోడ్డు వద్ద నుంచి ఆలయం వరకు తారు రోడ్డు నిర్మించాలని భక్తుల విజ్ఞప్తి మేరకు సర్పంచ్ చొరవతో ఈ ఏడాది రోడ్డు పనులు ప్రారంభించారు. ఐదేళ్లకోసారి పాలకులు మారుతున్నారే తప్ప ఆలయాభివృద్ధికి కృషి చేయడం లేదని భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అనుమునిగిరి క్షేత్రాన్ని అభివృద్ధి చేసి, భక్తుల కోసం వసతులను కల్పించాలని భక్తులు, 9 గ్రామల ప్రజలు కోరుతున్నారు.



అన్నదానానికి సరుకులను అందజేస్తున్న టీడీపీ నాయకులు

అన్నదానానికి టీడీపీ నేత సహకారం

దొనకొండ, మార్చి 7 : శివరాత్రి వేడుకలు సందర్భంగా స్థానిక నాలుగురోడ్ల కూడలి వద్ద ఉన్న ఆనంద ఆశ్రమంలో మహా శివరాత్రి సందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటుకు టీడీపీ నాయకులు వీరపనేని వెంకన్నచౌదరి తన వంతు సహకారం అందజేశారు. ధర్మకర్త కాకర్ల భైరవానందస్వామికి గురువారం అన్నదానానికి అవసరమైన పలు సామగ్రిని అందజేశారు. అన్నదానం ఎంతో గొప్పదని తలంచి సహకరించినట్లు వెంకన్నచౌదరి తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దుగ్గెంపూడి కోటేశ్వరరావు, వై ఏడుకొండలు, ఫణిదపు అనంతరాములు, వైకె చౌదరి, పురుషోత్తం సత్యానందం, బోయపాటి సుబ్బయ్య, ఫణిదపు వీరాంజనేయులు, కొమ్మినేని ఆదెయ్య, యాగంటి పోలయ్య, తెల్లమేకల నాగరాజు పాల్గొన్నారు.

మహారుద్రపీఠంలో కల్యాణోత్సవం

పీసీపల్లి, మార్చి7 : మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పెద యిర్లపాడులోని మహా రుద్రపీఠంలో శుక్రవారం శ్రీ భ్రమరాంబమల్లేశ్వరస్వామి వార్ల కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు అర్చకులు పలుకూరి సుబ్బారావు తెలిపారు. గణపతి పూజ, రుద్రాభిషేకం, బిల్వార్చన అనంతరం కల్యాణోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. మధ్యాహ్నం 1గంటకు అన్నసంతర్పణ ఉంటుందని తెలిపిన ఆయన రాత్రి 11గంటలకు లింగోద్భవం, అభిషేకం అనంతరం 108 కిలోల భస్మంతో భస్మాభిషేకం నిర్వహస్తున్నట్లు ఆయన తెలిపారు. భక్తులందరూ తరలివచ్చి కల్యాణ మహోత్సవాన్ని తిలకించాలని ఆయన కోరారు.

సరస్వతీదేవి విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సర్పంచ్ మహేశ్వరి నారాయణస్వామి

ముండ్లమూరు, మార్చి 7 : మండలంలోని శంకరాపురం యూపీ పాఠశాలలో చదువుల తల్లి సరస్వతి దేవి విగ్రహాన్ని ఆ గ్రామ సర్పంచ్ కూరపాటి మహేశ్వరి నారాయణ స్వామి గురువారం ఆవిష్కరించారు. గ్రామానికి చెందిన గంగినేని పెద రామచంద్రయ్య వెంకట రమణమ్మల జ్ఞాపకార్థం వారి కుమారులు శ్రీనివాసరావు, కోటయ్య, చిరంజీవులు సరస్వతి మాత విగ్రహాన్ని బహూకరించారు. ముఖ్య అతిగా సర్పంచ్ కూరపాటి మహేశ్వరి నారాయణ స్వామి మాట్లాడుతూ పాఠశాలలో సరస్వతి విగ్రహాన్ని ఏర్పాటు చేయటం శుభ పరిణామం అన్నారు. రూ 30వేలు విలువ చేసే విగ్రహాన్ని దాతలు బహూకరించటం గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు కే వెంకటేశ్వర్లు, ఎస్ సుబ్బారావు, హెచ్‌ఎం అరుణ కుమారి, రిటైర్డు హెచ్‌ఎం దీక్షితులు, ఉపాధ్యాయులు కృష్ణారావు, ఉప సర్పంచ్ రమాదేవి, ఎస్‌ఎంసీ ఛైర్మన్ మండలపు శ్రీనివాసరావు, మేదరమెట్ల రాంబాబు, మేడికొండ పూర్ణాంజనేయులు, పూర్ణయ్య, గూడూరి వెంకటరావు తదితరులు ఉన్నారు.

ఏకాగ్రతతో పరీక్షలు రాయాలి



పరీక్ష అట్టలను అందజేస్తున్న వనితా సభ్యులు

పామూరు, మార్చి 7 : రానున్న పదవతరగతి పరీక్షలను ఏకాగ్రతతో రాస్తే మంచి ఉత్తీర్ణత సాధిస్తారని వాసవీ వనిత క్లబ్ అధ్యక్షులు వీ శ్రీలక్ష్మి, కార్యదర్శి జీ సువర్ణ అన్నారు. మండలంలోని వీరభద్రాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్షలు రాయనున్న విద్యార్థులకు రూ.2500 విలువచేసే పరీక్ష సామగ్రిని గురువారం అందజేశారు. ముందుగా పాఠశాల ఆవరణలోని సరస్వతీ తల్లి విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్థిక కార్యదర్శి శ్రీరాం పద్మ, ఉపాధ్యక్షులు కోటపాటి స్వర్ణలత, ఉపాధ్యాయులు షేక్ బాషా, పీ కోటేశ్వరరావు, వై రామచంద్రారెడ్డి, అనంతనాగలక్ష్మి, ఎస్.జనార్దనరావు, వై.నాగశివరాజు, మధుసూదన్‌రావు, పద్మ విద్యార్థులు పాల్గొన్నారు.



జ్యోతమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

సర్పంచ్ జ్యోతమ్మ సేవలు మరువలేనివి

పామూరు, మార్చి 7 : గ్రామ సర్పంచ్‌గా రెండు పర్యాయాలు ఎన్నికై గ్రామాభివృద్ధికి ఉత్తమ సేవలు అందించిన జ్యోతమ్మ సేవలు మరువలేనివని కదిరి పార్థసారథి తెలిపారు. మండలంలోని తూర్పుకట్టకిందపల్లి గ్రామ మాజీ సర్పంచ్ స్వర్గీయ నీరుకట్టు జ్యోతమ్మ వైకుంఠసమారాధన కార్యక్రమాన్ని కుటుంబ సభ్యులు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన జ్యోతమ్మ గారి చిత్రపటానికి కుమారుడు మాజీ వైస్ ఎంపీపీ నీరుకట్టు హరికృష్ణ ప్రసాద్‌తో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మాజీ సర్పంచ్‌లు పోతురాజు వెంకట్రావు, పసుపులేటి గురుస్వామి, బులియన్ మర్చంట్ గౌరవ అధ్యక్షుడు పోతురాజు వెంకటరత్నం, డాక్టర్ గద్దె ఏడుకొండలు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఉప్పలపాటి హరిబాబు, చప్పిటి రామయ్య, ఏఎంసీ మాజీ డైరెక్టర్ నర్సింగ్ సాంబశివరావు, ఆకుపాటి రమణయ్య నీరుకట్టు నాయబ్‌రసూల్, గద్దె సుధకర్‌రావు, నీరుకట్టు చంద్రశేఖర్, సురేష్‌బాబు, రఘురాం, నాగిశెట్టి బ్రహ్మయ్య, నాగేశ్వరరావు, వరికూటి చిరంజీవి, పెద్దిశెట్టి గోపీ కుమార్, పిడుగు శ్రీనివాసులు, నీరుకట్టు మాల్యాద్రి(బుజ్జి), శ్రీనివాసులు, పిన్నెబోయిన ఓబులరాజు, పాలపర్తి రమణయ్య, కదిరి రాంబాబు, తోపాటు వైసీపీ ఇన్‌చార్జి నారాయణయాదవ్, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, కే రామిరెడ్డి, అంబటి కొండారెడ్డి, జీవీ భాస్కరరెడ్డి, కరణం వెంకట్రావు నివాళులర్పించినవారిలో ఉన్నారు.

అచ్చెన్నను కలిసిన రవికుమార్



దర్శి, మార్చి 7 : టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కే అచ్చెన్నాయుడును దర్శి నాయోజకవర్గ టీడీపీ నాయకుడు గోరంట్ల రవికుమార్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దర్శి నియోజకవర్గ పరిస్థితులను వివరించినట్లు రవికుమార్ తెలిపారు. దర్శి నియోజకవర్గంలో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా ఎవరు పోటీ చేసినా ఘన విజయం సాధిస్తారని చెప్పినట్లు ఆయన వివరించారు. వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అందరూ సమిష్టిగా కృషి చేయాలని అచ్చన్నాయుడు వివరించినట్లు తెలిపారు.

పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలి



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న నగర పంచాయతీ చైర్మన్ పిచ్చయ్య

దర్శి, మార్చి 7 : పారిశుధ్య కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య సూచించారు. దర్శి పట్టణంలోని 10 వార్డులో పారిశుధ్య కార్యక్రమాలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడా చెత్త నిల్వ లేకుండా చూడాలన్నారు. మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఈ రహీమ్, ఏఈ శ్రీనివాస్, కౌన్సిలర్లు దత్తాత్రేయ, దినకర్, నారాయణ పాల్గొన్నారు.

సాధికారతే లక్ష్యంగా పోరాడాలి



మహిళా ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న అధికారులు

పామూరు, మార్చి 7 : సమాజంలో సగ భాగం ఉన్న మహిళలు సమానత్వం, సాధికారతే లక్ష్యంగా పోరాడాలని ఎంపీడీవోపీ పుట్టారెడ్డి సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్స వం సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో అంగన్‌వాడీ ఆధ్వర్యంలో మహిళా ప్రజాప్రతినిధులకు, ఉద్యోగులకు గురువారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ జీ లక్ష్మి మాట్లాడుతూ హ క్కుల కోసం, సమానత్వం కోసం మహిళలు ఉద్యమించాలన్నా రు. ఎంపీపీ లక్ష్మి, సింగిల్ విండో చైర్మన్ వెంకట సుజాత, సర్పంచ్ రాగమ్మ, ఎం ఈవో కరణకుమారి, కే జీబీవీ ప్రిన్సిపాల్ కట కం సజన, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, పద్మజ, పార్వతిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కేఎల్ శ్రీనివాసరావు, స్వయంకృషి అధ్యక్షుడు షేక్ నాయబ్ రసూల్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీది అభివృద్ధి..వైసీపీది దివాలా పాలన



డాక్టర్ ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన యర్రొబనపల్లి గ్రామస్థులు .. టీడీపీలో చేరిన గోపాలపురం ఎస్సీ కాలనీ వాసులు

- ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఉగ్ర
- ఎర్రఓబనపల్లి, బోయపాలెం, 19వార్డు, గోపాలపురంలో వైసీపీని వీడి టీడీపీలో చేరిన కుటుంబాలు

కనిగిరి, మార్చి 7 : టీడీపీది అభివృద్ధి.. వైసీపీది దివాలా పాలన అని టీడీపీ కనిగిరి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. మండలంలోని ఎర్రఓబనపల్లి గ్రామంలో గురువారం డాక్టర్ ఉగ్ర సమక్షంలో 39 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఉగ్ర మాట్లాడుతూ వైసీపీ పాలనతో రాష్ట్రం దివాళా దిశగా వెళ్లిందన్నారు. సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చుతున్నామని ప్రచారం చేసుకునే వైసీపీ పాలకులు ప్రజల నుంచి వసూలు చేసే పన్నులను, పెంచిన ధరలను గురించి మాట్లాడే ధైర్యం లేదన్నారు. ఒక్క చాన్స్ అని అధికారం ఇస్తే ప్రజల నెత్తిన అప్పులభారం మోపారన్నారు. రాష్ట్రం అభివృ ద్ధి గాడిలో పడాలంటే పాలనాదక్షుడైన చంద్రబాబుతో సాధ్యమన్నారు. ప్రజలు విజ్ఞతతో టీడీపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. అబద్ధపు మాటలు, చేతగాని హామీలతో మోసగించే వైసీపీని చిత్తుగా ఓడిం చాలని ఉగ్ర పిలుపునిచ్చారు. రాష్ట్రం కోసం చంద్రబాబును, కనిగిరి కోసం తనను గెలిపించాలన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి 5 ప్ర ణాళికలతో తాను సిద్ధగా ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నారపరెడ్డి(యడవల్లి) శ్రీనివాసులురెడ్డి, పిచ్చాల శ్రీనివాసులరెడ్డి, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కనిగిరి పట్టణంలోని బోయపాలెంలో వైసీపీ కౌన్సిలర్ మామ తిరుపతియ్య తోపాటు 40 కుటుంబాలు, 19వార్డుకు చెందిన కోఆప్షన్ మాజీ సభ్యుడు పీర్ల మస్తాన్ వలీతో పాటు 39 ముస్లిం కు టుంబాలు ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరారు.

విధ్వంస పాలనకు చరమగీతం

గోపాలపురంలో వైసీపీని వీడిన 50 కుటుంబాలు

పామూరు : ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి అభివృద్ధిని చేయడం చేతగాక విధ్వంస పాలనతో రాష్ట్రాన్ని నాశనం చేశారని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. పామూరు మేజర్ పంచాయతీలోని గోపాలపురం ఎస్సీ కాలనీలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఉగ్ర మాట్లాడుతూ వైసీపీ పాలకులను అందలం ఎక్కిస్తే ప్రజా సమస్యలను విస్మరించారన్నారు. అభివృద్ధి చేసే పాలకులను రానున్న ఎన్నికల్లో గెలిపించుకోవాలని సూచించారు. తనకు పదవి ఉన్నా లేకున్నా నియోజకవర్గ ప్రజలను అంటిపెట్టుకొని సేవా కార్యక్రమాలు చేస్తున్నానని మీ ఓట్లతో గెలిచిన వారు పక్క నియోజకవర్గనికి ట్రాన్స్‌ఫర్ అయ్యారన్నారు. అనంతరం టీడీపీ నాయకులు పాలపర్తి రమణయ్య, శీనయ్య, రాజా ఆధ్వర్యంలో వైసీపీ సానుభూతిపరులు 50 కుటుంబాలు ఆ పార్టీని వీడి ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో పువ్వాడి వెంకటేశ్వర్లు, జీ దశరథరామయ్య, బీ జయరామిరె డ్డి, ఏ.ప్రభాకర్ చౌదరి, గంగరాజు బీ నరసింహారావు, అమీర్‌బాబు, మాజీ సర్పంచ్ డీవీ మనోహార్, షేక్ ఖాజారహంతుల్లా, శ్రీను, హరిబాబు, ఇర్రి కోటిరెడ్డి, హరీష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



వేములలో మాట్లాడుతున్న సురేష్

వైసీపీని సాగనంపండి

ముండ్లమూరు, మార్చి 7 : అవినీతి, అరాచక పాలన సాగిస్తున్న వైసీపీని వచ్చే ఎన్నికల్లో చిత్తుగా ఓడించి సాగనంపాలని టీడీపీ లీగల్ సెల్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు పరిటాల సురేష్ అన్నారు. ఆయన గురువారం మండలంలోని వేముల గ్రామంలో ప్రతి పల్లెకు టీడీపీ ప్రజా యాత్ర కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ గజ్జల సుబ్బారెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సురేష్ మాట్లాడుతూ జగన్‌రెడ్డి అరాచక, విధ్వంస పాలనలో రికార్డు సాధించారన్నారు. అధికారం చేపట్టిన వెంటనే టీడీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించడం తప్ప ఏ గ్రామంలోనూ అభివృద్ధి పనులు చేసిన దాఖలాలు లేవన్నారు. టీడీపీ, జనసేన పార్టీల పొత్తు వల్ల ఎంతో ఉపయోగకరమన్నారు. 60 రోజుల్లో వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలోనే కనుమరుగవుతుందన్నారు. కార్యక్రమంలో బాలయ్య, ఏడుకొండలు, బేతా కోటిరెడ్డి, భూమా కోటిరెడ్డి, గజ్జల అంకిరెడ్డి, అనిపిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, బాల గురవయ్య సుబ్బరాయుడు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల సందర్శన



సూచనలిస్తున్న తహసీల్దార్

ముండ్లమూరు, మార్చి 7 : సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ జే మధుబాబు పోలవరం, శంకరాపురం, వేంపాడులో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మాట్లాడుతూ నోటిఫికేషన్ వెలువడే లోపే పాఠశాలల్లో సౌకర్యాలను కల్పించాలన్నారు. ప్రధానంగా మరుగు దొడ్లు, తాగు నీరు, ర్యాంపులు, కిటికీలు, తలుపులకు మరమ్మతులు చేయించి ఓటు హక్కు వినియోగించుకోవటానికి వచ్చే ఓటర్లకు ఎలాంటి అసౌకర్యాలు కలిగించ కూడదన్నారు. గ్రామస్థులకు ఏమైనా సందేహాలు ఉంటే తమ దృష్టికి తీసుకు వస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వోలు జాన్‌లిపి, బద్రి అయ్యపరెడ్డి, బ్రహ్మతేజ, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తులపై నిర్లక్ష్యం వద్దు

మండలంలో రెవెన్యూకు సంబంధించి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించటంలో నిర్లక్ష్యం చేయవద్దని తహసీల్దార్ జే మధుబాబు అన్నారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌వోల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ పరమైన సమస్యలను వారం రోజుల్లో పరిష్కరించాలన్నారు. పదే పదే ప్రజలను తిప్పుకుంటే మాత్రం క్షమించేదే లేదన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పుల్లారెడ్డి, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి



ప్యాడ్లను అందిస్తున్న టీచర్ వెంకటేశ్వర్లు

దొనకొండ, మార్చి 7 : పదవ తరగతి విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి పదవ తరగతి ఫలితాల్లో పాఠశాలను అగ్రస్థానంలో నిలిపేలా కృషి చేయాలని దొనకొండ జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీవీ రామాంజనేయులు విద్యార్థులను కోరారు. పాఠశాల ఆవరణలో పదవ తరగతి విద్యార్థుల ఫేర్వెల్ వీడ్కోలు కార్యక్రమాన్ని గురువారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులకు పదవ తరగతి ఒక మైలు రాయని ఉపాధ్యాయులు చెప్పిన విషయాలను జాగ్రత్తగా గుర్తుపెట్టుకొని పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు నూరుశాతం ఫలితాలను సాధించాలన్నారు. విద్యార్థులు మంచి లక్ష్యాలను ఎంచుకొని ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో స్థిరపడాలని సూచించారు. మ్యాథ్స్ ఉపాధ్యాయుడు గోనుగుంట్ల వెంకటేశ్వర్లు 170 మంది విద్యార్థులకు స్వంత నిధులతో పరీక్ష అట్టలను అందించారు. పది ఫలితాల్లో మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.20 వేలు, పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలచిన విద్యార్థికి రూ.10వేలు నగదు బహుమతి అందజేస్తానని ప్రకటించారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాలకు చెందిన ఉపాధ్యాయ సిబ్బంది, విద్యాకమిటీ ఛైర్‌మెన్ సుధీర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్ష అట్టల పంపిణీ

పీసీపల్లి : పదవ తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు మండలంలోని టీడీపీ నాయకులు గురువారం ప్యాడ్‌లను పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే కనిగిరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాలతో టీడీపీ నాయకులు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులను సంప్రదించి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకు ఆల్ ది బెస్ట్ చెప్తూ పరీక్షలు రాసేందుకు అవసరమైన ప్యాడ్‌లను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమం లో కసిరెడ్డి ఓబుల్‌రెడ్డి, పువ్వాడి నాగరాజు, పువ్వాడి బ్రహ్మయ్య, బద్దిపూడి ఎబినేజర్, కొల్లా శ్రీరాములు, మాచర్ల, నానిబాబు, రత్తయ్యయాదవ్, నాగేంద్రబాబు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఉత్తీర్ణత సాధిస్తే గోల్డ్‌కాయిన్

పామూరు : ఈ ఏడాది టెన్త్‌లో మంచి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు గోల్డ్ కాయిన్ బహుమతిగా అందిస్తానని ఉప సర్పంచ్ వైవీ సాయి కిరణ్ ప్రకటించారు. గత ఏడాది ఫలితాల్లో 560 మార్కులు సాధించగా, ఈసారి దానిని అధిగమించాలని విద్యార్థులకు సూచించారు. పంచాయతీ వార్డు మెంబర్ ఇర్రి కృష్ణారెడ్డి ఆర్థిక సహకారంతో 180 మంది పదవతరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని ఎస్‌ఐ సైదుబాబు, ఉప సర్పంచ్ సాయి చేతుల మీదుగా గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాత కృష్ణారెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ ఛైర్మన్ షేక్ చాంద్ బాషా, విద్యాకమిటీ ఛైర్మన్ ఓగూరి తులసి ఏడుకొండలు, హెచ్‌ఎం మెడబలిమి రామస్వామి, మితికల నారాయణ, నాయబ్‌రసూల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




కోటప్పకొండకు తరలివెళ్తున్న అమీన్‌సాహెబ్ పాలెం ప్రభలు

మహాశివరాత్రి.. మహోత్సవాలకు శైవక్షేత్రాలు సిద్ధమయ్యాయి. చేదుకో కోటయ్య.. చేదుకో.. అంటూ భక్తులు శివయ్య దర్శనాలకు సిద్ధమయ్యారు. విద్యుత్ వెలుగుల్లో ఆలయాలు కాంతులీనుతున్నాయి. స్వామి దర్శనానికి పెద్దసంఖ్యలో తరలివచ్చే భక్తుల కోసం అధికారులు ప్రత్యేక క్యూలైన్లను సిద్ధం చేశారు. అభిషేకాలు, ప్రత్యేక పూజలకు కూడా ఏర్పాట్లు జరిగాయి. కోటప్పకొండ, వడ్లమూడి క్వారీ, గోవాడ క్షేత్రాలకు ప్రభలు ఆయా గ్రామాల నుంచి బయల్దేరాయి. ప్రసిద్ధ శైవక్షేత్రం కోటప్పకొండ తిరునాళ్ల శుక్రవారం నేత్రపర్వంగా జరగనుంది. వడ్లమూడి, గోవాడ క్షేత్రాల్లోని బాలకోటేశ్వరస్వామి ఆలయాల చుట్టూ పశువులు, జీవాలను తిప్పి కాపరులు మొక్కులు తీర్చుకున్నారు. భ్రమరాంబా సమేత మల్లికార్జునస్వామి వార్ల కల్యాణోత్సవానికి కాకాని మల్లన్న సన్నిధిని ముస్తాబు చేశారు. అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి గ్రామోత్సవం గురువారం కన్నుల పండువగా జరిగింది. శైవక్షేత్రాల్లో శుక్రవారం తెల్లవారుజాము నుంచే భక్తుల దర్శనాలకు ఏర్పాట్లు జరిగాయి.


విద్యుత్ కాంతులతో వెలుగొందుతున్న కోటప్పకొండ ఆలయం
ప్రత్యేక అలంకరణలో శ్రీ త్రికోటేశ్వర స్వామి మూల విరాట్


కోటప్పకొండ తిరునాళ్ళకు తరలివస్తున్న భారీ విద్యుత్ ప్రభలు


విద్యుత్ కాంతు లీనుతున్న అమరేశ్వర స్వామి ఆలయ గాలిగోపురం

చేదుకో.. కోటయ్యా

నేడు మహాశివరాత్రి

- విద్యుత్ వెలుగుల్లో శైవక్షేత్రాలు
- తిరునాళ్లకు కోటప్పకొండ ముస్తాబు
- బాలకోటేశ్వరస్వామి దర్శనాలకు భక్తుల క్యూ
- నేటి రాత్రి మల్లన్న, అమరేశ్వరుని కల్యాణోత్సవాలు

కోటప్పకొండ(నరసరావుపేట), మార్చి 7: కోటప్పకొండలోని త్రికోటేశ్వరస్వామి సన్నిధి తిరునాళ్లకు ముస్తాబైంది. అర్ధరాత్రి త్రికోటేశ్వర స్వామికి లింగోద్భవ అభిషేకాలు వైభవంగా జరగనున్నాయి. తిరునాళ్లకు రాష్ట్ర పండుగ హోదాతో ప్రభుత్వం తరఫున కోటయ్య స్వామికి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. దేవాలయంలో ఏర్పాట్లను ఈవో జి.శ్రీనివాసరెడ్డి, ట్రస్టీ రామకృష్ణ కొండలరావు పర్యవేక్షిస్తున్నారు. నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ, అద్దంకి, చీరాల, ఒంగోలు బస్టాండ్ల నుంచి 528 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసింది. సేవలు అందించేందుకు స్కౌట్స్, సత్యసాయి సేవా సమితి సభ్యులు కొండకు తరలి వచ్చారు. నాదెండ్ల మండలం అవిశాయపాలెం, అప్పాపురం నుంచి ఒక్కొక్క ప్రభ కొండకు గురువారం బయల్దేరింది. చిలకలూరిపేట మండలం కమ్మవారిపాలెం, మద్దిరాల, యడవల్లి, గోవిందాపురం, కోమటినేని వారిపాలెం, కావూరు గ్రామాల నుంచి ఒక్కొక్కటి, చిలకలూరిపేట మండలం పురుషోత్తపట్నం నుంచి ఆరు, బొప్పూడి నుంచి రెండు ప్రభలు కొండకు వస్తున్నాయి. నరసరావుపేట మండలం ఉప్పలపాడు, గురవాయపాలెం నుంచి ఒక్కొక్కటి, కాకాని నుంచి రెండు ప్రభలు కొండకు తరలి వస్తున్నాయి. భారీ ప్రభల కోసం చిలకలూరిపేట రోడ్డులోని ప్రధాన విద్యుత్ లైన్‌కు విద్యుత్ సరఫరా ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిలిపివేయనున్నారు.

వీఐపీలకు పెద్దపీట..

కోటప్పకొండ తిరునాళ్లలో వీఐపీలకు పెద్దపీట వేస్తున్నారు. కొండ కింద కారు దిగిన దగ్గర నుంచి స్వామి దర్శనం చేసుకునే వరకు వీఐపీలకు అన్ని సేవలు ఉచితంగా అందించనున్నారు. వేలాదిగా దర్శనం పాసులను పంపిణీ చేశారు. సామాన్య భక్తులకు అటు ఆర్టీసీ, ఇటు దేవస్థానం అన్ని సేవలకు టిక్కెట్లను విక్రయిస్తోంది. ఆర్టీసీ కూడా వీఐపీలకు ఉచితంగా 20 బస్సులను ఏర్పాటు చేసి వారి సేవకు సిద్ధమవగా, సామాన్య భక్తులను నుంచి ముక్కుపిండి అధిక చార్జీలను వసూలు చేస్తోంది.

అమరేశ్వరుని గ్రామోత్సవం


అమరావతి: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి గ్రామోత్సవం పులివాహనం, పల్లకిపై కన్నుల పండువగా జరిగింది. ఉదయం మండప పూజ, నిత్యోపాసన, రుద్రహోమం, బలిహరణ కార్యక్రమాలు జరిగాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచి జరిగే స్వామివారి దర్శనం, అభిషేకాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం రాత్రి 9 గంటలకు లింగోద్భవకాల అభిషేకాలు, ఎదురుకోల ఉత్సవం, ఆదివారం తెల్లవారుజామున 3 గంటలకు స్వామివార్ల కల్యాణోత్సవం జరుగుతుంది.

దేదీప్యమానంగా మల్లన్న సన్నిధి

పెదకాకాని: మహాశివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాలకు పెదకాకాని మల్లన్న సన్నిధిని సర్వంసిద్ధం చేశారు. ఆలయాన్ని రంగురంగు ల విద్యుత్ దీపాలు, పూలతో శోభయమానంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు స్వామివారి దర్శనం కోసం శీఘ్ర, లఘు, ఉచిత దర్శనాలకు అవసరమైన క్యూలైన్లను ఏర్పాటు చేశారు. భ్రమరాంబా సమేత మల్లికార్జునస్వామి వార్ల కల్యాణానికి ముస్తాబు చేశారు. ఏర్పాట్లను డీసీ దాసరి శ్రీరామవరప్రసాద్ పర్యవేక్షించారు.


విద్యుత్ కాంతులతో విరాజిల్లుతున్న పెదకాకాని మల్లన్న సన్నిధి

క్వారీలో ప్రత్యేక పూజలు


క్వారీ తిరునాళ్లకు సిద్ధమైన నారా కోడూరు విద్యుత్‌ప్రభ, ఇన్‌సెట్లో పూజలందుకొంటున్న శ్రీ బాల కోటేశ్వర స్వామి



చేబ్రోలు: వడ్లమూడి క్వారీ శ్రీ బాలకోటేశ్వరస్వామి సన్నిధిలో గురువారమే తిరునాళ్ల ప్రారంభమయ్యాయి. సమీప గ్రామాల ప్రజలు ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. తెనాలి డీఎస్పీ రమేష్ ఆధ్వర్యంలో 500 మంది సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధానరహదారిపై ఆలయం ఉండటంతో తెనాలి, గుంటూరు మార్గంలో ట్రాఫిక్‌ను పలు మార్గాల్లో మళ్లించారు.

ఉత్సవాలు ప్రారంభం


గోవాడ ఆలయ విద్యుత్ ప్రభ


విద్యుత్ అలంకరణలో ఆలయ రాజగోపురం

అమృతలూరు, మార్చి 7: అమృతలూరు మండలం గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయాన్ని భక్తుల దర్శనానికి సన్నద్ధం చేశారు. ఆలయం వద్ద చలువ పందిళ్లు నిర్మించారు. స్వామి వారికి వెన్న తదితర మొక్కులను భక్తులు చెల్లించారు. డీసీ బొంతు మహేశ్వరరెడ్డి, డీఎస్పీ మురళీకృష్ణ ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఇక్కడ శివరాత్రి ఉత్సవాలు ఐదు రోజుల పాటు జరగడం విశేషం. తెనాలి, బాపట్ల, రేపల్లె నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. కాకతీయ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, పద్మశాలీయ సత్రాల్లో అన్నదానం చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

టీడీపీ నేతలే లక్ష్యంగా విజిలెన్స్ తనిఖీలు?

రెండు బృందాల ఏర్పాటు.. క్వారీ యజమానుల బెంబేలు

బల్లికురవ, మార్చి 7: టీడీపీ నేతల గ్రానైట్ క్వారీలు, ఫ్యాక్టరీలే లక్ష్యంగా విజిలెన్స్ తనిఖీలకు సిద్ధమైనట్లు సమాచారం. ఈ క్రమంలో రాష్ట్రంలోని పలు జిల్లాల అధికారులతో రెండు బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో ఏడుగురు చొప్పున అధికారులు ఉండనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినట్లు సమాచారం. ఆయా బృందాల ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి బల్లికురవ, సంతమాగులూరు, మార్టూరు మండలాల్లోని గ్రానైట్ క్వారీలు, ఫ్యాక్టరీలను తనిఖీలు చేయనున్నట్లు తెలిసింది. అక్రమ క్వారీయింగ్, గ్రానైట్ అమ్మకాలపై వచ్చిన ఫిర్యాదులపై విచారణకు ఆదేశించినట్లు సమాచారం. ఇప్పటికే గ్రానైట్ పరిశ్రమ ఒడిదుడుకుల్లో ఉండగా తనిఖీల ఉత్తర్వులతో అత్యధిక శాతం ఫ్యాక్టరీల నిర్వాహకులు మూకుమ్మడిగా మూసివేసేందుకు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ఉత్తర్వులతో ఫ్యాక్టరీల యజమానుల్లో ఆందోళన నెలకొంది. బల్లికురవ, సంతమాగులూరు, మార్టూరు మండలాల పరిధిలో 500 వరకు గ్రానైట్ పాలిషింగ్ ఫ్యాక్టరీలు, బల్లికురవ, సంతమాగులూరు మండలాల పరిధిలో 30 వరకు గ్రానైట్ క్వారీలు నడుస్తున్నాయి. వీటిలో అత్యధికశాతం టీడీపీ సానుభూతిపరులవి. ఈ నేపథ్యంలో ఎన్నికల సమయంలో వారిని భయపెట్టేందుకు ఇలాంటి దాడులకు సిద్ధమవుతున్నారన్న విమర్శలున్నాయి. మేదరమెట్ల వద్ద ఈ నెల 10న సిద్ధం సభకు ఏర్పాట్లు జరుగుతున్న సమయంలో తనిఖీలకు ఉత్తర్వులు ఇవ్వడం వెనుక ఆంతర్యం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

దేవుడు.. యధార్థవంతుడు

- పాస్టర్ మోహన్ సీ లాజరస్
- ఘనంగా ప్రారంభమైన గుడారాల పండుగ

గుంటూరు(తూర్పు), మార్చి 7: దేవుడు న్యాయవంతుడు, యధార్థవంతుడు అని పాస్టర్ మోహన్ సీ లాజరస్ వ్యాఖ్యోపదేశం చేశారు. గుంటూరు సమీపంలోని గోరంట్ల హోసన్న మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో 47వ అంతర్జాతీయ గుడారాల పండుగ గురువారం ప్రారంభమైంది. తమిళనాడు నుంచి వచ్చిన పాస్టర్లు మోహన్ సీ లాజరస్, మెల్విన్ లాజరస్, హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహం, హోసన్న మినిస్ట్రీస్ చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ, పాస్టర్లు రమేష్, ఫ్రెడిపాల్, రాజు పండుగను ప్రారంభించారు. మోహన్ సీ లాజరస్, మెల్విన్ లాజరస్ గుడారాల పండుగకు వచ్చే ప్రతిఒక్కరూ భాగ్యవంతులు అని సందేశామిచ్చారు. 1977లో ప్రారంభమై నేడు లక్షలాది మంది విశ్వాసుల ప్రేమకు గుడారాల పండుగ చేరువైందన్నారు. అంతకముందు అమెరికా నుంచి వచ్చిన ఫాదర్ ఎర్నెస్ట్ పాల్ 'నిత్యతేజుడు ఏసయ్య' అనే పాటల పుస్తకాలను ఆవిష్కరించారు. 'నిత్యతేజుడు ఏసయ్య' అనే అల్బమ్‌ను మదనపల్లి నుంచి వచ్చిన పాస్టర్ రాజశేఖర్ ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వరరావు, వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన విశ్వాసులు ప్రార్థనల్లో పాల్గొన్నారు.




ఏసుక్రీస్తు గీతాలను ఆలపిస్తున్న అబ్రహం, జాన్‌వెస్లీ, రాజు, ఫ్రెడిపాల్, రమేష్, గుడారాల పండుగకు హాజరైన విశ్వాసులు

సిద్ధం సభ ఏర్పాట్ల పరిశీలన

మేదరమెట్ల, మార్చి 7: కొరిశపాడు మండలం పి.గుడిపాడు వద్ద ఈ నెల 10న జరగనున్న సిద్ధం సభ వేదిక, గ్యాలరీ, హెలిప్యాడ్, పార్కింగ్ ప్రదేశాలను గురువారం రాత్రి గుంటూరు రేంజి ఐజీ పాలరాజు పరిశీలించారు. సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశామన్నారు. పార్కింగ్ ప్రదేశాల్లోనూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సభకు సంబంధించిన అన్ని విభాగాలకు పోలీసు అధికారులను నియమించామన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హాజరయ్యే సభకు బందోబస్తు సిద్ధం చేశామన్నారు. సిద్ధం సభకు వచ్చే వాహనాలకు 28 చోట్ల పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ చెప్పారు. జాతీయ రహదారి నుంచి వాహనాలను మళ్లించే ప్రతిచోటా అందరికీ అర్థమయ్యే రీతిలో పోలీసు సిబ్బంది పబ్లిక్ అడ్రసింగ్ విధానం ద్వారా సూచనలు చేస్తామన్నారు. సభా ప్రాంగణం లో ప్రవేశించే ప్రతి వ్యక్తిని క్షుణ్ణంగా తనిఖీ చేస్తామన్నారు. పార్కింగ్ ప్రదేశాలు, ట్రాఫిక్ మళ్లింపు తదితర అంశాలను సెక్టార్ల వారీగా విభజించి అందరూ సమన్వయంతో విధులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమాల్లో కమ్యూనికేషన్స్ ఎస్పీ రాజశ్రీ, ఏఎస్పీ పి.మహేష్, డీఎస్పీలు బేతపూడి ప్రసాద్, మురళీకృష్ణ, జగదీష్‌నాయక్, చంద్రమోహన్, స్వామిబాబు, సీఐలు వి.మల్లికార్జునరావు, శివ రామకృష్ణారెడ్డి, కృష్ణయ్య, ఎస్‌ఐలు చంద్రశేఖర్, శివ య్య, శివకుమార్ తదితరులు ఉన్నారు.


సిద్ధం సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐజీ పాలరాజు

దొంగ.. దరఖాస్తులు

- ఓటు తొలగించాలంటూ ఫాం 7
- కొత్త పన్నాగంతో టీడీపీ ఓట్లపై వైసీపీ కన్ను
- టీడీపీకి పట్టు ఉన్న గ్రామాలపై ప్రత్యేక దృష్టి

అద్దంకి, మార్చి 7: నా ఓటు చేర్చండి అని దరఖాస్తు చేయడం సహజం.. అయితే అద్దంకి నియోజకవర్గంలో నా ఓటు తొలగించండి అని పెద్దసంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి. అటు అధికారులు గందరగోళానికి గురవుతుండగా.. ఇటు ఓటర్లు తమకు తెలియకుండానే తమ పేరుతో అప్‌లోడు అవుతున్న దరఖాస్తులపై ఆందోళన చెందుతున్నారు. టీడీపీ సానుభూతిపరుల ఓట్లను తొలగించాలన్న ఉద్దేశంతో వైసీపీ నేతలు ఈ సరికొత్త పన్నాగానికి తెరతీశారని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఆయా దరఖాస్తులపై పలుగ్రామాల టీడీపీ నేతలు ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకువెళ్తున్నారు. పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజవర్గ ఓటర్లను నిబంధనలకు విరుద్ధంగా అద్దంకి నియోజవర్గంలో చేర్చిన వైసీపీ నేతలు ఇప్పుడు టీడీపీకి పట్టు ఉండి ఎక్కువ మెజార్టీ వచ్చే అవకాశం ఉన్న గ్రామాలను ఎంపిక చేసుకుని ఓట్ల తొలగింపునకు సిద్ధమైనట్లు తెలుస్తుంది. ఈ క్రమంలో నియోజకవర్గంలో సుమారు 2 వేలకు పైగా సెల్ఫ్ డిక్లరేషన్లను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసినట్లు తెలుస్తోంది. ప్రధానంగా బల్లికురవ, అద్దంకి మండలాల పరిధిలోని గ్రామాల్లో దొంగ దరఖాస్తులు చేసినట్లు టీడీపీ నేతలు తెలిపారు. అద్దంకి మండలం దేనువకొండలో 203, 204, 205 బూత్‌లలో సుమారు వందకు పైగా ఓట్ల తొలగింపునకు దరఖాస్తులు అందినట్లు ఎన్నికల పర్యవేక్షణ అధికారులు ధ్రువీకరించడమే ఇందుకు నిదర్శనమని టీడీపీ నేతలు అంటున్నారు. వీటికి సంబంధించి దరఖాస్తులు ఇంకా ప్రాథమిక దశలో ఉన్నట్లు, ఇంకా అధికారుల వద్దకు కూడా రాలేదని సమాచారం. ఈ నెల 5 వరకు అందిన ఫాం 7లు 285 వరకు ఉన్నట్లు తెలుస్తుంది. పెద్దసంఖ్యలో సెల్ఫ్ డిక్లరేషన్ ఫాం 7లను ప్రత్యర్థులు దరఖాస్తు చేయడంపై టీడీపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి వేరే వ్యక్తుల పేర్లతో దరఖాస్తు చేసిన వ్యక్తులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.





కొప్పెరపాడు గ్రామ నేతలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయి

- నష్టపోయిన అన్నివర్గాలు
- జయహో బీసీ సభతో వణుకు
- ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

బల్లికురవ, మార్చి 7: వైసీపీ పాలనలో అన్నివర్గాల ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, ఈప్రభుత్వాన్ని చిత్తుచిత్తుగా ఓడించాలని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. గురువారం మండల పరిదిలోని వీర్లకొండ వద్ద అంబడిపూడి, వల్లాపల్లి, కొమ్మినేనివారిపాలెం, వైదన, కొప్పెరపాడు, ఎస్ఎల్‌గుడిపాడు, ముక్తేశ్వరం, రామంజనేయపురం, సూరేపల్లి, గొర్రెపాడు, కొత్తూరు, కూకట్లపల్లి, వెలమవారిపాలెం గ్రామాలకు చెందిన టీడీపీ నేతలు, బూత్ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ రానున్న నలభై రోజులు ఇంటింటికి తిరిగి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజలకు కలిగే సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించాలన్నారు. అలాగే, ఓటర్ల జాబితాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతిరోజు తనిఖీ చేసుకోవాలన్నారు. ఓట్లు తొలగించేందుకు కుట్ర జరుగుతందని చెప్పారు. నేతలు కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకొని ఐక్యతతతో ముందుకు వెళ్లాలన్నారు. వైసీపీ ప్రభుత్వం గత అయిదేళ్ల కాలంలో ప్రజలను తీవ్రంగా మోసం చేసిందన్నారు. సంక్షేమ పథకాల పేరిట పెద్దఎత్తున ప్రజల సొమ్మును దోచుకొన్నారని ధ్వజమెత్తారు. టీడీపీ, జనసేన పొత్తు ప్రకటించిన రోజునుంచే వైసీపీ నేతలకు ఓటమి భయం పట్టుకొందన్నారు. సైకో మాదిరిగా పరిపాలన చేస్తున్న జగన్‌రెడ్డిని ఇంటికి పంపే సమయం దగ్గరలో ఉందన్నారు.

ఈసందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ నిర్వహించిన జయహో బీసీ సభ చూసిన వైసీపీ ప్రభుత్వానికి వణుకు మొదలైందన్నారు. ఓటమి అంచుల్లో ఉన్న పార్టీని కాపాడటం చేతకాక అభ్యర్థులను మారుస్తున్న జగన్‌ను ప్రజలు మార్చేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. బీసీల రిజర్వేషన్లు తగ్గించిన జగన్‌రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 16,700 రాజ్యంగ పరమైన పదవులు దూరం చేశారని ఆరోపించారు. అలాగే, రూ.75 వేల కోట్ల బీసీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించారని రవికుమార్ ధ్వజమెత్తారు. గతంలో చంద్రబాబునాయుడు ఆదరణ పథకంతో చేతి వృత్తుల బీసీ కులాలకు ఎన్నో పథకాలు అందించగా, నేడు ఒక్కటి కూడా అందించటం లేదన్నారు. పథకాలు అందించకుండా బీసీలపై మారణకాండ కొనసాగిస్తున్న జగన్‌రెడ్డికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఎన్నికల గడువు దగ్గర పడటంతో రైతులను మరోసారి మోసం చేసేందుకు వైసీపీ ప్రభుత్వం వెలుగొండ ప్రాజెక్టును నీరు లేకుండా ప్రారంభించి రైతులను మాయ చేయటం దుర్మార్గమన్నారు.

సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు కొండేటి ఇజ్రాయల్, గొట్టిపాటి కమల్‌కిశోర్(బాబి), మలినేని గోవిందరావు, పావులూరి సత్యనారాయణ, మందలపు సుధాకర్, దద్దాల అంజయ్య, చింతల రామారావు, పరుసు ప్రసాద్, షేక్ అబ్దుల్లా, గొట్టిపాటి శంకర్, ముంద్రు దానయ్య, ఇప్పల అంజిరెడ్డి, మామిళ్లపల్లి ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



మణికేశ్వరం సచివాలయంలో మాట్లాడుతున్న వైసీపీ నేత శ్రీనివాసరెడ్డి

వైసీపీ కార్యాలయమా.. గ్రామ సచివాలయమా..

అద్దంకి, మార్చి 7: గ్రామ పాలనకు ఉపయోగించాల్సిన గ్రామసచివాలయలను వైసీపీ నేతలు తమ కార్యాలయాలుగా వినియోగించుకుంటూ ఎన్నికల ప్రచారం నిర్వహించటం పలు విమర్శలకు తావిస్తుంది. అద్దంకి మండలం మణికేశ్వరం, కొంగపాడు గ్రామాలకు సంబంధించి సచివాలయం రెండు గ్రామాల మధ్య మణికేశ్వరం పునరావాస కాలనీలో ఉంది. సచివాలయంలో పనిచేసే సిబ్బంది, వలంటీర్‌లతో పాటు రెండు గ్రామాల వైసీపీ నేతలతో బుధవారం వైసీపీ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాణెం హనిమిరెడ్డి సోదరుడు, అద్దంకి మండల ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్న శ్రీనివాసరెడ్డితో పాటు పలువురు మండలస్థాయి నేతలు హాజరయ్యారు. వలంటీర్‌లు వచ్చే ఎన్నికలలో కీలకంగా వ్యవహరించాలని, తమ పరిధిలో ఉన్న ఇళ్లకు వెళ్లి వైసీపీకి ఓటు వేసేవిధంగా చేయాలని చెప్పినట్లు తెలుస్తుంది. ఎన్నికల తరువాత వలంటీర్ వ్యవస్థ రూపురేఖలు మారతాయని, భవిష్యత్ నాయకులు కూడా వలంటీర్‌లే అని కూడా చెప్పినట్లు సమాచారం. సమావేశానికి సంబంధించిన ఫొటోలు గురువారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వైసీపీ నేతలు నిర్వహించిన సమావేశంలో సచివాలయ సిబ్బంది పాల్గొనటం చర్చనీయాంశంగా మారింది.

వైసీపీ ఒంటరిగానే పోటీ

- రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి

మేదరమెట్ల, మార్చి 7: టీడీపీ, జనసేనలు ఓటమి భయంతోనే ఢిల్లీ పెద్దల మద్దతు కోరుకుంటున్నాయని రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి అన్నారు. కొరిశపాడు మండలం పి.గుడిపాడు వద్ద సిద్ధం సభ జరిగే ప్రాంతంలో ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. వైసీపీ గతంలో మాదిరిగానే ఒంటరిగా పోటీ చేస్తుందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా 90 పథకాలను అమలు చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు మంత్రి వర్గంలో పెద్దపీట వేశారన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ బీసీ డిక్లరేషన్ సభ నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈనెల 10న పి.గుడిపాడు వద్ద జరిగే సిద్ధం సభకు 15 లక్షల మంది వస్తున్నట్లు అంచనా వేస్తున్నామని తెలిపారు.

ఇదేనా గౌరవం..

'నా ఎస్సీలు, నాఎస్టీలు, నా బీసీలంటూ ఊదరగొట్టే ముఖ్యమంత్రి, ఆ పార్టీ ముఖ్య నేతలు తాము నిర్వహించే సభలో ఆయా సామాజికవర్గాలకు ఎలాంటి గౌరవం ఇవ్వడంలేదు. వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో మంత్రి ఆదిమూలపు సురేష్‌తో పాటు, ఎర్రగొండపాలెం వైసీపీ ఇన్‌చార్జ్ తాటిపత్రి చంద్రశేఖర్‌లకు జరిగిన అవమానం మర్చిపోకముందే రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి నిర్వహించిన సమావేశంలో దళిత నేతలకు అవమానం జరిగింది. బాపట్ల జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు జజ్జర ఆనందరావు, కొరిశపాడు జడ్పీటీసీ తుళ్లూరి వెంకటరమణలు విజయసాయిరెడ్డి నిర్వహించిన సమావేశంలో ఆసాంతం నిలబడి ఉండాల్సి వచ్చింది. శింగరకొండ దేవస్థానం మాజీ ఛైర్మన్ కోట శ్రీనివాసరావు వీరి సరసన ఆసీనులయ్యారు. సమావేశంలో కుర్చీలు ఇంకా ఖాళీ ఉన్నా.. వీరికి మాత్రం చోటు దక్కలేదు. బీసీలకు చంద్రబాబు ఎలాంటి గౌరవం ఇవ్వలేదని విమర్శలు చేసే విజయసాయిరెడ్డి దళితులకు ఎలాంటి గౌరవం ఇస్తున్నారో పలువురు పేర్కొనడం గమనార్హం.

నేడు ఎమ్మెల్యే గొట్టిపాటి పర్యటన వివరాలు

అద్దంకి, మార్చి 7: ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం నియోజకవర్గంలో పలు గ్రామాలలో జరిగే కార్యక్రమాలకు హాజరుకానున్నారు. ఉదయం 10.30 గంటలకు మేదరమెట్ల, 11 గంటలకు కుంకుపాడు, 11.30కి రామాయపాలెం, 12 గంటలకు అద్దంకి పట్టణంలోని 1వ వార్డులో జరిగే కార్యక్రమాల్లో ఆయన పాల్గొననున్నారు.

మొక్కుబడి

- అజెండాలోని ప్రధాన అంశాలపై లేని చర్చ
- కేవలం తాగునీరు, ఇతర సమస్యలను ప్రస్తావించిన ఐదుగురు సభ్యులు
- ఇతర అంశాలను పట్టించుకోని వైనం
- రాజకీయ ప్రసంగాలకు కొందరు ప్రాధాన్యం
- ఎమ్మెల్యేలూ గైర్హాజరు
- జడ్పీ సమావేశం తీరుతెన్ను ఇది

జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి మార్గం చూపాల్సిన జిల్లా పరిషత్ సమావేశం మొక్కుబడిగా జరిగింది. అజెండాలో కేవలం మూడు అంశాలను మాత్రమే ఉంచగా వాటిపై కూడా చర్చ కరువైంది. జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా), పంచాయతీరాజ్‌పై ఒక్కరంటే ఒక్కరు కూడా మాట్లాడలేదు. తాగునీరు, ఇతర సమస్యలపై అర్ధగంటపాటు జరిగిన చర్చలో ఐదుగురు సభ్యులు మాత్రమే మాట్లాడారు. మరికొందరు చిన్నచిన్న సమస్యలను ప్రస్తావించి మమ అనిపించారు. అదేసమయంలో కొందరు సభ్యులు రాజకీయ అంశాలను ప్రస్తావిస్తూ మాట్లాడటం చర్చనీయాంశమైంది. ఎంతో ప్రాధాన్యత కలిగిన సమావేశానికి మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరుకాకపోవడం విమర్శలకు తావిచ్చింది.



జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, వేదికపై జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ఒంగోలు (కలెక్టరేట్), మార్చి 7 : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక పాత జడ్పీ సమావేశం హాలులో గురువారం చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన జరిగింది. ఉదయం 10 గంటల నుంచి స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. మధ్యాహ్న భోజన విరామ సమయం వరకూ అది కొనసాగింది. ఆ వెంటనే సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. అయితే అజెండాలో డ్వామా, పంచాయతీరాజ్, తాగునీరు, పారిశుధ్యం అంశాలను మాత్రమే ఉంచగా రెండు అంశాలపై చర్చ కరువైంది. తాగునీటి సమస్యపై మాత్రమే అతికొద్ది మంది సభ్యులు మాట్లాడారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ముందుగా అజెండాలోని రెండు అంశాలపై సభ్యులు మాట్లాడకపోవడంతో తదుపరి అంశమైన గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య కార్యక్రమాలను చర్చకు ఉంచారు. ఈ సందర్భంగా చీమకుర్తి జడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు మాట్లాడుతూ రామతీర్థం నుంచి దక్షిణం వైపు గ్రామాలకు మంచినీటి కోసం ఏర్పాటు చేస్తున్న పైపులైన్ నిర్మాణం మధ్యలో నిలిచిపోయిందని సమావేశం దృష్టికి తెచ్చారు. ఆ సమస్యను పరిష్కరించాలని కోరారు. హనుమంతునిపాడు ఎంపీపీ గాయం సావిత్రి మాట్లాడుతూ సాగర్ నీరు వచ్చే పైపులైన్లు పగిలిపోయాయని, వాటిని సరిచేయాలని విజ్ఞప్తి చేశారు. కనిగిరి జడ్పీటీసీ సభ్యుడు కస్తూరిరెడ్డి మాట్లాడుతూ కనిగిరి పట్టణంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో నీటి సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ దృష్ట్యా ట్యాంకర్ల ద్వారా నీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయా అంశాలపై కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు అవసరమైన ఏర్పాట్లు చేశామని తెలిపారు. తాగునీటి సరఫరా చేసిన ట్యాంకర్ల యజమానులకు పెండింగ్ బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రస్తుతం 58 ఆవాసాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. ఇంకా ఎక్కడైనా నీటి సమస్య ఉంటే సంబంధిత ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తెస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాలు పూర్తయ్యాయన్న ఆయన త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ రానున్నందున వాటిని ప్రారంభించేందుకు ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.

బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి

జిల్లా నుంచి రేషన్ బియ్యం అక్రమంగా తరలిపోతున్నా సంబంధితశాఖల అధికారులు పట్టించుకోవడం లేదని త్రిపురాంతకం జడ్పీటీసీ సభ్యుడు మాకం జాన్‌పాల్ ఆరోపించారు. జడ్పీ సమావేశంలో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. ఇక్కడి నుంచి ప్రతినెలా రూ.100 కోట్ల బియ్యం బ్లాక్ మార్కెట్‌కు వెళ్తున్నదన్నారు. ఆధారాలతో సహా అనేక పర్యాయాలు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. స్పందించిన కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రేషన్ పంపిణీ జరిగే సమయంలో తనిఖీలు నిర్వహించి సరుకులో తేడాలు ఉంటే 6ఎ కేసులు నమోదు చేయాలన్నారు.

రాజకీయ ప్రసంగాలకు వేదికైన జడ్పీ సమావేశం

రాజకీయ ప్రసంగాలకు జిల్లా పరిషత్ సమావేశం వేదిక కావడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైసీపీ అభ్యర్థులను గెలిపించుకొని మరోసారి జగన్‌ను సీఎం చేసుకుందామన్నారు.

ఇంకొల్లు జడ్పీటీసీ సభ్యురాలు శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఏడాది కాలంగా పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న వ్యక్తితో ఎన్ని ఇబ్బందులు పడ్డామో వివరించారు. నా మొరను సీఎం ఆలకించి ఆయన్ను మార్చారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని మరోసారి గెలిపించుకోవాలని కోరారు. అదేవిధంగా పలువురు సభ్యులు రాజకీయ ప్రసంగాలు చేయడాన్ని చూసి ఇతర సభ్యులు ఆశ్చర్యపోయారు.

హాజరుకాని మంత్రులు, ఎమ్మెల్యేలు

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి మంత్రులు, శాసనసభ్యులు గైర్హాజరయ్యారు. ఒంగోలు ఎంపీ మాగుంట మినహా ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాలకు చెందిన శాసనసభ్యులెవ్వరూ హాజరు కాలేదు. దీనిపై ప్రజల నుంచి నిరసన వ్యక్తమవుతోంది.

దర్శి అభ్యర్థిపై ప్రత్యేక కసరత్తు

- జనసేనకు కేటాయింపు
- పరిశీలనలో శిద్దా, చైతన్య, డాక్టర్ లక్ష్మి, వెంకట్ తదితరుల పేర్లు
- మాగుంటను కలుస్తున్న ఆశావహులు
- టీడీపీ దర్శి బాధ్యతలు గోరంట్ల రవికుమార్‌కు?

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

జిల్లాలో దర్శి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి దీటైన అభ్యర్థిని రంగంలోకి దింపేందుకు టీడీపీ, జనసేన పార్టీల అధినేతలు ఉమ్మడి కసరత్తు చేస్తున్నారు. పొత్తులో భాగంగా దర్శి సీటును జనసేనకు కేటాయించారు. అయితే అభ్యర్థి ఎంపికలో గెలుపే ముఖ్యంగా ఇరు పార్టీల నాయకులు ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో జనసేనకు 24 అసెంబ్లీ సీట్లు కేటాయించగా, జిల్లాలో దర్శిని ఆపార్టీకి ఖరారు చేశారు. తనను కలిసిన వారికి ఒంగోలు ఎంపీ మాగుంట కూడా దర్శి జనసేనకే కేటాయించినట్లు స్పష్టంగా చెబుతున్నారు. ఆ నియోజకవర్గంలో ప్రస్తుతం జనసేన తరఫున ఎన్ఆర్ఐ గరికపాటి వెంకట్ పనిచేస్తున్నారు. ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు రియాజ్ కూడా జిల్లాలో ఎక్కడ నుంచైనా తనకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ప్రస్తుతం వివిధ రకాల అంశాలను దృష్టిలో ఉంచుకుని ఆర్థిక, అంగ బలాలను లెక్కించి దీటైన అభ్యర్థిని రంగంలోకి దించేందుకు ప్రయత్నిస్తున్నారు. తొలుత ఆ నియోజకవర్గం నుంచి కాపు సామాజిక వర్గం అభ్యర్థిని పోటీలోకి దించాలని టీడీపీ అధినేత చంద్రబాబు భావించారు. జనసేనకు సీటు కేటాయించిన తర్వాత వేరే వారికి ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. తదనుగుణంగా ఇరుపార్టీల అగ్రనేతలు టికెట్ ఆశిస్తున్న వారిలో కొందరు ముఖ్యులపై కసరత్తు చేస్తూ సర్వేలు కూడా చేయిస్తున్నారు.

రంగంలో నలుగురు

జనసేన తరఫున ప్రస్తుతం పనిచేస్తున్న వెంకట్‌తోపాటు రాజకీయంగా మరో ముగ్గురు తాజాగా రంగంలోకి వచ్చారు. 2014లో అక్కడ ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా పనిచేసిన శిద్దా రాఘవరావు లేదా ఆయన కుమారుడి పేరు పరిశీలనలో ఉన్నట్లు తెలిసింది. తొలుత టీడీపీ నుంచి వారు టికెట్ ఆశించగా జనసేన నుంచే రావాలని సూచించారు. రెండు రోజుల నుంచి శిద్దా అనుచరులు ఆయన్ను కలవడం, నియోజకవర్గంలో ఆయన బరిలోకి దిగొచ్చని చెబుతుండడం గమనార్హం. ప్రస్తుతం ఆయన వైసీపీలో ఉన్నందున ధైర్యంగా ముందుకు వస్తారా? లేదా? అన్న అనుమానాలు ఉన్నప్పటికీ టీడీపీ, జనసేన అధినేతల వద్ద ఒక ముఖ్యనేత ఆయన పేరు ప్రతిపాదిస్తున్నట్లు తెలుస్తోంది. వైసీపీలో అన్యాయం చేశారంటూ టీడీపీ వైపు దృష్టిసారించిన మాజీ ఎమ్మెల్యే గరటయ్య కుమారుడు చైతన్య రంగంలో ఉన్నారు. వారు ఇటు చంద్రబాబుతోపాటు జనసేన అగ్ర నేతలను కలిశారు. తాజాగా మాజీ మంత్రి గొట్టిపాటి హనుమంతరావు కుమారుడు నరసయ్య కుమార్తె అయిన డాక్టర్ లక్ష్మి జనసేన తరఫున టికెట్ ఆశిస్తున్నారు. కాగా ఈ సెగ్మెంట్ ఒంగోలు లోక్‌సభ పరిధిలో ఉండడంతో ఆశావాహులు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డిని కలుస్తున్నారు. ఆయన కుమారుడు రాఘవరెడ్డి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయబోతున్నారు. ఇప్పటికే డాక్టర్ గరటయ్య, చైతన్య ఆయన్ను కలిశారు. గురువారం డాక్టర్ లక్ష్మి కుటుంబ సభ్యులు వచ్చి మాగుంటతో భేటీ అయ్యారు. శిద్దా కుటుంబ సభ్యులు కూడా మాగుంటకు టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బీజేపీతో చర్చలు జరిపేందుకు ఢిల్లీలో ఉన్న చంద్రబాబు, పవన్‌లు రాష్ట్రానికి వచ్చాక ప్రకటించే జాబితాలో దర్శి అభ్యర్థిని కూడా ఉండే అవకాశముంది.

హర్షిణి అధినేతకు బాధ్యతలు

దర్శి నియోజకవర్గ టీడీపీ బాధ్యతలు హర్షిణి విద్యా సంస్థల అధినేత గోరంట్ల రవికుమార్‌కు ఇచ్చే అవకాశముంది. విద్యాసంస్థల అధినేతగా సుపరిచితులైన ఆయన రెండేళ్ల నుంచి టీడీపీ రాజకీయాల్లో పాల్గొంటున్నారు. దర్శి నియోజకవర్గంలో కొన్ని కార్యక్రమాల బాధ్యతలు చూశారు. గురువారం టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడిని ఆయన కలిసినప్పుడు అసెంబ్లీ జనసేనకు కేటాయించినందున పార్టీ బాధ్యతలను ఇచ్చే అవకాశాన్ని పరిశీలిస్తున్నామని ఆయన హామీ ఇచ్చారు. అయితే అధికారికంగా నిర్ణయాన్ని వెల్లడించాల్సి ఉంది.



ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సులకోసం ప్రయాణికుల ఎదురు చూపులు

మహాశివరాత్రికి ఆర్టీసీ స్పెషల్ బస్సులు

- జిల్లావ్యాప్తంగా 150 సర్వీసులు ఏర్పాటు

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 7 : మహాశివరాత్రిని పురస్కరించుకొని పలు శైవక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. ఒంగోలు డిపో నుంచి శ్రీశైలం, కోటప్పకొండ, భైరవకోన ఆలయాలకు 150 స్పెషల్ బస్సులు నడవనున్నాయి. ఒంగోలు నుంచి శ్రీశైలం, కోటప్పకొండకు 45 బస్సులు కేటాయించారు. శ్రీశైలంకు కనిగిరి డిపో నుంచి 25, మార్కాపురం నుంచి 80 బస్సులు నడపనున్నారు. అలాగే కనిగిరి నుంచి భైరవకోనకు 20, పొదిలి నుంచి మరో 10 బస్సులు ఏర్పాటుచేశారు. ఈ స్పెషల్ బస్సుల్లో ఎలాంటి అదనపు చార్జీలు లేకుండా భక్తులు ప్రయాణించవచ్చని ఆర్ఎం సుధాకర్‌బాబు తెలిపారు.

మూడు రోజులు సెలవులు.. బస్సుల కోసం అవస్థలు

శుక్రవారం మహాశివరాత్రి, రెండో శనివారం, ఆదివారం వరుసగా మూడు రోజులు ప్రభుత్వ సెలవులు రావడంతో ప్రజలు తమ సొంతూర్లకు బయల్దేరారు. అయితే జిల్లాలోని ఆయా డిపోల నుంచి రోజువారీగా తిరిగే బస్సుల్లో అధికశాతం మహాశివరాత్రికి స్పెషల్ బస్సులుగా ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు తమ సొంతవూర్లకు వెళ్లేందుకు ఆర్టీసి బస్టాండ్‌లో గంటలకొద్దీ ఎదురుచూశారు.

మద్యంతోనే మహిళలపై దాడులు

కొండపి, మార్చి 7 : ప్రభుత్వాలు మద్యనిషేధం చేస్తేనే మహిళల మనుగడ సాఫీగా సాగుతుందని, మద్యం వల్ల మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరుగుతున్నాయని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం. విజయ, కె. అనంతలక్ష్మి చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కొండపిలోని సీపీఐ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. మహిళలపై పెరుగుతున్న దాడులను ప్రభుత్వాలు సమర్థంగా అరికట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సమాఖ్య జిల్లా గౌరవాధ్యక్షురాలు ఎస్. రావమ్మ, సీపీఐ కొండపి నియోజకవర్గ కార్యదర్శి వీరారెడ్డి, సీపీఐ జరుగుమల్లి, కొండపి మండలాల కార్యదర్శులు జి. బాలకోటయ్య, ఆర్. లక్ష్మి పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో...

ఐసీడీఎస్ కొండపి ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం గురువారం కొండపిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈసందర్భంగా బాలికలకు బ్యాడ్ టచ్, గుడ్ టచ్, ఉమెన్ ట్రాఫికింగ్ తదితర విషయాలపై సీడీపీవో మాధవీలత అవగాహన కలిగించారు. డాక్టర్ అనూష, సూపర్‌వైజర్ విక్టోరియారాణి పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 111 మంది ఎంపిక

కొండపి, మార్చి 7 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్చేంజ్, సీడాప్ ఆధ్వర్యంలో కొండపిలోని ప్రైవేటు కల్యాణ మండపంలో గురువారం జరిగిన మెగా జాబ్‌మేళా కార్యక్రమంలో 111 మంది వివిధ కంపెనీలలో ఉద్యోగాలకు ఎంపికయ్యారని నిర్వాహకులు తెలిపారు. మొత్తం 309 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని తెలిపారు.

ఇక్కడి పంటలను ఎండబెట్టి.. పొరుగు జిల్లాకు నీళ్లు!

- మోపాడు నుంచి నిబంధనలకు విరుద్ధంగా విడుదల
- ఇరిగేషన్ అధికారులపై రైతుల ఆగ్రహం
- ప్రభుత్వం మారేలోపు చేపలు పట్టేందుకు
- వైసీపీ నేతల కుట్రని ఆరోపణ

పామూరు, మార్చి 7 : ఇరిగేషన్ అధికారుల తీరుపై మోపాడు ఆయకట్టు రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ పంటలను ఎండబెట్టి నెల్లూరు జిల్లా రైతుల కోసం విడుదల చేయడాన్ని ఆక్షేపిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా, అది కూడా రాత్రి వేళ నీరు విడుదల చేయడంపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు వచ్చే లోపు రిజర్వాయర్‌లో ఉన్న చేపలను పట్టుకునేందుకు వైసీపీ నేతలు అధికారులపై ఒత్తిడి తెచ్చి నీటిని ఇలా బయటకు పంపిస్తున్నారని ఆరోపిస్తున్నారు. నిబంధనల మేరకు రిజర్వాయర్ నీటి మట్టం 20 అడుగుల మేర ఉన్నప్పుడే నెల్లూరు జిల్లా కొండాపురం ఆయకట్టు రైతులకు ఇవ్వాలి. అయితే ప్రస్తుతం 10 అడుగుల నీటిమట్టం ఉంది. కానీ అధికారులు కొండాపురం రైతుల కోసం అని విడుదల చేశారు. దీంతో రైతులు మండిపడుతున్నారు.

ఏప్రిల్ వరకూ ఇక్కడ పంటలకు తడి అవసరం

మోపాడు ఆయకట్టులో ఈ ఏడాది ఆరుతడి పంట వేయాలని అధికారులు సూచించినప్పటికీ కొందరు వైసీపీ నాయకులు వారికి అనుకూలంగా ఉన్న గ్రామాల్లో వరిని సాగు చేయించారు. జిల్లాలోని ఆయకట్టు పరిధిలో సుమారు 400 ఎకరాల్లో వరి సాగులో ఉంది. దీంతోపాటు తెల్లజొన్న 12వందల ఎకరాలు, నూగు 200 ఎకరాల్లో వేశారు. వరి పంటకు ఏప్రిల్ వరకు నీటి తడులు అవసరమని రైతులు చెప్తున్నారు. దీంతో తాము నీటిని పొదుపుగా వాడుకుంటున్న సమయంలో ఇష్టానుసారంగా ఇరిగేషన్ అధికారులు నెల్లూరు జిల్లా రైతులకు రాత్రివేళ విడుదల చేయడంపై నిరసన తెలుపుతున్నారు. ఇలాగైతే ఇక్కడ పంటలు నష్టపోతామని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.



మోపాడు మెయిన్ కాలువ ద్వారా పారుతున్న నీరు

చేపల కోసమే అంటున్న రైతులు

ఈ ఏడాది సొసైటీ ద్వారా చేపల పెంపకానికి లీజు తీసుకున్న స్థానిక వైసీపీ నాయకులు చేపలు పట్టుకునేందుకు ఇతర ప్రాంతాల వారికి అనుమతినిస్తూ కోట్ల రూపాయలకు విక్రయించారు. ప్రస్తుతం 10 అడుగలపైనే నీటి మట్టం ఉండడంతో చేపల వేట సాధ్యం కాదని భావించారు. ప్రభుత్వం మారేలోపు రిజర్వాయర్‌లో ఉన్న మత్స్య సంపదను కొల్లగొట్టేందుకే వైసీపీ నాయకులు ఒక పన్నాగం ప్రకారం నీటిని దిగువకు విడుదల చేయిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. వెంటనే ఆయకట్టు రైతులతో సమావేశం నిర్వహించి నీటి మట్టం ఎంత ఉన్నదీ, పంటలకు అవసరమైన నీటి విడుదలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

ఎస్ఈ ఆదేశాల మేరకు విడుదల

నెల్లూరు జిల్లా కొండాపురం ప్రాంతంలో 100 ఎకరాల్లో వరిని సాగుచేశారు. తక్షణమే పంటను కాపాడుకునేందుకు నీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ శాఖ ఎస్ఈ లక్ష్మీరెడ్డి నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో నీటిని విడుదల చేశాం.

\- రవి, ఇరిగేషన్ డీఈ

11న టంగుటూరులో చంద్రబాబు ప్రజాగళం సభ

టంగుటూరు, మార్చి 7 : టంగుటూరులో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ప్రజాగళం సభ జరగనుందని, అందుకు పార్టీ నుంచి కూడా అనుమతి వచ్చిందని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య చెప్పారు. ఈ నెల 11న మధ్యాహ్నం 3గంటలకు సభ ప్రారంభం అవుతుందన్నారు. అలాగే ఈ నెల 8న యువగళం లోకేష్ సభ కోసం టంగుటూరులో సభావేదికను సిద్ధం చేశామని, కొన్ని అనివార్య కారణాల వలన లోకేష్ సభ వాయిదా పడిందని చెప్పారు. ఇప్పుడు ఇదే వేదికను చంద్రబాబు సభకు సిద్ధం చేస్తున్నామన్నారు. వేదిక ఏర్పాట్లు గురువారం నుంచే ప్రారంభమయ్యాయి. రాత్రి పూట ఫ్లడ్ లైట్ల వెలుగుల్లోనూ వేదిక వద్ద పనులు కొనసాగుతున్నాయి.

సభా వేదిక స్థలాన్ని పరిశీలించిన సత్య

సభావేదిక స్థలాన్ని దామచర్ల సత్య నాయకులతో కలసి పరిశీలించారు. వేదిక నిర్మాణం కోసం జరుగుతున్న ఏర్పాట్లను చూశారు. సభావేదిక కొలతలు పరిశీలించారు.



నేతల చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న మహిళా నేతలు

బీసీ డిక్లరేషన్‌పై టీడీపీ సంబరాలు

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 7 : మంగళగిరిలో బుధవారం జరిగిన జయహో బీసీ సభలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సంయుక్తంగా ప్రకటించిన డిక్లరేషన్‌పై ఒంగోలులో ఇరు పార్టీల నాయకులు సంబరాలు చేసుకున్నారు. గుంటూరు రోడ్డులోని టీడీపీ కార్యాలయం వద్ద చంద్రబాబు, పవన్ కల్యాణ్, దామచర్ల జనార్దన్ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు.


మణికేశ్వరంలోని మల్లేశ్వరస్వామి దేవాలయం

చినకాశిగా ఖ్యాతికెక్కిన మణికేశ్వరం

అద్దంకి, మార్చి 7: మణికేశ్వరంలోని మల్లేశ్వరస్వామి దేవాలయం చినకాశీగా ఖ్యాతికెక్కింది. కాశీలో ఉన్నవిధంగానే మణికేశ్వరంలో కూడా దేవాలయ పరిసరాలు ఉండటంతో ఆ పేరు వచ్చినట్లు నానుడి. కాశీలో గంగా నది తూర్పు నుంచి పడమరకు ప్రవహించే విధంగానే మణికేశ్వరం దేవాలయం వద్ద గుండ్లకమ్మ నది కూడా తూర్పు నుంచి పడమరకు ప్రవహిస్తుంది. కాశీలో ఉన్న విధంగానే శ్మశానం కూడా దేవాలయం ముందే ఉంది. కాశీలో మాత్రమే కనిపించే బూరగ వృక్షాన్ని పోలిన చెట్టు ఇటీవలవరకు మణికేశ్వరం దేవాలయం ముందు కూడా ఉంది. లైలా తుఫాన్ సమయంలో ఎండిపోవటంతో తొలగించారు.

కాగా, శివరాత్రికి మణికేశ్వరంలోని మల్లేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు దేవాలయం చైర్మన్ ఈదా విజయలక్ష్మి శ్రీనివాసరెడ్డి, ఈవో కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరుగుతాయని తెలిపారు. రాత్రి 11 గంటలకు లింగోద్భవ కాలంలో మహన్యాసపూర్వక రుద్రాభిషేకం జరుగుతుందని తెలిపారు. అద్దంకి పట్టణంలోని పాతశివాలయం, వేయిస్తంభాల గుడి, కమలేశ్వరాలయంతోపాటు ఇతర పలు శివాలయాలలో కూడా ప్రత్యేక పూజాకార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లుచేశారు.

దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పంగులూరు, మార్చి 7: దాతలు అందించే సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగ పరచుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎస్.నాగమణి కోరారు. మండలంలోని బూదవాడ ఉన్నత పాఠశాల పదో తరగతి బాలబాలికలకు నర్రా వెంకటేశ్వరావు, లక్ష్మీసుధ దంపతులు సమకూర్చిన రైటింగ్ ప్యాడ్స్, పెన్నులు, పెన్సిల్స్‌తో పాటు స్కేల్స్‌ను సమకూర్చారు. ఈ పరికరాలను పర్చూరు రోటరీ క్లబ్ అధ్యక్ష,కార్యదర్శులు నాగబైరు శ్రీనివాసరావు, సదానందరెడ్డి పంపిణీ చేశారు. గురువారం జరిగిన ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు చిలుకూరి శ్రీనివాసరావు, సోమశేఖర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హరహర మహాదేవ..

- నేడు మహాశివరాత్రి
- ముస్తాబైన శైవాలయాలు

చినగంజాం, మార్చి 7: మహాశివరాత్రి పర్వదినానికి శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. మండలంలోని సంతరావూరు గ్రామంలోని పురాతన దేవాలయం అయిన శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శివరాత్రి పూజలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. కొత్తపాలెం గ్రామ పంచాయతీలో వేంచేసియున్న బాలకోటేశ్వర స్వామి ఆలయం, చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని సోపిరాల గ్రామంలో వేంచేసియున్న లలితాపరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి ఆలయాల వద్ద శుక్ర వారం మహాశివరాత్రి పర్వదినాన్ని కనులవిందుగా చేసేందుకు ఆలయాల నిర్వహణ కమిటీ సభ్యులు సర్వం సిద్ధం చేశారు. మహాశివ రాత్రి తిరునాళ్లను జిల్లాలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకంగా మండలంలోని సోపిరాల, కొత్తపాలెం గ్రామాల్లో ప్రతి సంవత్సరం నిర్వహిస్తారు. గుంటూరు జిల్లా కోటప్పకొండ తరువాత చినగంజాం మండలంలో నిర్వహించే తిరునాళ్లకు అంతంటి ప్రసిద్ధి పొం దింది.

కొత్తపాలెం గ్రామ పంచాయతీలోని శ్రీబాలకోటేశ్వర స్వామి స్వయంభు కాగా భక్తుల కోర్కెలను తీర్చే స్వామిగా ఈ ప్రాంతంలోని వారికి ప్రగాఢ విశ్వాసం ఉంది. వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన బాలకోటేశ్వరస్వామి ఆలయం వద్ద ఒక సామాజిక వర్గానికి చెందిన వారిచే అత్యంత వైభవంగా మహాశివ రాత్రి తిరునాళ్ళ జరుగుతుండేది. కాలక్రమంలో ఒక వర్గం సోపిరాల గ్రామంలో ఐదు దశాబ్దాల క్రితం రామకోటేశ్వరస్వామి


కొత్తపాలెంలోని బాలకోటేశ్వరస్వామి ఆలయం

ఆలయాన్ని ఏర్పాటుచేసి పోటాపోటీగా తిరునాళ్లను నిర్వహిస్తున్నారు. గ్రామంలో గుడి నిర్మించిన తరువాతనే గ్రామాభివృద్ధి చెందిందని గ్రామస్థుల నమ్మకం. శుక్రవారం తెల్లవారుజాము 3గంటల నుంచి ఆలయాల వద్ద స్వామి వారికి అభి షేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించడంతో ప్రారంభమయ్యే తిరునాళ్ల మరుసటి రోజు ఉదయం వరకు వివిధ రూపాలలో కార్యక్రమాలు కొనసాగుతూ ఉంటాయి.

బాలకోటేశ్వరస్వామి ఆలయం వద్ద ఆరు భారీ విద్యుత్ ప్రభలు, రామకోటేశ్వరస్వామి ఆలయం వద్ద నాలుగు భారీ విద్యుత్ ప్రభలను ఏర్పాటుచేసి జబర్దస్త్, శ్రీదేవి డ్రామా కంపెనీ, ఢీటీమ్ కళాకారులచే కార్యక్రమాలు, సినీ మ్యూజికల్ నైట్, మిమిక్రీ, పౌరాణిక నాటకాలతో పా టు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయాల కమిటి సభ్యులు తెలిపారు.

మార్టూరు: మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి మార్టూరులోని నేతాజీనగర్ సమీపంలోగల శ్రీఘట్టేశ్వర


సోపిరాలలోని రామకోటేశ్వరస్వామి ఆలయం

స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, విశిష్ట అభిషేకాలు నిర్వహించనున్నట్లు అర్చకులు నార్నెపాటి సాంబశివరావు తెలిపారు. రాత్రి జాగరణలో భాగంగా శ్రీసాయికృష్ణ కోలాట బృందం మహిళలు, మార్వాడికి చెందిన భక్తులు గానాలాపనతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే, గన్నవరం రోడ్డులో బొబ్బేపల్లి దండుదారి వద్ద మధ్యాహ్నం శ్రీమ ద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

తిరునాళ్లకు భారీ బందోబస్తు

చినగంజాం, మార్చి 7: మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని సోపిరాల రామకోటేశ్వరస్వామి ఆలయం, కొత్తపాలెం బాలకోటేశ్వరస్వామి ఆలయాల వద్ద శుక్రవారం నిర్వహించే తిరునాళ్లకు భారీ బందోబస్తు ఏర్పాటుచేసినట్లు ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్ ఆధ్వర్యంలో తిరునాళ్లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 200 మందితో భారీ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎన్నికల నియమావళి అమలుచేయాలి

చినగంజాం, మార్చి 7: ఎన్నికల ప్రవర్తనా నియమావళి నిష్పక్షపాతంగా అమలు చేయాల్సిన బాధ్యత ఎన్నికల అధికారులపై ఉందని తహసీల్దార్ ఫణీంద్రబాబు అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్‌లో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై గ్రామ కార్యద ర్శులు, వీఆర్వోలు, పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్, సెక్టార్ అధికారులు, స్టాటిస్టిక్స్ టీమ్ అధికారులకు గురువారం జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో వరప్రసాద్, ఈవోపీఆర్డీ ఎన్.వేణుగోపాలకృష్ణమూర్తి, పంచాయతీరాజ్, హౌసింగ్ ఏఈలు డి.దాసు, రాజశేఖర్, గ్రామ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

'స్వయం కృషితో ఆర్థిక స్వావలంబన'

పర్చూరు, మార్చి 7: మహిళలు స్వయంకృషితో ఆర్థిక స్వావలంబన సాధించాలన్న సంకల్పంతో రోటరీ అధ్వర్యంలో కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటుచేయటం అభినందనీయమని వైస్ ఎంపీపీ కోటా ప్రసన్న అన్నారు. గురువారం స్థానిక రోటరీ భవన్‌లో కుట్టుమిషన్ ద్వారా శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ మాట్లాడుతూ స్వయం సహాయక గ్రూపుల్లో ఉన్న మహిళలు బ్యాంకు రుణాలు పొందేందుకు సర్టిఫికెట్లు ఎంతగానో దోహద పడతాయన్నారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావు, పాబోలు ఉదయభాస్కర్, కోటా శ్రీనివాసరావు, పంబి సదానందరెడ్డి, గడ్డిపాటి శ్రీనివాసరావు, కోడూరి సుబ్రహ్మణ్యాచారి పాల్గొన్నారు.





చట్టాలపై మహిళలు అవగాహన కలిగిఉండాలి

పర్చూరు, మార్చి 7: మహిళల అభివృద్ధి, రక్షణ కోసం రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలపై అవగాహన కలిగిఉండాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.ప్రశాంతి అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం జరిగిన ముందస్తు మహిళా దినోత్సవం కార్యక్రమానికి సీడీపీవో సుభద్ర ఆధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న న్యాయాధికారి మాట్లాడుతూ మహిళలు ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. సీడీపీవో సుభద్ర మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దిశా యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉమెన్స్ హెల్ప్‌లైన్ 181 గురించి వివరించారు. అనంతరం స్థానిక కార్యాలయం నుండి అవగాహన ర్యాలీ నిర్వహించారు.

గ్రామాలలో చలివేంద్రాలు ఏర్పాటుచేయాలి

యద్దనపూడి(మార్టూరు), మార్చి 7: గ్రామాల్లో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఏర్పాటుచేయాలని ఎంపీడీవో శివసుబ్రమణ్యం కోరారు. గురువారం జరిగిన యద్దనపూడి మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ పులగం రజని అధ్యక్షత వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు ఏర్పడితే ప్రత్యా మ్నాయ ఏర్పాట్లు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. పూనూరు ఎస్సీ కాలనీలో ప్రాథమిక పాఠశాల వద్ద చేతి పంపు ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ వంకాయల పాటిసునీత కోరారు. తనుబొద్దివారిపాలెం, చిమటావారి పాలెం రోడ్డులో చిల్లచెట్లు విపరీతంగా పెరిగిపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, వెంటనే వాటిని తొలగించాలని సర్పంచ్‌లు గనిపిశెట్టి వెంకాయమ్మ, చల్లా అన్నపూర్ణమ్మ కోరారు. సమావేశంలో తహసీల్దార్ నాగరాజు, ఏపీఎం రమేష్, ఈవోఆర్డీ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



బీసీల అభివృద్ధే టీడీపీ లక్ష్యం


మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండయ్య

చీరాల, మార్చి 7: జయహో బీసీ మహాసభ సందర్భంగా టీడీపీ, జనసేనలు ఉమ్మడిగా ప్రకటించిన బీసీ డిక్లరేషన్ చరిత్రాత్మకమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య అన్నారు. బీసీ డిక్లరేషన్ నేపథ్యంలో గురువారం స్థానిక గడియార స్తంభం సెంటర్లో మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. ఈసందర్భంగా కొండయ్య మాట్లాడుతూ తెలుగుదేశం అంటే బీసీ అని, బీసీ అంటే తెలుగుదేశమనే నానుడికి అనుగుణంగా బీసీల శ్రేయస్సు కోసం బీసీ డిక్లరేషన్‌లో పొందుపరిచిన అంశాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన టీడీపీతోనే సాధ్యం

సంతమాగులూరు, మార్చి 7: సంక్షేమ పాలన టీడీపీతోనే సాధ్యమని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సంతమాగులూరు మండలం పాతమాగులూరుకు చెందిన మాజీ ఉప సర్పంచ్ డేగల శ్రావణి, జిర్రా బక్కయ్య చల్లా సుబ్బారావు, యన్నం అచ్చయ్య, తదితరులు ఎమ్మెల్యేను చిలకలూరిపేటలోని ఆయన నివాశంలో కలిశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు కోసం మన బిడ్డల భవిష్యత్తు కోసం తెలుగుదేశం పార్టీకి అండగా ఉండాలని అన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని చెప్పారు. గత నాలుగున్నరేళ్లుగా రాష్ట్రంలో అరాచక పరిపాలనను ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. గడిచిన నాలుగున్నరేళ్లలో రాష్ట్రంలో ఏ ఒక్క సాగునీటి ప్రాజెక్టును పూర్తిచేయలేదన్నారు.

రోడ్డు ప్రమాదంలో బైకిస్టుకు గాయాలు

మేదరమెట్ల, మార్చి 7: మేదరమెట్లలోని ప్రయివేటు పాఠశాల వద్ద బస్సు ఢీకొని మోటారుసైకిలిస్టుకు తీవ్ర గాయాలయ్యాయి. గురువారం సాయంత్రం బొద్దువానిపాలెం గ్రామానికి చెందిన ప్రేమ్‌కుమార్ మోటారుసైకిల్‌పై వెళ్తుండగా ప్రయివేటు పాఠశాలకు చెందిన బస్సు ఢీకొనడంతో కుడికాలుకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో ఒంగోలుకు తరలించారు.

నియోజకవర్గ అభివృద్ధిలో ముందుంటాం..


మాట్లాడుతున్న కరణం వెంకటేష్

చీరాల, మార్చి 7: నియోజకవర్గంలో అభివృద్ధిలో ముందుంటాం.. అందరికి అండగా ఉంటామని ఎమ్మెల్యే కరణం బలరామకష్ణమూర్తి, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెంకటేష్ అన్నారు. స్థానిక ఎల్‌బీఎస్ నగర్ షాదీఖానాలో గురువారం ముస్లింల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంలో ముందున్నామన్నారు. ఎమ్మెల్యే బలరాం, వెంకటేష్‌ను ముస్లిం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్‌ఛైర్మన్ బొనిగల జైసన్‌బాబు, షేక్ సలీమ్, షేక్ మొహిద్దీన్, షేక్ హుమాయూన్ కబీర్, షేక్ అల్లాబక్షి, అబ్దుల్ రహీమ్, వలీ, షేక్ నాగూర్‌భాషా, షేక్ సుభాని, జిలాని, జాకాబ్, యామిన్, సయ్యద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక మసీదు సెంటర్లో నిర్మాణంలో ఉన్న డ్రెయిన్, రోడ్డు నిర్మాణ పనులను వెంకటేష్ పరిశీలించారు. త్వరితగతిన పూర్తిచేయాలని నిర్మాణదారులకు చెప్పారు. దేవాంగపురి పంచాయతీ పరిధిలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం-2 భవనాన్ని, రూ.22 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయం-2 భవనాన్ని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వెంకటేష్ ప్రారంభించారు. దీంతోపాటు గ్రామంలో రూ.7.41 లక్షల వ్యయంతో పూర్తిచేసిన అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎప్పుడు ఏ అవసరం వచ్చినా అండగా ఉంటామన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలి


కేకు కట్ చేస్తున్న తహసీల్దార్ సుశీల, మహిళా అధికారులు

మేదరమెట్ల, మార్చి 7: మహిళలు పురుషులతో సమానంగా అన్నిరంగాల్లో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని తహసీల్దార్ బి.సుశీల అన్నారు. గురువారం అంతర్జాతీయ మహిళా సందర్భంగా కొరిశపాడు మండల పరిషత్ కార్యాలయం వద్ద కేకు కట్ చేసి వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా సుశీల మాట్లాడుతూ దేశాభివృద్ధిలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రస్తుత సమాజంలో చాలా వరకు మహిళలు ఉద్యోగాల్లో రాణిస్తున్నా.. ఇంకా కొంత వివక్ష కొనసాగు తూనే ఉందన్నారు. పార్లమెంట్‌లో పెట్టిన మహిళా బిల్లు అమలులోకి వస్తే మహిళలు మరింత ముందడుగు వేసే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సీడీపీవో కస్తూరి, ఏపీఎం అనూరాధ, పంచాయతీ కార్యదర్శి దుర్గాభవాని, ఏపీఎం కోటేశ్వరి, పలువురు మహిళా అధికారుణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌తో పాటు పలువురు మహిళా అధికారులను సత్కరించారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



సెయింట్‌ఆన్స్ కళాశాలలో కేక్ కట్‌చేస్తున్న కళాశాల ఫౌండర్ వనమా వెంకటేశ్వరరావు

చీరాల, మార్చి 7 : సెయింట్‌ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ విభాగం ఆధ్వర్యంలో నిరహి ంచిన కార్యక్రమంలో కళాశాల ఫౌండర్ వనమా వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా హజరై కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా శక్తిని ప్రతిఒక్కరూ గుర్తించి గౌరవించాలన్నారు.

కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, డాక్టర్ శ్రీదేవి, ప్రిన్సిపాల్ డాక్టర్ మొయిద వేణుగోపాలరావు, డాక్టర్ ఆర్.ధనలక్ష్మి, డాక్టర్ లక్ష్మీతులసి చావలి, డాక్టర్ బబితజైన్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ నాగేశ్వరరావు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చినగంజాంలో.. చినగంజాం, మార్చి 7: స్థానిక భూసమేత భావనారాయణస్వామి దేవస్థానంలో వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో, మున్నం వారిపాలెం ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వనితా క్లబ్ సభ్యులు చినగంజాం వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి మందిరంలోని అమ్మవారికి వనితా క్లబ్ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదనంతరం మహిళలకు పలు రకాల పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు మహిళా కానిస్టేబుల్స్ కవిత, సుబ్బరామ్మను క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వనితా క్లబ్ జోన్ ఛైర్మన్ పొట్టి శైలజ, అధ్యక్షురాలు కె.సుచిత్ర, కార్యదర్శి బి.జ్యోతి, కోశాధికారి ఎం.శేషకుమారి, సభ్యులు నూనె రమాదేవి, అమరా కేదారి, కందేపి సుభాషిణి, బొమ్మిశెట్టి రాజ్యలక్ష్మి, అమరా నాగలక్ష్మి, వలివేటి లక్ష్మీలు పాల్గొన్నారు.

మున్నంవారిపాలెం ప్రాథమిక పాఠశాలలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయురాలు పి.హిమవంతేశ్వరి, మధ్యాహ్న భోజన నిర్వాహకులు సుబ్బారావమ్మ, రాజమ్మను పాఠశాల హెచ్‌ఎం మల్లారెడ్డి, ఉపాధ్యాయులు ఎస్.నాగమల్లేశ్వరావు, ఎస్.చంద్రశేఖర్, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీఆర్పీ సీహెచ్ సురేంద్రకుమార్ పాల్గొన్నారు.

అద్దంకిలో.. అద్దంకి, మార్చి 7: శింగరకొండ వద్ద ఉన్న కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా అధ్యాపకురాళ్లను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌రావు, డాక్టర్ హేమలత, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 120 మంది విద్యార్థినులకు పరిమళ ఫౌండేషన్ తరపున పరీక్షా ప్యాడ్‌లు అందజేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయురాళ్ళు సుంకర శ్రీదేవి, గొట్టిపాటి శ్రీదేవిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీవీ కృష్ణారెడ్డి, హెచ్‌ఎం కటకం శ్రీనివాసరావు, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ సుధాకరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగిఉండాలి

చీరాలటౌన్, మార్చి 7: యువతీ యువకులు చట్టాలపై అవగాహన కలిగిఉండాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.సుధ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి షేక్ రెహనా పేర్కొన్నారు. గురువారం స్థానిక వైపే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో వారు మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నీలాకుమారి, న్యాయవాదులు వినీల, ఈశ్వరిరెడ్డి, పీఎల్వీ మతీన్, కళాశాల కోఆర్డినేటర్ ఫౌజియా, ఏఎస్సై వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేత

పూసపాడు(ఇంకొల్లు), మార్చి 7: మండలంలోని పూసపాడు ఎస్‌కేపీవీఎస్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 25 మంది విద్యార్థులకు గురువారం పర్చూరు రోటరీక్లబ్ పరీక్షా సామగ్రి అందజేసింది. రోటరీ అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావు, కార్యదర్శి సదానందరెడ్డి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు రాసేందుకు అవసరమైన పరీక్షా సామగ్రి అందజేసి పదో తరగతిలో మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపా ధ్యాయులు కె.శ్రీనివాసరావు, ప్రభాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఏకాగ్రతపై దృష్టి సారించాలి

చీరాలటౌన్, మార్చి 7: పదో తరగతి విద్యార్థులు ఏకాగ్రతతో చదువులపై దృష్టిసారించాలని ఎంఈవో సుబ్రహణ్యేశ్వరరావు అన్నారు. యలమంచిలి గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్, వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాల ఆధ్వర్యంలో గత కొద్దిరోజులుగా చీరాల, వేటపాలెం మండల పరిధిలోని 13 ఉన్నత పాఠశాలలకు సంబంధించిన 1200 మంది పదో తరగతి విద్యార్థులకు ప్రతిరోజు అల్పాహారం అందిస్తున్నారు. ఈక్రమంలో గురువారం స్థానిక ఎన్‌అండ్‌పీఎం ఉన్నత పాఠశాలలో అల్పాహారం అందించారు.

ఈసందర్భంగా హాజరయిన ఎంఈవో సుబ్ర హ్మణ్యేశ్వరరావు విద్యార్థులకు స్వయంగా వడ్డించారు. ప్రతిఒక్కరూ సమయాన్ని సక్రమంగా వినియోగించుకుని లక్ష్యాలను అందుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి 5
శ్రీపొట్టిశ్రీరాములు
నెల్లూరు
శుక్రవారం 8 మార్చి 2024



ఓం నమఃశివాయ!

- నేడు శివరాత్రి పర్వదినం
- ముస్తాబైన శైవక్షేత్రాలు



నెల్లూరు : విద్యుద్దీప వెలుగుల్లో శోభిల్లుతున్న మూలస్థానేశ్వర ఆలయం

రావణుడిపై విహరిస్తూ భక్తులను కటాక్షిస్తున్న ఆదిదంపతులు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 7 : శివరాత్రి పర్వదిన వేడుకలకు జిల్లా ముస్తాబయ్యింది. సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన శైవక్షేత్రాల్లో శుక్రవారం ఉదయం నుంచే ప్రత్యేక పూజలు జరగనున్నాయి. భోళా శంకరుడైన శివుడి కృప పొందాలని ప్రతి ఒక్కరూ ముక్కంటిని ఆరాధిస్తారు. అలాగే ఆదిదంపతుల కల్యాణం కూడా జరగనుంది. మహాశివరాత్రి ఘడియలు శుక్రవారం రాత్రి 9.57 గంటలకు ప్రారంభమై శనివారం మధ్యాహ్నం 12.55 గంటలకు వరకు ఉంటాయి. శివరాత్రి రోజున భక్తులు జాగరణ చేసి అభిషేకం, రుద్రాభిషేకం, శివనామస్మరణలు చేస్తారు. నెల్లూరులోని మూలస్థానేశ్వర స్వామి ఆలయం, రామతీర్థం, గండవరం ఉదయకాళేశ్వర స్వామి, కాటేపల్లి శ్రీకామాక్షి సమేత చంద్రశేఖర స్వామి, షైపాడు, కోడూరు, కృష్ణపట్నం సిద్దేశ్వర వేణుగోపాల స్వామి, కావలి, ఆత్మకూరు, ఉదయగిరి, భైరవకోన, జొన్నవాడ కామాక్షితాయి ఆలయం ఇలా అన్ని శైవక్షేత్రాలలో శివరాత్రి వేడుకలకు భారీ ఏర్పాట్లు చేశారు. కాగా, గురువారం రాత్రి నెల్లూరులోని మూలస్థానేశ్వర ఆలయంలో ఆదిదంపతులు రావణుడిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు.



బ్రహ్మోత్సవాల గోడపత్రికలు ఆవిష్కరించిన చైర్మన్ శ్రీనివాసులు, ఆర్డీవో మాలోల, తదితరులు

20 నుంచి రంగడి బ్రహ్మోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 7: నెల్లూరులోని తల్పగిరి రంగనాథుడి బ్రహ్మోత్సవాలు ఈనెల 20 నుంచి 31 వరకు నిర్వహించనున్నట్లు ఆర్డీవో మాలోల తెలిపారు. గురువారం సాయంత్రం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. మహిళలకు భద్రత, ట్రాఫిక్ నియంత్రణతోపాటు బ్రహ్మోత్సవాల్లో శాంతిభద్రతలను పర్యవేక్షించాలని పోలీసులకు సూచించారు. ఆలయం లోపల, బయట భక్తులకు చలివేంద్రాలు, వీధిదీపాల తదితర ఏర్పాట్లను నగర పాలక సంస్థ నిర్వహించాలని కోరారు. అనంతరం గోడపత్రికలు, కరపత్రాలు ఆవిష్కరించారు. ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే వారికి సేవలు అందించేందుకు భక్తులతో రంగనాథ సేవ కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. ఆలయ సహాయక కమిషనర్, ఈవో డబ్బుగుంట వెంకటేశ్వర్లు, మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో స్వామివారికి జరిగే సేవలను, సాంస్కృతిక కార్యక్రమాల వివరాలను తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

నెల క్రితం పెళ్లి.. అంతలోనే విషాదం!

- చెముడుగుంట వద్ద బైక్‌ను ఢీకొన్న ఆటో
- నవదంపతులపైకి దూసుకెళ్లిన బస్సు
- అక్కడికక్కడే ఇద్దరూ మృత్యువాత
- గుండెలవిసేలా విలపించిన కుటుంబసభ్యులు

సరిగ్గా నెల రోజుల క్రితం వారిద్దరికీ వివాహమైంది. ఎంతో అన్యోన్యంగా ఉంటున్న ఆ నవదంపతులను చూసి కన్నవారు మురిసిపోయారు. నిండు నూరేళ్లు కలిసి జీవించాలనుకున్న ఆ యువజంటను చూసి మృత్యువుకు కన్నుకుట్టినట్టుంది. పరీక్ష రాసేందుకు బయలుదేరిన దంపతులను ఆటో రూపంలో వచ్చి కబళించేసింది. వెంకటాచలం మండలం చెముడుగుంట వద్ద జాతీయ రహదారిపై ఓ ఆటో బైక్‌ను ఢీకొనడంతో రోడ్డుపై పడ్డ దంపతులపైకి ఆర్టీసీ బస్సు దూసుకెళ్లింది. దీంతో శరీర భాగాలు ఛిద్రమై దంపతులిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. సరిగ్గా నెల రోజుల క్రితం వివాహం చేసుకున్న పిల్లలు రోడ్డుపై విగతజీవులాగా పడి ఉండటాన్ని చూసి కుటుంబ సభ్యులు గుండెలవిసేలా విలపించారు.



ప్రశాంత్,పుష్పల పెళ్లినాటి ఫొటో (ఫైల్)

వెంకటాచలం, మార్చి 7 : నెల్లూరులోని రామ కోటయ్య నగర్ ప్రాంతానికి చెందిన మన్నెం బాబు కుమార్తె పుష్ప (25) రావూస్ కళాశాలలో ఎంబీఏ చదువుతోంది. గత నెల 8వ తేదీన నవాబుపేట సమీపంలోని కామాటి దళిత వాడకు చెందిన ప్రశాంత్ (28)తో ఆమెకు వివాహమైంది. చెన్నైలో ఉద్యోగం చేస్తున్న ప్రశాంత్ వివాహం తర్వాత ఇంటి వద్దనే ఉంటు న్నాడు. కాగా, వెంకటాచలం మండలం కాకుటూరు వద్ద కృష్ణచైతన్య పీజీ కళాశాలలో గురువారం మధ్యాహ్నం ఎంబీఏ పరీక్షను పుష్ప రాయాల్సి ఉంది. దీంతో ప్రశాంత్ తన భార్యను బైక్‌పై ఎక్కించుకుని పరీక్ష కేంద్రానికి బయలుదేరాడు. చెముడుగుంట సమీపానికి వచ్చేసరికి వెనుక నుంచి వచ్చిన ఆటో బైక్‌ను ఢీకొంది. దీంతో దంపతులిద్దరూ జాతీయ రహదారిపై పడిపోయారు. అదే సమయంలో వాకాడు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు దంపతులపైకి దూసుకెళ్లింది. దీంతో ప్రశాంత్, పుష్పలిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను పరిశీలించారు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో హాల్ టికెట్‌తోపాటు పుస్తకాలు పడిపోవడం, ఇద్దరిపై బస్సు దూసుకెళ్లడంతో శరీర అవయవాలు ఛిద్రం కావడంతో ఆ ప్రాంతమంతా హృదయ విదారకంగా మారింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. వివాహం జరిగి నెల రోజులు కాక ముందే విగతజీవులుగా మారారంటూ కన్నీరుమున్నీరయ్యారు. కాగా, ఈ ఘటనతో హైవేపై ట్రాఫిక్ కొంతసేపు స్తంభించింది. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలు.. మహారాణులు

- అన్నింటిలో సమానం.. దేన్నైనా సాధిస్తాం!
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

అవనిలో సగం.. ఆకాశంలో సగం.. అన్నింటా సగం అయిన మహిళలు తమ హక్కులను కాపాడుకునేందుకు 'పోరాడితే పోయేది లేదు బానిస సంకెళ్లు తప్ప' అనే పిలుపు మహిళల్లో చైతన్య స్ఫూర్తిని రగిలించింది. పురుషాధిక్యత నుంచి స్త్రీలకు స్వేచ్ఛ, ఆర్థిక, రాజకీయ సమానత్వానికి చట్టాలు తీసుకొచ్చినా ఇంకా పోరాటాలు చేయక తప్పడం లేదు. ఈనాటికీ ఎన్ని చట్టాలు వచ్చినా ఆడపడచులపై అఘాయిత్యాలకు అడ్డుకట్ట పడటం లేదు. అయితే సామాజిక మాధ్యమాలు ఊపందుకున్న నేపథ్యంలో వీటితో కొంత వరకు విజయాలు సాధిస్తూ తమ ప్రతిభను చాటు కునేందుకు నారీ మణులు చేస్తున్న కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వారు ఎదుర్కొం టున్న పరిస్థితుల నుంచి పోరాట స్ఫూర్తితో పుట్టిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..



ప్రణాళిక, పట్టుదల అవసరం



మహిళలు తలుచుకుంటే సాధించలేనిది ఏదీలేదు. మహిళలు వంటింటికే పరిమితం కావాలన్న భావజాలం కూడా చాలావరకు తగ్గిపోయి పురుషులు కూడా మహిళలను ప్రోత్సహిస్తున్నారు. ఇప్పుడు కావాల్సిందల్లా మహిళలకు సరైన ప్రణాళిక, అనుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు పట్టుదల మాత్రమే. మహిళలు తలుచుకుంటే ఏ రంగంలోనైనా మేటిగా రాణించ గలరని ఎందరో మహిళలు నిరూపించి మనందరిలో స్ఫూర్తిని నింపారు. కందుకూరు మున్సిపల్ చైర్‌పర్సన్ గా స్వతంత్ర నిర్ణయాలతో పరిపాలన చేసి చూపించిన నేను ఆ తర్వాత పట్టుదలతో ఏపీపీ ఎస్సీ పరీ క్షలకు సిద్ధమై నేడు ఎక్సైజ్ సీఐగా విధులు నిర్వహిస్తున్నా. అయితే మహిళలు ఆత్మన్యూనతను విడనా డటంతోపాటు తాను అధికురాలిని అన్నభావన కూడా రానీయ కుండా కర్తవ్య నిర్వహణలో ఓ కుమార్తె గా, భార్యగా, తల్లిగా, కోడలిగా బాధ్యతగా వ్యవహరిస్తే జీవితంలో అన్నివిధాలుగా విజేతలుగా నిలుస్తారు.

- ఎం. శివకుమారి, ఎక్సైజ్ సీఐ, కందుకూరు



కందుకూరు : ఏరియా ఆసుపత్రిలో కేక్ కట్‌చేస్తున్న డాక్టర్లు, సిబ్బంది

నెల్లూరు (విద్య), మార్చి 7 : తమ బాధలు, సమస్యలను చర్చించుకోవడానికి, నలుగురితో పంచుకోవడానికి ఒక రోజు ఉండాలని నిర్ణయించారు మహిళలు. ఆ రోజును మహిళా దినోత్సవంగా ప్రకటించారు. తొలిసారి అమెరికాలోని చికాగోలో మహిళా దినోత్సవానికి 1908లోనే బీజాలు పడ్డాయి. వారి డిమాండ్లతో అమెరికాలోని సోషలిస్టు పార్టీ 1909, మార్చి 8న జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రకటించింది. అయితే, ఈ దినోత్సవాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించాలని కోపెన్‌హెగన్ నగరంలో 1910లో జరిగిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ వర్కింగ్ ఉమెన్ సదస్సుల్లో ఆమోదించారు. అలా మహిళలకు ఓటుహక్కు, సమానహక్కు సాధించడానికి ఇలాంటి సమావేశాలు నాందిపలికాయి. 1975లో ఐక్యరాజ్య సమితి మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా ప్రకటించిన నాటి నుంచి అన్ని దేశాల్లో వేడుకలు నిర్వహిస్తున్నారు

● ఇంటర్నెట్ వినియోగం

ప్రపంచమే కుగ్రామంగా మారుతున్న తరుణంలో తరుణీమణి అంతర్జాల సేవల్లో ముందుకెళుతోంది. అందు బాటులో ఉన్న సాంకేతికతను అన్ని రకాలుగా ఉపయోగించుకునేందుకు మహిళలు ఆరాటపడుతున్నారు. ఇంటర్నెట్ గొడుకు కింద సంఘటిత శక్తిగా ఎదుగుతున్నారు. సమస్యలకు పరిష్కారాలు అన్వేషించడంతో పాటు గంటల వ్యవధిలో కీలక సమచారాన్ని సేకరిస్తున్నారు. విద్య, విధినిర్వహణలో ఎందరో కంప్యూటర్ కీబోర్డుపై తమ జోరును చూపిస్తున్నారు. జిల్లాలో డిగ్రీ, ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ ఇతర ఉన్నత విద్యార్హతలున్న యువతుల ఉపాధి అవకాశాల కోసం తరచూ వెబ్‌సైట్‌లో పరిశీలిస్తూ ఉద్యోగాలను ఎంపిక చేసుకుంటున్నారు. జిల్లాలోని ప్రభుత్వశాఖల పరిధిలో కీలక సమాచా రాన్ని ఉన్నతాధికారులకు చేరవేయడం, మెయిల్స్ పంపించడం, వెబ్‌సైట్‌లో శాఖాపరంగా ప్రగతిని పొందుపరచడం వంటి పనులు చేస్తున్న వారిలో మహిళలే కీలకంగా వ్యవహరిస్తున్నారు. అలాగే పలు బ్యాంకుల్లో సైతం కీలకమైన సమాచార ప్రతినిధులుగా మహిళా ఉద్యోగులే పని చేస్తున్నారు. ఉపాధిహామీ పనుల వివరాలు, నీటిపారుదల శాఖ, ఇంజనీరింగ్, రవాణా, విద్యాశాఖ విభా గాల్లో మహిళా ఉద్యోగులు ఆన్‌లైన్‌నే సమాచార వారధికి సాధనంగా మార్చుకుంటున్నారు. ప్రైవేటు ఆసుపత్రులు, ఇతరత్రా సంస్థలు, పరిశ్ర మల్లోనూ మహిళా ఉద్యోగులే కార్యాలయ కార్యకలాపాలను, రోజువారీ ప్రగతిని పొందుపరుస్తున్నారు.

● సాధికారత ప్రశ్నార్థకమే..

ఎన్ని పోరాటాలు, త్యాగాలు చేసినా, టెక్నాలజీ ఎంత పెరిగినా ఇంకా మహిళా సాధికారత ప్రశ్నార్థకంగానే ఉండడం దురదృష్టకరం. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఉన్నత శిఖరాల్లో నిలిచిన మహిళలకు ఇంకా లింగ వివక్ష, హింస, దురాగతాలు తప్పడం లేదు. మహిళా దినోత్సవం జరుపుకోవడం ప్రారంభమై వంద ఏళ్ల దాటినా ఇంకా మహిళలు పోరాడి సాధించుకున్న హక్కులు కూడా దక్కకపోవడం విచారకరమనే చెప్పాలి.

కుటుంబ ప్రోత్సాహం అవసరం



మహిళలు మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి, భార్యను, తల్లిని సంతోషంగా ఉంచటం నేటి కాలంలో పురుషుల బాధ్యత అన్న విషయం మరిచిపోకూడదు. కోవిడ్ తర్వాత స్ట్రోక్, డిప్రెషన్ వంటి కేసులు చూస్తున్నాను. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఉంటే మహిళలు ఏ రంగాల్లో అయినా రాణిస్తారు. కుటుంబం కోసం మహిళలు కొవ్వొత్తులా వెలిగి పోతుంటారు. మహిళలు వైద్య రంగంలో ఎన్నో విజయాలు సాధిస్తున్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్లాలి.

- డాక్టర్ లావణ్య, న్యూరాలజిస్ట్, జీజీహెచ్, నెల్లూరు

అన్ని రంగాలలో రాణించాలి



ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళలు నేడు అన్ని రంగాలలో రాణిస్తున్నారు. మహిళలకు సేవా దృక్పథం ఎక్కువ. అందుకే తన ఇంటిని చక్కదిద్దుకుంటూ తను ఏ వృత్తిలో అయితే ఉందో అ వృత్తిలో కూడా తనకంటూ ఓ ప్రత్యేకతను చాటుకుంటోంది. మహిళలకు చట్టపరంగా కూడా పూర్తి రక్షణ కలిగిస్తూ ప్రభుత్వాలు శాసనాలు చేస్తున్నాయి. అందువల్లే నేటి సమాజంలో మహిళ తిరుగులేని శక్తిగా తలెత్తకుని ఎదుగుతూ ఉంది. అ దిశగా మహిళలు ముందుకు సాగాలి.

- రేవూరు శశికళ, సీనియర్ న్యాయవాది, నెల్లూరు

అబల కాకూడదు!



కుటుంబాన్ని తన భుజస్కందాలపై నిత్యం మోసే మహిళలు నేడు సమాజంలో ఎదుగుతున్నారు. అటువంటి మహిళలను ప్రోత్సహించి మరింత ముందుకు తీసుకెళ్తే ప్రపంచస్థాయిలో విజయాలు అందుకునే అవకాశం ఉంది. ప్రతి ఒక్కరి విజయం వెనక ఓ మహిళ ఖచ్చితంగా ఉంటుందని చరిత్ర చెబుతోంది. అటువంటి మహిళ అబల కాకూడదు. ప్రపంచస్థాయిలో కీర్తి ప్రతిష్టల్ని నిలపగలిగే సత్తా, అన్నిరంగాల్లో రాణించే బలం మహిళకు ఉంది. మహిళకు నేటికీ అపశ్రుతులు ఎదురవుతూనే ఉన్నాయి. వాటిని ఎదుర్కొని సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని సొంతం చేసుకున్న నాడే సంపూర్ణ మహిళగా సమాన హక్కులను సాధించినట్టు.

- బి.ప్రసన్న లక్ష్మి, సబ్ రిజిస్ట్రారు, అల్లూరు

సిగ్నల్ ఉంటేనే రైట్!

నెల్లూరు నగరం.. ఈ పేరు వినగానే టక్కున గుర్తుకు వచ్చేది ట్రాఫిక్ ఇబ్బందులు. విచ్చలవిడిగా రాకపోకలు.. అడ్డదిడ్డమైన పార్కింగ్‌లతో వాహనదారులతోపాటు నగర వాసులూ ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్య నుంచి ప్రజలను గట్టెక్కించేందుకు నగర పాలక సంస్థ త్వరలో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురానుంది. ఇందుకోసం రూ.1.4 కోట్లు ఖర్చు చేస్తున్న అధికారులు తొలి విడతగా నగరంలోని 7 ప్రాంతాల్లో సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేయనుంది.

- నెల్లూరు నగరంలో సిగ్నల్ వ్యవస్థ
- తొలివిడతగా 7 ప్రాంతాల్లో ఏర్పాటు
- రూ. 1.4 కోట్లతో టెండర్ల ప్రక్రియ పూర్తి
- హైదరాబాదుకు చెందిన కంపెనీకి బాధ్యతలు
- నగర వాసులకు తీరనున్న ట్రాఫిక్ కష్టాలు

నెల్లూరు (సిటీ), మార్చి 7 : 149.02 చ.కి.మీ మేర విస్తరించిన నెల్లూరు నగరంలో సుమారు 8 లక్షల మంది జనాభా ఉంది. వీరిలో నిత్యం 30 శాతం మంది రోడ్లపై ప్రయాణిస్తుంటారు. దీంతో నగర రహదారులన్నీ రద్దీతో నిండిపోతున్నాయి. ఉదయం, సాయంత్రం సమయాల్లో ట్రాఫిక్ సమస్య మరింత ఇబ్బందికరంగా మారింది. గడిచిన కొన్నేళ్లుగా ట్రాఫిక్ నియంత్రణకు అధికారులు తీసుకున్న, తీసుకుంటున్న చర్యలు శూన్యం. కార్పొరేషన్‌కు కమిషనర్‌గా వికాస్‌మర్మత్ బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు మార్పులు తీసుకుని వస్తున్నారు. ఈ నేపథ్యంలో సిగ్నల్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. తొలిగా కేవీఆర్ జంక్షన్, హరనాథపురం కూడలి, కనకమహల్ సెంటర్, వీఆర్సీ కూడలి, మద్రాస్ బస్టాండ్ సెంటరు, జిల్లా పోలీసు ఆఫీస్ జంక్షన్, రామలింగాపురం కూడలి వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. మిగిలిన ప్రాంతాలలో రెండోదఫా సిగ్నల్స్ అందుబాటులోకి తీసుకురానున్నారు.



● రూ.1.40 కోట్ల ఖర్చుతో..

నెల్లూరులో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుకు కార్పొరేషన్ రూ.1.40 కోట్లు కేటాయించింది. ఒక్కోచోట రూ.20 లక్షలతో సిగ్నలింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురానున్నారు. టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి చేసిన అధికారులు హైదరాబాద్‌కు చెందిన ఎస్‌పీటీ నెట్‌వర్క్ టెక్నాలజీ సంస్థకు ఈ బాధ్యతలు అప్పగించారు. ఈ నెలాఖరులోపు ప్రక్రియ పూర్తవుతుందని కార్పొరేషన్‌లోని ఓ ఉన్నతాధికారి వెల్లడించారు. ఈ వ్యవస్థ అందుబాటులోకి వస్తే నెల్లూరులో ట్రాఫిక్ కష్టాల నుంచి కొంతమేర గట్టెక్కినట్టే.



ర్యాలీలో పాల్గొన్న సర్పంచులు

జగన్‌ను ఓడిస్తేనే గ్రామీణాభివృద్ధి

- పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్

నెల్లూరు, (జడ్పీ): రాష్ట్రంలో నిర్వీర్యమైన స్థానిక సంస్థలను కాపాడుకోవాలన్నా, గ్రామీణాభివృద్ధి జరగాలన్న సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్మోహన్‌రెడ్డిని ఓడించాలని పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. తమ డిమాండ్ల సాధన కోసం ఆంధ్రప్రదేశ్ పంచాయతీ సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో గురువారం నెల్లూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పంచాయతీలకు కేంద్రం విడుదల చేసిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులను సీఎం జగన్ దొంగలించి గ్రామాలాభివృద్ధికి తీవ్ర అన్యాయం చేశారని మండిపడ్డారు. మహాత్మా గాంధీ కన్న కలలు సాకారం కావాలంటే వచ్చే ఎన్నిక ల్లో వైసీపీని చిత్తుగా ఓడించి జగన్‌ను తరిమి కొట్టాలని పిలుపుని చ్చారు కార్యక్ర మంలో ఏపీ పంచాయతీ రాజ్ చాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మునిరెడ్డి సుబ్బరామయ్య, నాయకులు ధనుంజయ యాదవ్ నాగేంద్రరెడ్డి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈ రాతిరి.. శివరాతిరి !

- మహాశివరాత్రికి సిద్ధమైన శైవక్షేత్రాలు
- నేటి నుంచి ఉత్సవాల ప్రారంభం
- భద్రతా చర్యల్లో పోలీసు యంత్రాంగం


ముస్తాబైన తిరునాళ్లతిప్ప దుర్గామల్లేశ్వరస్వామి ఆలయం


అలంకరణలో శివుడు

ఆత్మకూరు, మార్చి 7: శివరాత్రి వేడుకలకు పట్టణంలోని శివాలయం, తిరునాళ్లతిప్పలో వెలసిన కాశీనాయన ఆశ్రమం, బైపాస్ రోడ్డులోని వీరబ్రహ్మేంద్రస్వామి, శ్రీనివాసేశ్వరస్వామి ఆల యాలు ముస్తాబయ్యాయి. ఆత్మకూరులోని శివాలయంలో శుక్రవారం ఉద యం 3గంటలకు స్వామికి మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, 7గం టలకు సామూహిక అభిషేకాలు, 11గంటలకు కల్యాణోత్సవం నిర్వహిం చనున్నట్లు ఆలయ పూజారి శివకుమార్‌శర్మ తెలిపారు. రాత్రి 8గంటలకు అష్టోత్త ర కలశాభిషేకం, 10 గంటలకు అన్నాభిషేకం, 11గంటల నుంచి లింగోదర్బవ కాలంలో స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశి రుద్రాభిషేకం భక్తిశ్రద్ధలతో చేస్తామన్నారు. భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఆత్మకూరు లోని తిరునాళ్లతిప్పలో వెలసిన దుర్గా మల్లేశ్వరి ఆలయంలో ఉదయం 9గంటలకు ధ్వజా రోహణ, అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవం, తెల్లవారుజామున 2గంటలకు పార్వతీపరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తారు. రాత్రికి కూచిపూడి నట్య ప్రద ర్శన, పండిభజన తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. హనుమాన్‌జంక్షన్ వద్ద వెలసిన శ్రీనివాసేశ్వరస్వామి ఆలయంలో శ్రీనివాసేశ్వరుడు, రాజరా జేశ్వరి, భువనేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. వీరబ్రహ్మేం ద్రస్వామి దేవస్థానంలో ఉదయం 5 గంటల కు సుప్రభాతసేవ అనంతరం ప్రత్యేక పూజలు, ఉదయం 10 గంటలకు శ్రీగోవిందమాంబ సమేత వీరబ్ర హ్మేంద్రస్వాముల వారి కల్యాణం జరుప నున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పటిష్ట బందోబస్తు: జి.వేణు, సీఐ ఆత్మకూరు

పెద్దసంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్న శైవక్షేత్రాల వద్ద ప్రత్యేక పర్య వేక్షణతో ఎప్పటికప్పుడు పోలీసు సిబ్బంది అప్రమత్తం చేస్తాం. ఆత్మకూరులోని శివాలయం, తిరునాళ్లతిప్ప దుర్గామల్లేశ్వర ఆలయాల వద్ద సీఐతో పాటు ఎస్ ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, మహిళా పోలీసులు, కానిస్టేబుళ్లు, ఎన్‌సీసీ వాలం టీర్లను నియమించాం. అనంతసాగరం మండలం చిలకలమర్రి, కామిరె డ్డిపాడు, సోమశిల ఆలయాల వద్ద బందోబస్తు ఏర్పాట్లు చేశాం.

చేజర్ల: కోటిరామతీర్థంలోని కామాక్షి దేవ సమేత కోటీశ్వరస్వామి బహ్మో త్సవాలు బుధవారం అర్ధరాత్రి ధ్వజారోహణ కార్యక్రమంతో ఘనంగా ప్రా రంభమయ్యాయి. గురువారం తెల్లవారుజామున ఉత్సవమూర్తులకు గ్రా మోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు ఎస్‌ఐ ప్రభాకర్ తెలిపారు.

భీమేశ్వరుడికి వైభవంగా రావణసేవ



సంగం, మార్చి 7: శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా వంగల్లులో వెలసిన భీమేశ్వర స్వామి బుధవారం అర్ధరాత్రి రావణసేవపై భీమేశ్వరస్వామిని భక్తులు ఊరే గింపు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకామాక్షిదేవి సమేత స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి గజపూలమాలల తో అలంకరించి పూజలు చేశారు. గ్రామోత్సవానికి భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

ఆత్మకూరు, మార్చి 7: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు శుక్రవారం శ్రీకృష్ణా సేవాసమితి సభ్యులు పరీక్షా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు గుర్రం నాగేశ్వరరావు, కఠారి సుధాకర్, చీర్ల మస్తానయ్య మాట్లాడారు. నియో జకవర్గంలో చదువుతున్న 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధిం చిన ముగ్గురు విద్యార్థులకు నగదు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపా ధ్యా యురాలు అనంతలక్ష్మి, పేరెంట్స్ కమిటీచైర్మన్ వంటేరు మల్లికార్జున పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం


ఎంపీడీవోను సన్మానిస్తున్న పొదుపు మహిళలు

ఉదయగిరి రూరల్: అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక స్త్రీశక్తి భవనంలో గురువారం వై ఎస్‌ఆర్ క్రాంతి పథకం సభ్యులు మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఈశ్వరమ్మ, ఏపీ ఎం ఖాజారంతుల్లా మాట్లాడారు. మహిళ లు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికం గా సాధికారత సాధించేలా ముందడుగు వేయాలన్నారు. అనంతరం ఎంపీడీవో ఈశ్వరమ్మ, అకౌంటెంట్ విజయమ్మ, సంఘమిత్ర కార్యదర్శి పద్మావతి, కోశాధికారి చంద్రకళను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీసీలు రత్నకుమారి, అనిల్, సురేష్, వీవోఏ పాల్గొన్నారు.

రేపు అమరావతిలో దివ్యాంగుల మహాగర్జన

ఉదయగిరి, మార్చి 7: అమరావతిలో శనివారం నిర్వహించే దివ్యాంగుల మహాగర్జనను విజయవంతం చేయాలని వికలాంగుల సంఘం నాయకులు గోచిపాతల వెంకటేశ్వర్లు, పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక స్టేట్‌పేట మదర్‌థెరిస్సా స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో మహాగర్జనకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బకీరు జాషువా, బెజవాడ బాలగురవయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఉదయగిరి రూరల్, మార్చి 7: సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈవీఎంల పనితీరుపై స్థానిక స్త్రీశక్తి భవనంలో గురువారం మండల అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నియో జకవర్గ ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి నెహ్రూబాబు, స్వీప్ నోడల్, సహాయ నోడల్ అధికారులు బాలకేశవులు, ఖాజారంతుల్లాలు ఈవీఎంల ద్వారా ఏలా ఓటు వేయాలనే విషయాలను మహిళలకు అవగాహన కల్పించారు. సెక్టారు అధికారి సురేష్ మహిళలతో ప్రత్యక్షంగా ఓటు వేయించారు. ఈ కార్యక్రమంలో సీసీలు, పొదుపు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలి


మాట్లాడుతున్న ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి

ఆత్మకూరు, మార్చి 7: వేసవిదృష్ట్యా గ్రామా ల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది తాగునీటి ఇబ్బందులు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మండలాధ్యక్షుడు కేతా వేణు గోపాల్‌రెడ్డి సూచించారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన మండల సమావేశంలో మాట్లాడారు. మండల అభి వృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కలిసి పనిచేయాలన్నారు. వైద్య, ఆరోగ్య, వ్యవసాయ శాఖలపై, పంచాయతీరాజ్ పనులు, ఐసీడీఎస్, విద్యుత్, రహదారులు తదితర అంశాలపై చర్చించారు. ప్రజాప్రతినిధులు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. కార్యక్రమం లో జెడ్పీటీసీ సభ్యురాలు పెమ్మసాని ప్రసన్నలక్ష్మి, మండల ఉపాధ్యక్షుడు యు.పెంచలరావు, కె.ప్రమీల, ఆత్మకూరు సొసైటీ చైర్మన్ సానా వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీవో బాలాజీనాయక్, ఏవో శ్రీనివాసులు, ఈవోపీఆర్డీ ఉషారాణి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పారిశ్రామికవాడకు నీటిని తరలిస్తే ఉద్యమిస్తాం


కమిషనర్ షేక్ ఫజుల్లలాకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు, మార్చి 7: నారంపేటలోని పారిశ్రా మికవాడకు పాతజంగాలపల్లి వద్ద నుంచి వాల్వ్ గేట్‌ను అమర్చి నీటి సరఫరా చేస్తే ఉద్యమిస్తామని సీపీఎం నాయకులు కె.డేవిడ్‌రాజు, జి.లక్ష్మీపతి డి మాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు కమి షనర్ షేక్‌ఫజుల్లలాకు వినతిపత్రం అంజేసి మాట్లా డారు. నీటిని మళ్లిస్తే భవిష్యత్‌లో ప్రజలకు నీటి ఇబ్బందులు వస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే రెండురోజులకు ఒకసారి తాగునీటిని సరఫరా అయ్యే పరిస్థితి ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్‌చైర్మన్ షేక్ సందాని పాల్గొన్నారు.

7యంఆర్‌పి1 సంతాపం తెలియజేస్తున్న కళాశాల సిబ్బంది, విద్యార్థులు

ఫిజిక్స్ అధ్యాపకుడి మృతికి సంతాపం


నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

మర్రిపాడు, మార్చి 7: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫిజిక్స్ అధ్యాపకులు కమల్ హసన్ మృతికి గురువారం సిబ్బంది, విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో సంతాపం తెలిపారు. ఆయ న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పిం చారు. ఇంటర్ పరీక్షల సందర్భంగా ఉదయగిరి లో డిపార్ట్‌మెంట్ అధికారిగా గుండెపోటుతో మృతి చెందడం విచారకరం అన్నారు. కొన్నేళ్లగా కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేసిన అతని కుటుంబాన్ని ఆదుకో వాలని తోటి అధ్యాపకులు కోరారు.

మొక్కుబడిగా అనంతసాగరం మండల సమావేశం

అనంతసాగరం, మార్చి 7: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల సమావేశం మొక్కుబడిగా జరిగింది. కొన్నిశాఖల అధికారులు మాత్రం సమావేశానికి హాజరయ్యారు. గ్రామాల్లోని సమస్యలపై ఎలాంటి చర్చ జరుగలేదు. సమావేశానికి రాని అధికారులపై చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సంపూర్ణమ్మ, ఎంపీడీవో తాజ్ మస్రూర్, స్పోర్ట్స్ డైరెక్టర్ కాలువ నరసింహులు పాల్గొన్నారు.

సీతారామపురం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి అధ్యక్షతన గురువారం జరిగిన మండల సమావేవం ప్రశాంతంగా ముగిసింది. సమావేశంలో తాగునీరు, జాతీ య గ్రామీణ ఉపాధిహామీ, పారిశుధ్యంపై వాడీవేడిగా చర్చ జరిగింది. మండలలో తాగునీరు, పారి శుధ్యం, డ్రైనేజీ, సిమెంట్ రోడ్లపై చర్చలు జరిపారు. వేసవికాలం నీటిని వృథా చేయకుండా జాగ్ర త్తగా వాడుకోవాలని, ఎక్కడ నీటి సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని ఎంపీపీ చింతం రెడ్డి పద్మావతి తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రమణరెడ్డి, ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్, మండల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నిరుపయోగంగా శుద్ధిజల కేంద్రం


పాఠశాలలో మూలనపడ్డ సామగ్రి,మిషన్లు

ఉదయగిరి రూరల్: బిజ్జంపల్లి జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాలలోని శుద్ధిజల కేంద్రం యంత్రాలు మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఈ సమస్యతో బిజ్జంపల్లితో పాటు కృష్ణారెడ్డిపల్లి, లింగం నేనిపల్లి గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు తాగునీటి తిప్పలు తప్పడం లేదు. ప్రత్యామ్నాయంగా వీరు గ్రామాల నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు. గతంలో వైఎస్‌ఆర్ సుజల స్రవంతి పథకం నుంచి శుద్ధిజలం సరఫరా చేసేవారని, ప్రస్తుతం అదీ కూడా మూతపడడంతో తాగునీటి తీవ్ర ఇబ్బందులు తప్పవంటున్నారు.

మల్లన్నకు మృగరాజ వాహన సేవ

కావలిటౌన్, మార్చి7: కావలి పట్టణ పాతూరులోని ప్రాచీన శివాలయం కుంభమాన తిరునాళ్ళ శ్రీ దుర్గా భ్రమరాంబా సమేత మల్లేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం మల్లన్నకు మృగరాజ వాహన సేవలు చేశారు. రాత్రి మల్లన్న హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.

మహిళలంతా ఉచిత న్యాయ సహాయానికి అర్హులే!

- ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి పూర్ణిమ


కందుకూరులో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి పూర్ణిమాదేవి

కందుకూరు: మహిళలందరూ ఉచిత న్యాయసహాయానికి అర్హులేనని మహిళల రక్షణ కోసం ఎన్నో ప్రత్యేక చట్టాలు అమలులో ఉన్నాయని కందుకూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి పూర్ణిమాదేవి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల న్యాయసేవా ధికార సంఘం ఆధ్వర్యంలో ఉచిత న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఏ ప్రమీలారాణి, ఏజీపీ కే హరికోటేశ్వరరావు, సీనియర్ న్యాయవాది కె కోటయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు యు ప్రభావతి, ఎల్ లక్ష్మీదేవమ్మ, వరల్డ్‌విజన్ స్వచ్ఛంద సేవాసంస్థ మేనేజరు ఎస్ జయకుమార్, అంగన్వాడీలు, టీచర్లు పాల్గొన్నారు.

- స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికార విభాగం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం రవికుమార్ మాట్లాడుతూ మహిళలు ఆత్మవిశ్వాసంతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీఏసీ కోఆర్డినే టరు డాక్టరు పి రాజగోపాలబాబు, అధ్యాపకులు సిహెచ్ శ్రీనివాసరావు, షేక్ షానాజ్‌బేగం, కొమ్మనబోయిన సుజాత, ఐ. అనూష, రామకృష్ణ, మహమ్మద్ మహబూబ్, మార్టిన్ లూథర్ పాల్గొన్నారు.
- కందుకూరు ఏరియా ఆసుపత్రిలో మహిళా దినోత్సవాన్ని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టరు శకుంతల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు డాక్టరు ఇంద్రాణి బహుమతులు అందజేశారు.

కావలి, మార్చి 7: కావలి పట్టణ వెంగళరావునగర్‌లోని శ్రీపొట్టిశ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో గురువారం ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హయ్యాల్ హయ్యూమ్ ఆధ్వర్యంలో పాఠశాల మేనేజిమెంట్ కమిటీ చైర్మన్ అమరజ్యోతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయినులు బి శాంతకుమారి, బీ శర్వాణి, షేక్ షాబిరా బేగమ్, ఏ లక్ష్మీ, జీ మారమ్మ, వై రజనీ, బీ సుమనా, టీ కనకలక్ష్మీ, వీ హేమలత, షేక్ షఫియా, అనురాధ, టీ రమాదేవి, ఏ అరుణ, ఆర్. మృదుల, మధ్యాహ్న భోజనం ఏజన్సీ నిర్వహకురాలు షేక్ చాన్ బేగమ్, సామాజిక సేవకురాలు కే అశ్వనీ పలువురు ఆయాలను సత్కరించారు.

- **బిట్రగుంట:** బోగోలు మండలం కడనూతల ఆర్‌ఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ వీవీఎస్ రెడ్డి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా జేఎన్‌టీయుఏ ప్రొఫెసర్ వీబీ చిత్ర, కావలి ప్రముఖ న్యాయవాది జే శ్రీదేవి, వైద్యులు శ్రీరామ్ మధు లికలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏవోఆర్ రమణారెడ్డి, హెచ్‌అండ్ ఎస్‌హెచ్‌వోడి డాక్టర్ లక్ష్మీ, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, బీటెక్ విద్యార్థులు తదిత రులు ఉన్నారు.

అల్లూరు: సమాజంలో ప్రతిఒక్కరూ మహిళలను గౌరవించాలని అల్లూరు సబ్ రిజిస్ట్రారు ప్రసన్నలక్ష్మి సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని అల్లూరులోని సబ్‌రిజిస్ట్రారు కార్యాలయంలో దాదాపు 35 ఏళ్లుగా స్వీపర్‌గా పనిచేస్తున్న కోటేశ్వరమ్మను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వంశీకృష్ణ, నాగేశ్వరరావు, శాంతి, సుకన్య, అపర్ణ, ద స్తావేజు లేఖరులు, స్టాంపు వెండర్లు పాల్గొన్నారు.

మహాశివరాత్రి పూజల ప్రారంభం

బిట్రగుంట, మార్చి 7: బోగోలు మండలంలోని శివాల యాల్లో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు గురువారం ప్రారంభమయ్యాయి. నాగులవరం పంచాయతీలో గంగాపార్వతి సమేత నాగలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామి అమ్మవార్లకు అభిషేకాలు, పూజలు జరిగాయి. సాయంత్రం చైన్నారెడ్డి పాలెంలోని నాగులపుట్ట వద్ద పూజలు చేసి పుట్టబంగారాన్ని కాండ్ర కుటుంబ సభ్యులు తీసుకువచ్చారు.

30 మంది పోలీసులతో బందోబస్తు

లింగసముద్రం, మార్చి 7: మహాశివరాత్రి సందర్భం గా లింగసముద్రంలోని శ్రీ తిరుమణిశెట్టి కోటయ్య మం దిరం, మొగిలిచెర్లలోని శ్రీ దత్తాత్రేయస్వామి ఆలయం వద్ద 30మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు గుడూ రు సీఐ జి సుబ్బారావు చెప్పారు. గురువారం సాయ ంత్రం లింగసముద్రం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై ఎం బాజీ బాబుతో కలిసి ఆయన మాట్లాడుతూ గుడ్లూరు, లింగ సముద్రం, వలేటివారిపాలెం పోలీస్‌స్టేషన్‌లలోని 30 మం ది పోలీసులు, తనతో పాటు లింగసముద్రం, గుడ్లూరు, వలేటివారిపాలెం, కందుకూరు రూరల్ పోలీస్‌స్టేషన్ల ఎస్సై లు బందోబస్తు నిర్వహిస్తారని ఆయన చెప్పారు.

జలదంకిలో కాకర్ల పర్యటన

జలదంకి, మార్చి 7: ఉదయగిరి అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ మండలంలో గురువారం పర్యటిం చారు. ముందుగా ఆయన బీకే అగ్రహారం గ్రామంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు బండారు తిరుపతిరెడ్డి ఇంటికి వెళ్ళి తన గెలుపునకు సహకరించాలని కోరారు. అనంతరం కమ్మవారిపాలెం వెళ్ళి టీడీపీ సీనియర్ నాయకుడు పచ్చా పెంచలయ్యనాయుడు తల్లి కౌసల్యమ్మ పెద్దకర్మకు హాజరై ఆమెకు నివాళులర్పించారు. ఇదే కార్యక్రమానికి హాజరైన టీడీపీ జాతీయ నాయకుడు, మాజీ చిన్నతరహా పరిశ్రమల డైరెక్టర్ కంచర్ల విజయభాస్కర్‌తో సమావేశమయ్యారు. అనంతరం మండలంలోని బ్రాహ్మణక్రాక గ్రామంలో పలు వురు టీడీపీ నాయకులను కలుసుకుని తనకు సహకరిం చాలని కోరారు. ఆయన వెంట ఎన్‌ఆర్‌ఐలు వి భాస్కర్ రెడ్డి, కాకర్ల సునీల్, పలువురు నాయకులు పాల్గొన్నారు. కాగా, కాకర్ల సురేష్‌ను భారీ మెజారిటీతో గెలిపించా లంటూ జలదంకి మండలానికి చెందిన యువకులు గురు వారం సాయంత్రం భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో టీడీపీ యువనేతలు గంటా అశోక్, కాసు చెంచు నాయుడు, మహేంద్రరెడ్డి, జనసేన యువనేత నిమ్మలపల్లి రామ్‌చైతన్య తదితరులు పాల్గొన్నారు.

గెలిపిస్తే న్యాయం చేస్తా : పసుపులేటి

అల్లూరు, మార్చి 7: స్వతంత్ర అభ్యర్థిగా కావలి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపిస్తే న్యాయం చేస్తా. ఓడితే సహాయం చేస్తా అని పసుపులేటి సుధాకర్ అన్నారు. అల్లూరులోని పార్టీ కార్యా లయంలో గురువారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలే కరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతన ఒరవ డిని సృష్టించే మేనిఫెస్టోతో ఎన్నికల బరిలో ఉంటున్న త నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు ఆయన సమక్షంలో పార్టీలో చేరా రు. ఈ కార్యక్రమంలో పసుపులేటి వెంకటేశ్వర్లు, ఎల్లు సాల్మన్‌రాజు, దర్శిగుంట వాసు, గోళ్ళ హరికృష్ణ, గుమ్మడి రాజేష్, కాకాని రంగయ్య, ఎల్లు సుబ్రహ్మణ్యం, కర్రా మల్లి కార్జున తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు ఆశీర్వదించాలి : విజయసాయి రెడ్డి

కావలి టౌన్, మార్చి 7: ప్రజలు ఆశీర్వదిస్తే ఎంపీ నవుతానని రాజ్యసభ సభ్యుడు వైసీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణ ఆర్‌ఎస్‌ఆర్ కల్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి సర్వసభ్య సమావేశం ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న విజయసాయిరెడ్డికి నియోజకవర్గ పార్టీ నేతలు, ప్రజా ప్రతినిధులను ఎమ్మెల్యే పరిచయం చేశారు. మూడవ సారి అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి కోరారు. సమావేశంలో వైసీపీ కందుకూరు నియోజకవర్గ పరిశీలకుడు సుకుమార్ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ దేవరాల సుబ్రమణ్యం, మాజీ మున్సిపల్ చైర్మన్ నగళ్ల శ్రీనివాస్‌కిరణ్, తదితరులు పాల్గొన్నారు. కాగా, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి అన్నపూర్ణ శ్రీనివాసులు విజయసాయిరెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావుల సమక్షంలో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ కండువా కప్పుకున్నారు. టీడీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలు ద్రోణాదుల వాసంతి, బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు వెంకట్రావు దంపతులు, టీడీపీ మాజీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మురళీ తదితరులు టీడీపీని వీడి వైసీపీలో చేరారు.

మామిడి సాగుపై అవగాహన

ఉలవపాడు, మార్చి 7: మామిడి సాగులో పాటిం చాల్సిన సస్యరక్షణ చర్యలపై గురువారం రైతులకు అవగాహన కార్యక్రమం జరిగింది. జిల్లా ఉద్యాన అధికారి సుబ్బారెడ్డి, రైల్వేకోడూరుకు చెందిన మామిడి శాస్త్రవేత్త సందీప్ నాయక్‌లు భీమవరం, కే రాజుపాలెం, ఆత్మకూరు పరిసర ప్రాంతాలలో సాగులో ఉన్న మామిడి పూతలను పరిశీలించి రైతులకు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యాన అధికారి బీ జ్యోతి, గ్రామ ఉద్యాన సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

3వ వార్డులో టీడీపీ ఇంటింటి ప్రచారం


ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, మార్చి 7: పట్టణంలోని 3వ వార్డు ఉప్పు చెరువు ప్రాంతంలో టీడీపీ ఇన్ చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం సాయ ంత్రం బాబు ష్యూరిటీ - భవిష్య త్తుకు గ్యారంటీ కార్యక్రమం ని ర్వహించారు. సూపర్‌సిక్స్ ప థకాలపై ప్రచారం నిర్వహిం చారు. వైసీపీ ప్రభుత్వాన్ని సాగ నంపటానికి ప్రజలు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, ముచ్చు శ్రీను, పువ్వాడి కోటయ్య, వడ్డెళ్ల రవిచంద్ర, రెబ్బవరపు మాల్యాద్రి, రాయపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దేవయ్య మృతికి సంతాపం

లింగసముద్రం: స్థానిక జంగంరెడ్డిపాలెం గ్రామ టీడీపీ నాయకుడు కొట్టే శేషాద్రి నాయుడు తండ్రి కొట్టే దేవయ్య(80)మృతికి కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు సంతాపం వ్యక్తం చేశారు. గురువారం ఇంటూరి శేషాద్రి నాయుడు ఇంటిని సందర్శించి, దేవయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

- **శేషయ్యకు పరామర్శ**

అలాగే బలిజపాలెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బింకం శేషయ్య మోటారు సైకిల్‌పై నుంచి పడి కాలికి దెబ్బ తగిలి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న నాగేశ్వరరావు శేషయ్యను కూడా పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కండే మాలకొండయ్య, గాలంకి ప్రసాద్, అడపా రంగయ్య, మైల రామ కేశవులు, జంపాల శివప్రసాద్, కిలారి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతలపై విమర్శలు అర్థరహితం

బిట్రగుంట : టీడీపీ నేతలపై విమర్శలు అర్థరహితం అని టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు అన్నారు. బోగోలు మండల టీడీపీ కార్యాలయంలో గురువారం విలే కర్ల సమావేశం జరిగింది. వైసీపీ మండల కన్వీనర్ వీరరఘు బుధవారం టీడీపీ నాయకులపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఎన్నికల సమయంలో ఏ పార్టీకి చెందిన వారైనా మారడం సర్వసాధారణమని అన్నారు. అయితే టీడీపీలో చేరితే వ్యంగ్యంగా మాట్లాడడం వైసీ పీలో చేరితే గొప్పగా మాట్లాడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కాండ్ర ర ఘురామ్ నాయుడు, ఎల్ సుధీర్‌బాబు, కోడూరు వేంకటేశ్వర్లురెడ్డి, పైడిశ్రీహర్ష, బంకాజయ రాజ్, పొట్టేల హరిబాబు, నరసింహారావు, చల్లాక్రాంతి, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

కావలి, మార్చి 7: కావలి పట్టణ వాయునందన ప్రెస్‌వీధిలో మంచినీటి, మజ్జిగ చలివేంద్రాన్ని టీడీపీ లీగల్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు పోట్లూరి శ్రీనివాసులు గురువారం ప్రారంభించారు. టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి సహకారంతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పోట్లూరి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువత మారిశెట్టి శ్రీకాంత్, స్వప్న, కటూరి వెంకటేష్, అమరా వెంకటేష్, వెల్లంకి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్‌లో వడ్డెరలకు ప్రాధాన్యం : శీనయ్య


మాట్లాడుతున్న పల్లపు శీనయ్య తదితరులు

కావలి, మార్చి7: బీసీ డిక్ల రేషన్‌లో వడ్డెరలకు ప్రాధాన్యత కల్పించారని ఏపీ సమైక్య వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లపు శీనయ్య తెలి పారు. ముసు నూరులోని టీడీపీ కార్యాలయం లో గురువారం ఆయన విలేక రులతో మాట్లాడారు. బీసీలకు 50 ఏళ్లకే రూ.4వేలు పింఛన్ అమలుచేస్తాననటం బీసీల పట్ల వారికున్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో ఉన్న 30 లక్షల మంది వడ్డెరలు టీడీపీ-జనసేన ప్రభుత్వం ఏర్పడేలా కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పసుపులేటి వెంక టేశ్వర్లు, రాపూరు అనిల్‌కుమార్, పల్లపు శివ, మంచాల విజయ్, పల్లపు నారాయణ, పల్లపు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల మహాగర్జన సభను జయప్రదం చేయండి

కావలిటౌన్, మార్చి 7: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగ నాయకత్వంలో ఈనెల 19న అమరావతిలో జరగనున్న దివ్యాంగుల మహాగర్జనను జయప్రదం చేయాలని ఎమ్మార్పీస్ నాయకులు చేవూరు కిరణ్‌కుమార్ కోరారు. గురువారం ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో మహాగర్జన కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో యేసు, రాజ్‌కుమార్, కత్తి శివయ్య, రాజేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ పరిజ్ఞానాన్ని రైతులకు చేరవేయాలి

కందుకూరు, మార్చి 7: శాస్త్రీయ పరిజ్ఞానాన్ని రైతులకు చేరవేయాలని ఐసీఏఆర్ డెరెక్టర్ కమ్ చైర్మన్ డాక్టర్ ఎం శేషుమాధవ్ కోరారు. కందుకూరులోని కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టరు జి ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో శాస్త్రీయ సలహాసంఘ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న శేషుమాధవ్ మాట్లాడుతూ పెట్టుబడి ఖర్చు తగ్గించుకుని అధిక దిగుబడులు సాధించేలా రైతులను చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో దర్శి కేవీకే సమన్వయకర్త డాక్టరు దుర్గాప్రసాద్, ఆత్మ సంచాలకులు అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ఒంగోలు క్రైం, మార్చి7: అతివేగం నిండు ప్రాణం బలిగొంది. గురువారం మధ్యాహ్నం ఒంగోలు నగరం దక్షణ బైపాస్ సర్వీస్‌రోడ్డులో జరిగిన ప్రమాదంలో నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం చాగొల్లుకు చెందిన కొనిక తిరమలరావు (30) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తిరుమలరావు ఒంగోలు నుంచి నెల్లూరు వైపు దక్షణ బైపాస్ సర్వీస్‌రోడ్డులో ద్విచక్రవాహనంపై అతివేగం గా వెళుతూ రోడ్డు పక్కన పార్కు చేసివున్న ఆటోను, దాని పక్కనే ఉన్న సోడా బండీని సైతం ఢీకొట్టడంతో అదుపు తప్పి కిందపడ్డాడు. దీంతో తిరుమలరావు రోడ్డుమీద పడడంతో తలకు తీవ్రమైన గాయాతో రక్తస్రావమై అక్కడిక్కడే మరణించాడు. ఈ మేరకు తాలుకా పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు.